ముహూర్తం
శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం,
హేమంత ఋతువు, మార్గశిర మాసం, కృష్ణపక్షం.
తిథి: దశమి సా.5.40. వారం: శనివారం.
నక్షత్రం: చిత్త రా.8.44. అమృతకాలం: మ.2.44 నుండి
సా.4.44. వర్జ్యం: ఉ.శే.వ.7.13. రా.2.01 నుంచి 3.32
వరకు. దుర్ముహూర్తం: ఉ.6.36 నుంచి 8.05 వరకు.
రాహుకాలం: ఉ.9.30 నుంచి 10.30 వరకు.
యమగండం: మ.1.30 నుంచి 3.00 వరకు.
సూర్యోదయం: 6.41, సూర్యాస్తమయం: సా.5.47.

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:58 • సంచిక: 242 • శనివారం 21 డిసెంబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 5.00

Published from:Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం
srisharanamedia.com



చాగంటి కోటేశ్వరరావుకు వీణ బహుకరిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు దంపతులు

## తెలంగాణ.. పక్కా సెక్యులర్!

### చాగంటి.. మానవజాతికి మణిపూస

మారుతున్న మానవ ప్రవృత్తికి ప్రవచనాలే దివ్యౌషధం
భాగవత సప్తాహం ముగింపు కార్యక్రమంలో సీఎం కేసీఆర్

### కులమతాలకు అతీతంగా పాలన

అందరితో సమానంగా క్రైస్తవ బిడ్డలకు సంక్షేమ పథకాలు
క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబురాలు ప్రారంభించిన సీఎం కేసీఆర్

3



ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ సంబురాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

ఏపీ రాజధానికి నిపుణుల కమిటీ ఇచ్చిన కొత్త రూపమిదే

# 4 రీజియన్లు

విశాఖలో సెక్రటేరియట్, సమ్మర్ అసెంబ్లీ.. కర్నూలులో హైకోర్టు, అమరావతిలోనే అసెంబ్లీ, రాజ్‌భవన్

# రాజధానులు 3

**ఉత్తరాంధ్ర :** విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం
**మధ్య కోస్తా :** తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా
**దక్షిణ కోస్తా :** గుంటూరు, ప్రకాశం, నెల్లూరు
**రాయలసీమ :** కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు

విశాఖ, అమరావతిలో సీఎంవోలు
మంత్రులకు రెండు ప్రాంతాల్లోనూ పేషీలు • విశాఖ, అమరావతిలో హైకోర్టు బెంచ్‌లు • కర్నూలులో వేసవి అసెంబ్లీ భేటీ • అమరావతిలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు • సీఎంకు నిపుణుల కమిటీ నివేదిక



**అమరావతి, ఆంధ్రప్రభ:** విశాఖపట్టణంలో సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, హైకోర్టు బెంచి...కర్నూలులో హైకోర్టు.. అమరావతిలో అసెంబ్లీ, గవర్నర్ కార్యాలయం, రాజ్ భవన్, హైకోర్టు బెంచి.. జీ.ఎన్.రావు కమిటీలోని కీలకమైన అంశాలివే. ఏపీ రాజధాని ఏర్పాటు, ఇతర అంశాలపై అధ్యయనం చేసేందుకు విశ్రాంత సీనియర్ ఐఎఎస్ అధికారి జి.ఎన్. రావు నేతృత్వంలో నియమించిన నిపుణుల కమిటీ శుక్రవారం సాయంత్రం ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి నివేదిక అందించింది. అనంతరం కమిటీలోని ఇతర సభ్యులతో 8వ పేజీలో...



భవన నిర్మాణాలకు ఇక వేగంగా అనుమతులు
త్వరలోనే కొత్త పురపాలక చట్టం: మంత్రి కేటీఆర్

## మున్సిపాలిటీల్లో ల్యాండ్ పూలింగ్

# ఇళ్లకు ఈజీ పర్మిట్లు

పారదర్శకతే లక్ష్యం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మున్సిపాలిటిల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు లేకుండానే భవనాలను కూల్చివేయడం జరుగుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజల సౌకర్యం, సంతోషమే లక్ష్యంగా నూతన పురపాలక చట్టాన్ని తీసుకొస్తున్నట్లు, ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఇళ్లు నిర్మించుకునే వారికి సులభంగా, అత్యంత పారదర్శకంగా, వేగంగా అనుమతులు పొందే విధానం నూతన చట్టం తీసుకొస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఉన్న అరు పట్టణాభివృద్ధి సంస్థలు, హెచ్ఎండీఏ విజయవంతంగా అనుసరిస్తున్న ల్యాండ్ పూలింగ్ వంటి పద్దతులను మున్సిపాలిటిల్లోనూ అమలు చేయాలని మంత్రి కేటీఆర్ 3వ పేజీలో...

## అక్కడి మార్పులకు ఇక్కడ రెక్కలు

ఏపీలో మూడు రాజధానుల ప్రతిపాదనతో హైదరాబాద్‌లో ఆకాశాన్నంటుతున్న భూముల ధరలు • అమరావతి నుంచి మకాం మార్చిన స్థిరాస్తి వ్యాపారులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల్లో రాజధానులను ఏర్పాటు చేయాలని సీఎం జగన్ నిర్ణయించిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. నివాస స్థలాలు, ఫ్లాట్ల ధరలను పెంచేందుకు స్థిరాస్తి వ్యాపారులు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్య, మధ్య తరగతి 8వ పేజీలో...

ఉన్నావ్ రేప్ కేసులో

## సెంగార్‌కు జీవిత ఖైదు



రూ.25లక్షల జరిమానా
బాధితురాలి కుటుంబానికి పరిహారం అందజేసి, రక్షణ కల్పించాలి
తీస్ హజారీ కోర్టు తీర్పు 9



గుజరాత్‌లోని కచ్‌లో పాకిస్తానీ హిందూ శరణార్థులకు భారతీయ పౌరసత్వ సర్టిఫికెట్లు ఇస్తున్న కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవ్య

## పౌర పోరులో ఆరుగురు మృతి

మరోవైపు పౌరసత్వ పత్రాల ప్రదానం

కచ్‌లోని మోర్బీ శిబిరంలో పత్రాల అందజేత.. సంబరాలు
దేశవ్యాప్తంగా పలు నగరాల్లో సీఏఏకు మద్దతుగా ర్యాలీలు 9

## ఇంగ్లీష్ జీవోకు తాత్కాలికంగా బ్రేక్!

నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వానికి ఆదేశం
మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నో
విచారణ జనవరి 27కు వాయిదా 7

గూఢచర్యం

## ఏడుగురు దేశద్రోహుల అరెస్ట్

భారత నౌకాదళ రహస్యాలను పాక్‌కు చేరవేస్తూ పట్టుబడ్డ నేవీ అధికారులు • విశాఖతో పాటు వివిధ చోట్ల అరెస్టులు • పోలీసుల అదుపులో ఓ హవాలా డీలర్
విజయవాడ ఎన్ఐఏ కోర్టులో నిందితులను హాజరుపర్చిన పోలీసులు • జ్యూడిషియల్ రిమాండుకు తరలింపు




**విశాఖక్రైం, ప్రభన్యూస్:** సొంత దేశానికి ద్రోహం చేస్తూ, దాయాది పాకిస్తాన్ దేశానికి మేలు చేసే విధంగా భారత్ నౌకాదళ సముద్ర రక్షణశాఖకు చెందిన అనేక రహస్యాలను చేరవేస్తున్న ఏడుగురు నేవి అధికారులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పలు చోట్ల జరిగిన ఈ అరెస్టులు దేశంతో పాటు రాష్ట్రంలో కూడా సంచలనం సృష్టిస్తున్నాయి. పోలీసు వర్గాలు అందించిన వివరాల ప్రకారం విశాఖ కేంద్రంగా తీర ప్రాంతానికి సంబంధించిన రహస్యాలను పాకిస్తాన్‌కు చేరవేస్తున్న ఏడుగురు నేవీ అధికారులును సెంట్రల్ ఇంటెలిజెన్స్ అధికారులు ఈ మేరకు అరెస్ట్ చేశారు. కేంద్ర నిఘా వర్గాలు, ఏపీ ఇంటెలిజెన్స్ అధికారుల ఆధ్వర్యంలో 7వ పేజీలో...

www.homeocare.in
మీకు తెలుసా ఆస్తమా ప్రాణాంతకరం అని?
అవును అది నిజం. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో ఆస్తమా వల్ల ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య ఎక్కువ.
అతి ప్రమాదకరమైన ఆస్తమా ఇప్పుడు కాన్స్‌టిట్యూషనల్ హోమియోపతి ద్వారా మీరు దూరం చేసుకొని సుఖమైన జీవితాన్ని పొందవచ్చు.
హోమియోకేర్ "ఆప్" డౌన్‌లోడ్ చేసుకోండి 10% డిస్కౌంట్ పొందండి Use Code: ANP10
స్పెషాలిటీ చికిత్సలు
అలర్జిక్ రైనైటిస్ | సైనసైటిస్ | నాసల్ పాలిప్స్ | ఆస్తమా
అలర్జిక్ బ్రాంకైటిస్ | అలర్జిక్ జలుబు మరియు దగ్గు
టాన్సిలిటిస్ | అడినాయిడ్స్ | మైగ్రేన్ | దీర్ఘకాలిక తలనొప్పి
HOMEOCARE INTERNATIONAL
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
వరల్డ్-క్లాస్ హోమియోపతి
ఉచిత కన్సల్టేషన్ 955 000 1199
టోల్ ఫ్రీ 1800 108 1212
హైదరాబాద్ : (అబిడ్స్ | బేగంపేట్ | కూకట్‌పల్లి | దిల్‌సుఖ్‌నగర్ | జూబ్లీహిల్స్ | మాసాబ్‌ట్యాంక్ | మియాపూర్) హనుమకొండ | కరీంనగర్ | నిజామాబాద్ | మహబూబ్‌నగర్ | ఖమ్మం | విజయవాడ | విశాఖపట్నం | తిరుపతి కాకినాడ | రాజమండ్రి | గుంటూరు | ఒంగోలు | నెల్లూరు | కర్నూలు | కర్ణాటక | తమిళనాడు | పుదుచ్చేరి

ఔరా..!






బొల్లారంలో రాష్ట్రపతి
హకీంపేట్ ఎయిర్‌పోర్ట్‌లో రామ్‌నాథ్ కోవింద్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ తమిళి సై 2



# రాష్ట్రపతికి ఘన స్వాగతం

**హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో గవర్నర్, సీఎం, ఉభయ సభాపతుల సాదర స్వాగతం**

**అక్కడి నుంచి నేరుగా బొల్లారం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన కోవింద్ దంపతులు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగ తం పలికింది. భారత వాయుసేన ప్రత్యేక విమా నంలో ఢిల్లీ నుంచి బయలుదేరిన ఆయన శుక్రవారం మధ్యా హ్నం 12.55 గంటలకు హకీంపేట లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ దంపతులు, సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పలువురు మంత్రులు, నగర మేయర్ బొంతు రామ్మో హన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు గవర్నర్ దంపతు లకు సాదర స్వాగతం పలికారు. హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రులు హరీష్‌రావు, కేటీ రామారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి తదితరులు గవర్నర్ దంపతులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం ప లి కారు. రాష్ట్ర ప్రభుత్వ పోలీసు గౌరవ వందనాన్ని స్వీక రించిన రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ఆయన సతీమణి సవితా కోవింద్ అక్కడి నుంచి నేరుగా రోడ్డుమార్గంలో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి వెళ్ళారు.

రాష్ట్రపతి రాక నేపథ్యంలో ప్రోటోకాల్, పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పా టు చేశారు. మధ్యాహ్నం హకీంపేట విమానాశ్ర యానికి రాష్ట్రపతి చేరుకున్నప్పటి నుంచి బొల్లారం రాష్ట్రపతి భవన్‌కు వెళ్ళేంత వరకు రహదారికి ఇరు వైపులా భారీ గా పోలీసులను మోహరింపజేశారు. ఈ పర్యటనకు సం బంధించి గత వారం రోజులుగా ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి డాక్టర్ ఎస్‌కే జోషి బందొ బస్తు, ట్రాఫిక్, నిరంతర విద్యుత్ సరఫరా, రోడ్ల మర మ్మతు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థ తదితర ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రపతి నిలయంలో సీసీటీవీలు, మెడికల్ టీమ్‌లు, టెలి ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం, పత్రికలు అందుబాటులో ఉంచారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి విధుల్లో ఉండేవిధంగా శాఖల సిబ్బంది వివరాలను కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

రాంనాథ్ కోవింద్ దక్షిణాది రాష్ట్రాల శీతాకాల విడిదికి సంబంధించి రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ముందస్తు షెడ్యూల్ వివరాల ప్రకారం 20 నుంచి 22వ తేదీవరకు రాష్ట్రపతి నిలయంలోనే బసచేస్తారు. 23న తిరువనంతపురం పర్యటనకు వెళ్తారు. 26న సాయం త్రం తిరిగి రాష్ట్రపతి హైదరాబాద్ చేరుకుంటారు. 27న రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వ హిస్తారు. 28న మధ్యాహ్నం తిరిగి హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళతారు.

# జనవరిలో ఆపరేషన్ స్మైల్

**పోలీస్, విద్యా, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల వర్క్‌షాప్‌లో డీజీపి మహేందర్ రెడ్డి**




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో తప్పిపోయిన పిల్లలను గుర్తించడంతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్-6 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి ప్రకటించారు. ఆపరేషన్ స్మైల్-6 నిర్వహణపై శుక్రవారం డీజీపీ కార్యాలయంలో పోలీసు అధికారులు విద్యా, మహిళా, శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీజీపీ మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఉమెన్ సేఫ్టీ విభాగం స్వాతి లక్రా, లీగల్ సర్వీసుల అథారిటీ కార్యదర్శి జీవీ సుబ్రహ్మణ్యం, విద్యాశాఖ సంచాలకులు విజయ్ కుమార్, ఎస్పీ బి.సుమతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని కేవలం ఒక నెలకు పరిమితం చేయకుండా సంవత్సరం పాటు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. తప్పిపోయిన పిల్లలను, ట్రాఫికింగ్‌కు గురైన పిల్లలు, బాల కార్మికులుగా ఉన్నవారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించడం అనేది గొప్ప కార్యమని, ఈ విషయంలో కేవలం ఉద్యోగం చేస్తున్నామనే భావనతో కాకుండా మానవతా దృక్పథం, విశ్వసనీయతతో విధులను నిర్వహించినపుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. పసిపిల్లల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు మహేందర్‌రెడ్డి సూచించారు. ఆపరేషన్ స్మైల్-6 కార్యక్రమ నిర్వహణలో పోలీస్ శాఖ ఇతర సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు వెళితే సత్ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు. బాలలను రక్షించడమే కాకుండా అవసరమైన వారికి దీర్ఘకాలిక బాగోగులు కూడా చూసే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా శిశు సంక్షేమ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్ మాట్లాడుతూ, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసమే ఆపరేషన్ స్మైల్-6 కార్యక్రమాన్ని వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ స్మైల్-6లో గుర్తించిన పిల్లలందరికీ తగు ఆశ్రయం కల్పించడానికి ఒక్కొక్కరికి రూ.2 వేలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో 38 చిల్డ్రన్స్ హోంలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే 450 చైల్డ్‌కేర్ సెంటర్లు ఉన్నాయని, వీటిని ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించిన పిల్లలకు వసతి కల్పించవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి జీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పిల్లల అక్రమ రవాణాకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టినపుడే ఈ సమస్యకు పాక్షిక పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. మహిళా సేఫ్టీ విభాగం ఐజీ స్వాతి లక్రా మాట్లాడుతూ, రాష్ట్రంలో తప్పిపోయిన పిల్లలు వివిధ అనాథ ఆశ్రమాలలో ఉన్న పిల్లలందరి ముఖాలతో కూడిన డేటాబేస్ సమాచారం తమ దగ్గర ఉన్నదని, దర్పన్ అని వ్యవహరించే ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇప్పటి వరకు 27 మందిని గుర్తించామని వెల్లడించారు. తప్పిపోయిన పిల్లల గుర్తింపునకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్-6లో అన్ని విభాగాలు పాల్గొనాలని కోరారు. ఎస్పీ సుమతి మాట్లాడుతూ, ఇప్పటి వరకు నిర్వహించిన ఐదు విడతల ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో 32వేల మందికిపైగా పిల్లలను గుర్తించామని, వీరిలో 16,823 మందిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్మైల్‌పై రూపొందించిన పోస్టర్లు, మార్గదర్శకాల బుక్‌లెట్‌ను డీజీపీ మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆపరేషన్ స్మైల్-5లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని మహేందర్‌రెడ్డి అభినందించారు.



ఇంధనం పొదుపు పాటిద్దాం
పర్యావరణాన్ని కాపాడుదాం
గవర్నర్ తమిళిసై

# పీఎం, సీఎం హరితహారం

**భారీగా చేస్తున్నారు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇంధనం పొదుపు చేయటం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని గవర్నర్ తమిళిసై ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంధన పొదుపు వారోత్స వాల సందర్భంగా శుక్రవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఏర్పా టు చేసిన ఎనర్జీ కన్సర్వేషన్ అవార్డుల పంపిణీలో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మోడీసూచన మేరకు ప్రతిఒక్కరూ విద్యుత్‌ను పొదుపు చేసేందుకు చొరవ చూపాలన్నారు. మనదేశం 12దేశాలతో ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌ను ఏర్పాటు చేసుకుందన్నారు. ఈకూటమి ద్వారా సౌరశక్తి వినియోగాన్ని పెంచూతూ శిలాజ ఇంధనాల (ఫాజిల్ ఫ్యూయల్స్) వినియోగాన్ని తగ్గించేందుకు కృషి చేయ డం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం సౌరశక్తి ఉత్పా దనలో దేశంలోనే రెండవ స్థానంలో ఉండటాన్ని గవర్నర్ అభినందించారు. విద్యుత్ వినియోగంలోనే కాకుండా విద్యు త్‌ను ఆదా చేసే విషయంలో కూడా తెలంగాణ ఇతర రాష్ట్రాల కు ఆదర్శంగా నిలవడం పట్ల హర్షం వెలిబుచ్చారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఇంజనీరిం గ్ అద్భుతంగా అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ప్రతిరైతు లాభపడాలని ఆకాంక్షించారు. కాళేశ్వరం ప్రాజె క్టులో భాగంగా తొలగించిన మొక్కల స్థానంలో అంతే స్థాయి లో మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి, సీఎం ఇరువురు కలిసి హరితహారం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేస్తున్నారన్నారు.

### 23 సంస్థలకు అవార్డులు

ఆయా రంగాల్లో ఇంధన వినియోగాన్ని తగ్గించిన వివిధ సంస్థలకు, వ్యక్తులకు ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రతిష్టాత్మక తెలంగాణ రాష్ట్ర ఇంధన పరిరక్షణ పురస్కారాలను ప్రధానం చేశారు. గవర్నర్ తమిళిసై, మంత్రి జగదీష్ రెడ్డి చేతుల మీదుగా 23 అవార్డులందచేశారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, సీఎండీ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### డీఎంఏడీకి ఎక్సలెన్సీ అవార్డు

ఇంధన పొదుపు అవార్డుల్లో భాగంగా రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు డా.టి.కె శ్రీదేవికి ఎక్సలెన్సీ అవార్డు లభించింది. అస్కీ ప్రొ.రాజ్‌కిరణ్‌కు కూడా ఈ అవార్డు లభించింది. వీరితోపాటు గోల్డ్ అవార్డులు పొందిన వారిలో ఓరియంట్ సిమెంట్, ఐటీసీ, ఐటీసీ కాకతీయ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, టీఎస్ ఆర్టీసీ నల్లగొండ డిపో, సిరిసిల్ల మున్సిపాలిటీ, జగిత్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్ ఉన్నాయి. సిల్వర్ అవార్డులు పొందిన వారిలో మైహోం ఇండస్ట్రీస్ మేళ్లచెరువు, కేశోరాం సిమెంట్స్ బసంత్ నగర్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం ఆదిభట్ల, దక్షిణమధ్య రైల్వే సంచాలన్ భవన్, పి.ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్, టీఎస్‌ఆర్టీసీ కల్వకుర్తి డిపో, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డ్, రామగుండం మున్సిపల్ కార్పోరేషన్, జగిత్యాల జిల్లా పరిషత్ హైస్కూల్, సఫిల్‌గూడ డీఏవీ పబ్లిక్ స్కూల్, సిద్దిపేట జడ్పీ హైస్కూల్, సంకల్ప స్వచ్ఛంద సేవాసమితి, బ్రహ్మకుమారి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు.

### కేసీఆర్ దిశానిర్దేశంతో విద్యుత్ రికార్డులు: మంత్రి జగదీష్‌రెడ్డి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఒక దిక్సూచిగా నిలుస్తుందన్నారు. మలిదశ ఉద్యమం విద్యుత్ కోసమే వచ్చిందని చెప్పక తప్పదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ దిశానిర్దేశంతో సంక్షోభం నుంచి 24గంటల నిరంతర విద్యుత్‌ను ప్రజలకు అందించేందుకు కృషి చేశామన్నారు. దేశంలోనే రైతులకు ఉచితంగా విద్యుత్ అందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. టీఎస్ రెడ్‌కో ద్వారా విద్యుత్ పొదుపు చేసిన వారికి అవార్డులు అందచేయటం గొప్ప విషయం అన్నారు.

టీఎస్ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రమంతటా వ్యవసాయరంగానికి నిరంతరంగా త్రీఫేస్ విద్యుత్ అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాకముందు పరిశ్రమలకు పవర్‌హాలిడే ఇచ్చే వారన్నారు. దేశంలోనే మెగా ప్రాజెక్టు కాళేశ్వరంకు కూడా నిరంతర విద్యుత్ సరపరా చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్లనే ఇవన్నీ సాధ్యపడ్డాయని సీఎండీ ప్రభాకర్ రావు పేర్కొన్నారు.



## థర్మల్ స్టేషన్ మూసివేయవద్దు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలంగాణ రాష్ట్రంలోని రామగుండం థర్మల్ స్టేషన్-బి కొనసాగించాలని పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన కేంద్ర విద్యుత్ అథారిటీ చైర్మన్ ప్రకాశ్ మహస్కేతో భేటీ అయ్యారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి కేంద్ర విద్యుత్ అథారిటీ చైర్మన్‌ను కలిసిన వెంకటేశ్, రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ ఫ్లాంట్ ప్రారంభమై 48 ఏళ్లు గడిచినా ఇంకా అద్భుతంగా పనిచేస్తోందని తెలిపారు. దీని మూసివేత గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, ప్లాంట్ పనితీరును ఎంపీ, ఎమ్మెల్యేలు స్వయంగా పరిశీలించారు. దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారని, థర్మల్ స్టేషన్ మూసేస్తే వారందరూ ఉపాధి కోల్పోతారని నేతలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ప్లాంట్ పనితీరును దృష్టిలో పెట్టుకుని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## మొక్క పీకితే 45 వేలు ఫైన్!

**సిద్దిపేట, ప్రభన్యూస్ :** హరితహారంలో భాగంగా పెంచుతున్న మొక్కలను ధ్వంసం చేసిన వ్యక్తికి రూ.45వేల జరిమానా విధించినట్లు హరితహారం అధికారి సామల ఐలయ్య తెలిపారు. వివరాల్లోకి వెళ్తే స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా, శివమ్స్ గార్డెన్ ప్రక్కన గల సౌత్ ఇండియా షాపింగ్ మాల్



హోర్డింగ్ వద్ద హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను తమ హోర్డింగ్ కన్పించేందుకు నాలుగు చెట్లను నరికివేశారు. విషయాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన అధికారి ఐలయ్య మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారికి రూ.45వేలు జరిమానా విధించారు. నెలకు లక్షలు వెచ్చించి హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షిస్తున్నామని, వాటికి ఎవరూ హని కల్గించినా జరిమానా తప్పదని ఐలయ్య హెచ్చరించారు. మంత్రి హరీష్‌రావు ఆదేశానుసారం నియోజకవర్గాన్ని హరిత నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, మెయిన్ రోడ్లలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామన్నారు.

## గ్రీన్ చాలెంజ్ ఉద్యమం గొప్పది



టీఆర్ఎస్ ఎంపీ సంతోష్‌కుమార్ విసిరిన గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటుతున్న ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వర్‌రావు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు.



## ఇకపై 10th మెమోలన్నీ డిజిటలైజేషన్

**ఫిబ్రవరి నుంచి డిజిటలైజేషన్ ప్రారంభం**

**1958 నుంచి టెన్త్ మెమోలు డిజిటలైజ్**

**పూర్తి కావడానికి కనీసం 2 నుంచి 3 సంవత్సరాలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇకపై టెన్త్ మెమోలన్నీ డిజిటలైజేషన్ చేయనున్నారు. ఎప్పుడో టెన్త్ చదివి ఉత్తీర్ణత పొందిన వారు కూడా వారి మెమోలను పొందవచ్చు. కాకపోతే డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి 2 నుంచి 3 సంవత్సరాల సమయం పట్టనుంది. ప్రస్తుతం 2014 నుంచి ఎస్ఎస్‌సీ పరీక్షలు రాసిన విద్యార్థుల మెమోలు మాత్రమే డిజిటలైజేషన్ చేస్తున్నారు. అయితే గతంలో టెన్త్ చదివిన వారి వివరాలు ఆన్‌లైన్లో అందుబాటులో లేవు. కానీ ఇకపై 1958 తరువాత నుంచి ఎస్ఎస్‌సీ పాసైన ప్రతి వ్యక్తి వివరాలను ఆన్‌లైన్‌లో భద్రపరచి వారందరీ మెమో లను కూడా డిజిటలైజేషన్ చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్ణయించింది. అందులో భాగంగా ఇప్పటికే వివరాలను సేకరించే పనులను వివిధ ఏజెన్సీలకు అప్పగిం చింది. ఇప్పటికే కొన్ని ఏజెన్సీలు ప్రీ ప్రాసెస్ వర్క్‌ను ప్రారంభించాయి. ప్రీ ప్రాసెస్ వర్క్ జనవరికి పూర్తి కానుంది. ఫిబ్రవరి నుంచి డిజిలటైజేషన్ వర్క్‌ను ప్రారంభించనున్నారు.

### కోట్ల మంది వివరాలు సేకరణ

1958 నుంచి 2014 వరకు ఎస్ఎస్‌సీ చదివి ఉత్తీర్ణులైన వారందరి వివరాలను సేకరిస్తున్నారు. వారి వివరాల సేకరణ కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించిన నేపథ్యంలో జనవరి నెలాఖరు నాటికి పూర్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వారి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చిన అనంతరం వారికి సంబంధించిన మెమోల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని ఫిబ్రవరి నుంచి ప్రారంభించనున్నారు. అయితే ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరవుతుండటం వారిలో 70 నుంచి 90 శాతం వరకు ఉత్తీర్ణులవుతున్నారు. ఈ నేపథ్యంలో 1958 నుంచి 2014 వరకు అంటే కోట్ల మంది వివరాలను డిజిటలైజేషన్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి వీటిని డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం రెండు, మూడు ఏళ్ల సమయం పట్టే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత హాల్ టికెట్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే వారి వివరాలు అన్ని వస్తాయి. దీంతో సంబంధిత వ్యక్తి మెమోను వెంటనే పొందే అవకాశం ఉంటుంది. మొత్తం ప్రక్రియ డిజిటలైజేషన్ అయితే పాత మెమోల కోసం వ్యక్తులు ఎస్ఎస్‌సీ బోర్డు చుట్టూ రోజుల తరబడి, నెలల తరబడి తమ మెమోల కోసం తిరగాల్సిన అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు. కేవలం వారి హాల్‌టికెట్ నంబర్ ఏ ఏడాదిలో పరీక్ష రాశారో ఎంటర్ చేస్తే పూర్తి వివరాలు వస్తాయని వెంటనే మెమోలను జారీ చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లాల వారీగా, పరీక్షలకు హాజరైన ఏడాది వారీగా పొందుపర్చనున్నారు. వారిలో ఉత్తీర్ణత సాధించిన వారందరి వివరాలను అందులో పొందుపరుస్తారు. దీంతో సంబంధిత వ్యక్తి హాల్ టికెట్ ఎంటర్ చేయగానే మెమోలను పొందవచ్చని అధికారులంటున్నారు.

## మగాళ్లు మారారోచ్ పొగాకు మనకొద్దు!

**అలవాటు మానేస్తున్న పురుషులు**

**ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక**




**60 దేశాల్లో తగ్గిన వాడకం**

**హై దరాబాద్,ఆంధ్రప్రభ:** ప్రపంచ వ్యాప్తంగా పోగాకు వాడకంపై జరుగుతున్న ఉద్యమ ప్రచారం ఫలిస్తోంది. ఈ విషయం ప్రపంచ ఆరోగ్యసంస్థ తాజా నివేదికతో వెల్లడైంది. పొగాకు వాడే మగవారి సంఖ్య తగ్గుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్,ఓ)తొలిసారి పొగాకు వినియోగక్రమం 2000 - 2025 కాలపరిమితి అంచనాలపై మూడో సంపుటిలో వెల్లడించింది. ప్రభుత్వాలు,స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి ఫలించినట్లు పేర్కొంది. మగవారిలో పొగాకు వాడకం తగ్గటం పొగాకు వ్యతిరేక పోరాటంలో ఓ గొప్ప మలుపుగా ఈ నివేధిక పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 2000లో 1.397 బిలియన్ల మంది వినియోగదారులు ఉంటే, 2018 నాటికి 1.337 కు వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. అంటే 2025నాటికి సుమారు 60 మిలియన్ల మంది ఈ అలవాటుకు దూరమవుతారని అంచనా వేసింది. ఆడవారు 2000లో 346 మిలియన్ల వాడకందారులుండగా, 2018 నాటికి 244కు వచ్చింది. అంటే సుమారు 100 మిలియన్ల వాడకందారులు తగ్గారన్నమాట. అదే సమయంలో పురుషుల వాడకందార్ల సంఖ్య 40 మిలియన్లకు పెరిగింది. 2000లో 1.050 బిలియన్లన నుంచి 2018లో 1.093 బిలియన్లు గా నమోదైంది. అంటే ప్రపంచ పొగాకు వినియోగ దారుల్లో 82 శాత పురుషులేనన్నమాట. కాగా కొత్త నివేదిక ప్రకారం2018 తరువాత పురుష వినియోగదారులు తగ్గుతూ వస్తున్నట్లు అధ్యయనంలో తేలింది.2020నాటికి 1మిలియన్ కంటే తక్కువ మంది పురుషులు వినయోగదారులు తగ్గనున్నారు. 2025నాటికి ఈ సంఖ్య 5 మిలియన్లకు చేరుకోనుంది. 2010 నుంచి 60శాతం దేశాల్లో పొగాకు వాడకం క్షీణించింది.

కాగా 2025నాటికి 30శాతం తగ్గింపును నమోదు చేయాలనుకున్న ప్రభుత్వాల లక్ష్యం మాత్రం దూరంగానే ఉంది. ప్రస్తుత పురోగతి ఆధారంగా 2025 నాటికి 23శాతం మాత్రమే తగ్గింపు లక్ష్యం చేరుకోవచ్చని అంచనా. 30శాత లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో 32 దేశాలు మాత్రమే ఉన్నాయి. ఏదేమైనా పొగాకు వాడకంలో ముందంజలో ఉన్న పురుషుల్లో మాత్రం గణనీయమైన మార్పు కనిపిస్తోంది. కాగా అంతర్జాతీయంగా మరింత పురోగతి కోసం ప్రయత్నాల్లో వేగం పెంచాల్సి ఉందని నివేదిక చాటుతోంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 21 డిసెంబర్ 2019

## మందగమనానికి మందు!

కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో ఆర్థిక మంత్రి అందరి అభిప్రాయాలను తెలుసుకుని వాటిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి అవసరమైన వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. ఏటా ఇదో సంప్రదాయం.ఈసారి ఆర్థిక మంత్రిగా తాను ప్రవేశపెట్టనున్న రెండో బడ్జెట్‌పై నిర్మలా సీతారామన్ సంప్రదింపులు ప్రారంభించారు. మందగమనం నుంచి బయటపడేందుకు వాణిజ్య పారిశ్రామిక వేత్తలు అరమరికలు లేకుండా సూచనలు చేయడం ఆహ్వానించదగిన పరిణామం. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలూ, కల్పిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకునేందుకు స్వేచ్ఛాయుత వాతారణాన్ని సృష్టించాలని ఆ వర్గాలు కోరాయి. అంటే వేధింపులు, ఒత్తిడులు లేని వ్యవస్థ ఉండాలని చెప్పకనే చెప్పాయి. భరోసా ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. ఏటా 20 లక్షల రూపాయిల కంటే తక్కువ ఆదాయం ఉన్న కంపెనీలు,సంస్థలకు పన్ను తగ్గించాలన్న డిమాండ్లు సహేతుకంగానే ఉన్నాయి. శుక్రవారం అసోచామ్ శత వార్షికోత్సవ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వాణిజ్య పారిశ్రామిక వర్గాలు కోరుకున్న అభయాన్ని ఇచ్చారు. మందగమనం నుంచి గట్టెక్కేందుకు వాణిజ్య,పారిశ్రామిక వర్గాలకు ప్రభుత్వం నుంచి భరోసా లభించింది. పెట్టుబడుల భద్రతపై అనుమానాలూ, సందేహాలూ వద్దంటూ ధైర్యవచనాలు వాణిజ్య పారిశ్రామిక వర్గాల్లో చిత్తస్థైర్యాన్ని పెంచుతాయనడంలో సందేహం లేదు. మందగమనం తాత్కాలికమే. ప్రభుత్వం ఇచ్చే హామీలు ఆచరణలో కనిపించినప్పుడే అటు వాణిజ్య, పారిశ్రామిక వర్గాలకూ, ఇటు వినియోగదారునికీ ప్రయోజనం. పెట్టుబడులు పెట్టే వాణిజ్య, పారిశ్రామిక వర్గాలను అనుమానించే ధోరణి పోవాలి.పన్ను చెల్లింపుదారులను గౌరవించాలని పన్ను వసూళ్ళ యంత్రాంగాలను హెచ్చరిస్తున్నా, పాత పద్ధతిలోనే ప్రభుత్వ యంత్రాంగాలు వ్యవహరిస్తున్నాయి. వృద్ధిరేటు గడిచిన ఏడేళ్లలో లేనంతగా ఐదు శాతం కన్నా తక్కువగా ఉండటాన్ని చూసి వాణిజ్య,పారిశ్రామిక వర్గాలు అధైర్య పడుతున్న తరుణంలో ప్రధాని భరోసా ఇవ్వడం ముదావహం. అంతర్జాతీయ స్థాయిలో పరిస్థితుల ప్రభావం మన దేశం మీద పడింది., దీనిని అనివార్య పరిణామంగానే పరిగణించాలి. అగ్రరాజ్యం అయిన అమెరికాలో కూడా ఆర్థిక రంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. పెట్టుబడుల కోసం వర్ధమాన దేశాల మాదిరిగా అగ్రరాజ్యం అన్ని దేశాలనూ అభ్యర్థిస్తోంది.ఈ నేపథ్యం నుంచి చూస్తే , నవంబర్ లో మన వృద్ధి రేటు 4.5 శాతంగా ఉందన్న అధికార గణాంకాలు తాత్కాలికంగానే భావించాలి. అయితే, ప్రభుత్వ నిర్ణయాల వల్లే మందగమన్నది ప్రతిపక్షాల ఆరోపణ. పెట్టుబడులు పెంచమని కోరినంత మాత్రాన ఎవరూ ముందుకు రారు, రిజర్వు బ్యాంకు బేసిక్ పాయింట్లను తగ్గించినా బ్యాంకులు తగ్గించడం లేదని పలువురు పారిశ్రామిక వేత్తలు ఆర్థిక మంత్రికి తెలియజేశారు. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంకుగవర్నర్ శక్తికాంత్ దాస్ ఆ మధ్య ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. రిజర్వుబ్యాంకు తీసుకున్న నిర్ణయాలు దిగువ స్థాయికి చేరక పోవడంతో ప్రయత్నం అంతా వృధా అవుతోన్న మాట నిజమే. సులభతర వాణిజ్యంలో మనం ముందున్నామని చెప్పుకోవడం కాదు, ఆ పరిస్థితి కొనసాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఫిక్కీ, అసోచామ్ సంస్థల అధిపతులు ఆర్థిక మంత్రికి సూచించారు. ప్రభుత్వం చేసే సూచనలు, ప్రవేశపెట్టే నిబంధనలు అమలుజేస్తున్నా సమాచార లోపంతోనూ, సమన్వయ లోపంతోనూ అనేక మంది ఇప్పటికీ వేధింపులకు గురి అవుతున్నారు. వారికి భద్రత, భరోసా కల్పించాల్సిన బాధ్యత ఆర్థిక శాఖపై ఉంది.

మౌలిక రంగంలో పెట్టుబడులు పెరిగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న మాట నిజమే. కనెక్టివిటీ అనే పదాన్ని ఇప్పుడు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కనెక్టివిటీ అంటే కేవలం కమ్యూనికేషన్లు, అంతర్జాలం వంటి ఆధునిక సౌకర్యాలు మాత్రమే కాదు. రోడ్ల విస్తరణపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి. రైతు పండించిన పంట పట్టణాలు, నగరాలకు చేర్చినప్పుడే అతడి శ్రమకు ఫలితం దక్కుతుంది. దళారుల వ్యవస్థ లేకుండా చూడటం ప్రభుత్వం తీసుకోవల్సిన ముఖ్యమైన చర్య. కమ్యూనికేషన్ రంగం ప్రభుత్వ ప్రమేయం లేకుండానే విస్తరిస్తోంది. దానిని అదుపు చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో వాణిజ్య పరంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలతో కనెక్టివిటీని పెంచాలి. కమ్యూనికేషన్ల రంగంలో అభివృద్ధి సాధించడం వల్ల అంతర్జాలం, టెలిఫోన్ వంటివి అందుబాటులోకి వచ్చాయి. టెలిఫోన్‌ల వినియోగం పెరిగినా, టెలికమ్ సంస్థల ఆదాయం పెరగడం లేదని భారతి ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్ అన్నారు. ఒక్కొక్క వినియోగదారుని నుంచి సగటున వంద నుంచి 450 రూపాయిలు చెల్లిస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంతగా ఎక్కువ డేటాను పొందుతున్నారు.టెలిఫోన్ వినియోగదారుల నుంచి మరింతగా ఆదాయం వస్తేనే టెలికమ్ సంస్థలు నిలదొక్కుకోగలవని ఆయన స్పష్టం చేస్తూ, లాభాలు ఎక్కువ ఉన్న సంస్థల్లో పెట్టుబడులవైపే పెట్టుబడిదారులు మొగ్గు చూపుతారని ఆయన అన్నారు. ఉత్పత్తి రంగంతో పాటు సేవారంగం విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో అన్ని వర్గాలకూ లాభం చేకూరేట్టుగా ఆర్థిక విధానాలు ఉండాలన్న డిమాండ్ సహేతుకంగానే ఉంది. జిఎస్‌టిని ప్రవేశపెట్టి రెండున్నర సంవత్సరాలవుతున్నా, ఆ వ్యవస్థ ఇంకా గాడిన పడలేదు. ఈ వారంలో జరిగిన జిఎస్ టి మండలి సమావేశంలో రేట్లు పెంచాలని ప్రతిపాదనలు వచ్చాయి. రేట్లు పెంచితే వినియోగదారునిపై భారం పడుతుంది. ఇప్పటికే కొన్ని వస్తువులపై జిఎస్ టి రేట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఎక్కువమంది వినియోగించే వస్తువులపై జిఎస్ టి రేట్లు ఎక్కువ ఉంటే ఆదాయం ఎక్కువ వస్తుందనేది ఒక అపోహ మాత్రమే. పన్నుల వసూళ్ళ యంత్రాంగాన్ని పటిష్టం చేయడం ద్వారానే ఆదాయాన్ని పెంచుకోవాలి.నవంబర్ నెలలో జిఎస్‌టి రాబడి లక్ష కోట్లు దాటింది. ఇది ఇలాగే కొనసాగేట్టు చూడాలని నిర్మలా సీతారామన్ పిలుపు ఇచ్చారు. గతంలో సుంకాల కన్నా జిఎస్ టి వ్యవస్థ వచ్చిన తర్వాత పన్నుల రాబడి పెరిగింది. అయితే,కొన్ని రాష్ట్రాల్లో ఇంకా పాత పద్ధతిలోనే పన్నుల వసూళ్ళ యంత్రాంగాన్ని ప్రసన్నం చేసుకుని ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి లోపాలను సరిదిద్దడం ద్వారా ఆదాయం పెంచుకోవాలి. కానీ, పన్నులూ, పన్నురేట్లు పెంచడంద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వాలు చేసే ఆలోచనలు వినియోగదారునిపై భారం మోపేవే. మౌలిక రంగంలో నిర్మాణాలపై వంద లక్షల కోట్లు, గ్రామీణార్థిక వ్యవస్థపై 25లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధానమంత్రి వెల్లడించారు.

ఆటో రంగంలో అభివృద్ధి లేకపోవడం వల్లనే ఆర్థిక మందగమనం ఉత్పన్నమైందన్న వాదనుంది. అది నిజం కాదు. ఆటోరంగం అభివృద్ధి చెందుతున్నా, వాహనాల ఉత్పత్తులు పెరుగుతున్నా, కాలం చెల్లిన వాహనాలను ఉపసంహరించకపోవడం వల్ల ఈ రంగంలో అభివృద్ధి కనిపించడం లేదు. సరకుల రవాణా రంగంలో సమన్వయం లేదు. దాని వల్ల ఉల్లి, చక్కెర వంటి నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడుతోంది, వీటిని నిరోధించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. పెరిగిన ఉత్పత్తులు వినియోగదారుని చెంతకు చేరినప్పుడే పారిశ్రామిక రంగాలకు లాభం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో అమలుజరిగేట్టు పర్యవేక్షణ చేస్తేనే ఆశించిన ఫలితాలు ఒనగూరుతాయి. అక్రమ నిల్వలపై నిఘా, ధరలపై అదుపు ఉంటేనే వినియోగదారునికి మేలు జరుగుతుంది.

# మౌనమే ఆయుధం!

తెలంగాణలో శాంతిభద్రతలు బ్రహ్మాండంగా ఉన్నాయి. కొన్ని సందర్భాలలో రాజకీయ ప్రత్యర్థులు జాతీయవాదం, మతం వంటి అంశాలను ఆధారంగా తీసుకుని విమర్శలు గుప్పించడం, రాష్ట్రంలో రాజకీయ బలం పెంచుకోవడం కోసం ఎత్తులు వేయడం మామూలే. వివాదాస్పద విషయాల్లో మీ అభిప్రాయం చెప్పండంటూ ప్రత్యర్థులను రెచ్చగొట్టడం ఆ లక్ష్య సాధనలో ఓ ఎత్తుగడ. ఆ వ్యూహంతోనే అటు కేరళ, ఇటు వెస్ట్ బెంగాల్‌లో బీజేపీ కొంత పట్టు సాధించింది. అయితే తెలంగాణలో పాతుకుపోవాలనుకుంటున్న బీజేపీ ఆటలు సాగవు. ఇటీవలి కాలంలో దిశపై హత్యాచారం, ఆర్టీసీ వివాదం, తాజాగా పౌరసత్వ చట్టంపై వివాదం రగిల్చేందుకు ప్రత్యర్థులు చేయని ప్రయత్నం లేదు. అయినా వారి ఎత్తులు ముఖ్యమంత్రి ముందు పనిచేయడం లేదు. పౌరసత్వ సవరణ చట్టం ఆమోదం పొందిన తరువాత దేశంలో అల్లర్లు జరుగుతున్నా, తెలంగాణలో ప్రశాంతంగా ఉందంటే, అది ముఖ్యమంత్రి సమర్థతకు అద్దం పడుతుంది.

తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రస్తుత రాజకీయాల్లో దేశంలోనే ప్రముఖ వ్యక్తుల్లో ఒకరు. మాటలతో ఎంతటి వారినైనా ఆయన ఎదుర్కొన్నారు. అది అసెంబ్లీ సమావేశాలైనా, లేదా బహిరంగ సభలైనా సరే ఎదురుదాడి చేస్తే అవతలివారు కంగారు పడాల్సిందే. చాలామంది నేతల్లా స్క్రిప్టు చూసి చదవడం ఆయన రీతి కాదు. ప్రజాజీవితంలో ఎన్నో దశాబ్దాల అనుభవంలో నేర్చుకున్న పాఠాలు, మనసులోని భావాలను రంగరించి, ఉదాహరణలతో కూడిన ఉపన్యాసాలు ఉంటాయి. అలాగే వ్యూహాత్మక మౌనం కేసీఆర్ ప్రత్యేక ఆయుధం. ఓపికతో వేచి చూసి సరైన సమయంలో మాట్లాడినప్పుడు ఆ ప్రభావం వేరేగా ఉంటుంది. అలాంటి పదునైన, నిఖార్సయిన ప్లానింగ్, సమయానుసారంగా కార్యక్రమం డిజైన్ చేసినందునే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగారు. అనేక ఎన్నికలు సహా, పలు వివాదాల్లో నెగ్గుకు వచ్చారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు ఓ భాగం. అయితే ప్రజాస్వామ్యన్ని పరిరక్షించే సంస్థలను అగౌరవ పరచడం సరికాదు. ఈ మధ్య నిరసనలు, నిరసనకారులు ఆ బాధ్యతను మరవడం బాధాకరం. రెండు అంశాల్లో వారి డిమాండ్‌కు అర్థం లేదు. దిశపై హత్యాచారం, పౌరసత్వ చట్ట సవరణపై ముఖ్యమంత్రి స్పందించలేదని కొన్ని పత్రికలు, కొందరు నేతలు విమర్శలు గుప్పించారు. కానీ ఆ విమర్శలు బాధ్యతారాహిత్యం. ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన దిశ సంఘటనపై ఆవేదన వెలిబుచ్చారు. అదే సమయంలో మహిళా కార్మికుల కోసం వరాలు గుప్పించారు. 2012 లో ఢిల్లీలో నిర్భయ సంఘటన జరిగినప్పుడు అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శాంతిభద్రతలు కేంద్రం బాధ్యత అని తప్పించుకునే ప్రయత్నం చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. అప్పుడు రాష్ట్రంలోను, కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వాలే. అదే తన ఓటమికి కారణమని తరువాత తను మీడియాలో సీఎం షీలా దీక్షిత్ ఒప్పుకున్నారు కూడా. అదే సమయంలో, ఢిల్లీ ప్రభుత్వం అన్నాహజారే అవినీతిపై పోరాటాన్ని కూడా చూసింది. ఆ రెండు అంశాల్లో ఢిల్లీ ప్రభుత్వం చేష్టలుడిగి ఉండిపోయింది. అప్పుడే నిర్భయ, జన్‌లోక్‌పాల్ వంటి చట్టాలకు నాంది వేయకుండా విమర్శలతో కాలక్షేపం చేశారు. ఫలితంగా ఆ తరువాతి ఎన్నికల్లో అధికారం కోల్పోయారు.

ఈ సందర్భంలో కేరళలో బీజేపీ ఎలా అడుగుపెట్టిందీ పరిశీలిద్దాం. శబరిమలలో మహిళల ప్రవేశం వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు విషయంలో అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం, బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పరస్పరం పోట్లాడుకున్నాయి. ఈ వివాదం రాజేయడం వల్లే బీజేపీకి కేరళలో 2014 కంటే 2019 లోకసభ ఎన్నికల్లో 5.60 శాతం ఓటింగ్ పెరిగింది. అదే ప్రభుత్వంలో ఉన్న సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ఉన్న ఎల్‌డిఎఫ్ 2014లో ఉన్న 8 స్థానాల నుంచి 2019లో కేవలం 1 పార్లమెంటు సీటుకే పరిమితం అయింది. బీజేపీని గమనిస్తే, వారి ప్రతీ ప్రచారం, ఎన్నికల సమరం ప్రధానంగా రెండు వాదాల మధ్యనే ఉంటుంది, ఒకటి మతవాదం, ఇంకొకటి జాతీయ వాదం. ఎదుటి పార్టీలను ఈ రెండు చర్చల మధ్యలనే రెచ్చగొడుతారు, ప్రత్యర్థులు రెచ్చిపోతే వారి గ్రాఫ్ రేటు క్రింద పడటమే కనిపిస్తుంది. ఇటీవలే పౌర సవరణ చట్టంపై మేధావులు వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేపట్టిన సడక్ మార్చ్ ఆందోళనపై ప్రశంసలతో ముంచేస్తున్నారు. అలాంటివి ఈ మధ్య వారు చాలానే చేశారు. కానీ వాటివల్ల ఆమెకు ప్రయోజనం కలుగుతుందా అన్నది అనుమానమే. కొద్దికాలం నుంచి ఆమె భారతీయ జనతా పార్టీని సూటిగా ఎదుర్కొంటున్నారు. అయితే అది కాషాయ పార్టీకి లాభాన్నే తెచ్చింది. ఇటీవలే జరిగిన లోకసభ ఎన్నికల్లో 22.25 శాతం పెరిగింది. కేవలం 3 శాతం మాత్రమే తృణమూల్ కాంగ్రెస్‌కన్నా వెనుకబడింది. ఆ ఎన్నికల్లో బీజేపీ 16 పార్లమెంటు స్థానాలను పెంచుకున్నది. ఇంకొక ప్రధాన జాతీయ పార్టీ, బీజేపీకి ప్రత్యామ్నాయ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ఓటింగు శాతం 4.09 శాతం తగ్గింది.

ఇక తెలంగాణలో ప్రజాస్వామికవాదులు అని చెప్పుకునే వారు పొద్దున లేస్తే కేసీఆర్‌మీద పడుతున్నారు. ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టంపై స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో పౌరసత్వ సవరణ బిల్లుపై వ్యతిరేకంగా ఓటువేసి తెరాస విధానాన్ని కేసీఆర్ స్పష్టం చేశారు. నిజానికి కేసీఆర్ గాంధేయవాది. తెలంగాణ ఉద్యమం, ఇప్పుడు పరిపాలనలో అదే మార్గం అనుసరిస్తున్నారు. ఉద్యమ సమయంలో హింసను ప్రోత్సహించ లేదు కాబట్టే పోరాటం అంత కాలం నడిచింది, రాష్ట్రం సాధించాం. 2014 నుంచి ఇప్పటి వరకు గమనిస్తే ఒక్క మత కలహం, కొట్లాట లేవు. బీజేపీ దక్షిణ భారతదేశంలో కాలుమోపడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. గౌరీ లంకేశ్ హత్య కేసును ఛేదించడంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అవ్వడమే కాకుండా, హిందుత్వ చర్చను మొదలు పెట్టి చేతులారా సిద్దరామయ్య ప్రభుత్వాన్ని కోల్పోయి, కర్ణాటకను బీజేపీకి అప్పజెప్పేసింది. అయితే తెలంగాణలో అట్లాంటి జిమ్మిక్కులు సాధ్యం కావు. ఎందుకంటే ఇక్కడ నాయకుడు హిందువులను, ముస్లింలను, క్రైస్తవులను సమానంగా చూస్తూ, అందరికీ సరైన రాజకీయ అవకాశాలు కల్పిస్తూ సంక్షేమ పాలను అందిస్తున్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో 100కు పై సీట్లలో బీజేపీ డిపాజిట్లు కోల్పోయింది. ముఖ్యమంత్రి కేసీఆర్, తన పాలనలో ప్రాధాన్యాలను ముందే గుర్తించారు. త్రాగు నీరు, సాగు నీరు, పరిశ్రమలు, మౌలిక అవసరాలు, అవకాశాలు సంక్షేమం పై దృష్టి పెట్టారు, అందుకే వారు ఎప్పుడూ రాష్ట్ర హితం కోసం



ఆర్థిక అంశాలను లేవనెత్తుతారు. బీజేపీ ఆ విషయమై మాట్లాడలేదు. దానిబదులు, తెలంగాణలో జాతీయవాద, మతవాద చర్చ ఉండాలని కోరుకుంటారు, కానీ ఆ అవకాశం కేసీఆర్ ఇవ్వడం లేదు.

తెలంగాణలో గాంధేయ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలో ప్రజలు సుఖంగా సురక్షితంగా ఉన్నారు. అధికారంలోకి రాగానే ఇక్కడ నివ్వసిస్తు న్న సీమాంధ్రులకు భరోసా కలిపించారు. రాష్ట్రంలో రాజ్యాంగ హక్కులు గౌరవించబడతాయని నిరూపించారు. పౌరసత్వ సరవణ చట్టంపై నిరసనలకు ఏ వర్గానికీ అనుమతి ఇవ్వలేదు. ఓయూ, మను, పీపుల్ ప్లాజాలో శాంతియుత నిరసనలు జరిగాయి, వేరే రాష్ట్రాల్లో మాదిరిగా హింసాత్మక సంఘటనలు ఇక్కడ జరగలేదు, ఇంటర్నెట్ బంద్ చేయలేదు. ఈ విషయాన్ని కుహానా మేధావులు గుర్తించాలి. తెలంగాణను పరిపాలిస్తున్నది కేవలం ఒక రాజకీయ నాయకుడే కాదు. కేసీఆర్ ఒక స్టేట్స్‌మన్. రాజతంత్రం అంటే లొల్లి, సప్పుడు, అల్లరి చేయడం కాదు. అలా అల్లరి చేసే బీజేపీవంటి పార్టీలను ఎలా కట్టడి చేయాలో కేసీఆర్‌కు తెలుసు.

- క్రిషాంక్ మన్నె

# పౌరసత్వ చట్టం.. మిత్రభేదం!

తేనెతుట్టెలాంటి సమస్యలను అలవోకగా పరిష్కరించడంలో ప్రధాని మోడీ-అమిత్‌షా ద్వయం అందెవేసిన చేయి. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు సహా అనేక సందర్భాల్లో వారు తమ చాణక్యాన్ని నిరూపించుకున్నారు. కానీ, పౌరసత్వ సవరణ చట్టం విషయంలో వారు తొలిసారి కఠిన పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఆ బిల్లును పార్లమెంటులో ఆమోదింపచేసుకోవడంలో వారి వ్యూహం ఫలించింది. కానీ తదనంతర పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇతర సున్నిత అంశాల లో వారి వ్యూహం ఎప్పుడూ విఫలం కాలేదు. ప్రత్యర్థుల ఊహకు అందని రీతిలో వారు పావులు కదిపారు. కానీ పౌరసత్వ చట్టం విషయంలో వారు ఈ పరిస్థితిని ఊహించినట్లు లేదు. దేశంలో పరిస్థితులు ఒకవైపు ఆందోళన కలిగిస్తూంటే, దీనివల్ల మిత్రపక్షాల వైఖరిలోనూ మార్పు రావడం ఆ పార్టీకి తలనొప్పిగా మారుతోంది. పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళనలు ప్రారంభమైనప్పుడు ఇవి కేవలం పశ్చిమ బెంగాల్‌కే పరిమితం అని కేంద్రం అనుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అయితే, నేరుగానే బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ పేరు ప్రస్తావించి ఆమె జనాన్ని రెచ్చగొడుతున్నారంటూ ఆరోపించారు. కాంగ్రెస్, వామపక్షాల సంగతి సరేసరి. అవి ఎలాగూ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తాయి కనుక, ఈ ఆందోళనలకు అవి మద్దతు ఇవ్వడంలో ఆశ్చర్యం లేదన్నారు. కానీ, పది రోజులు దాటిన తర్వాత పరిస్థితి ఏమిటని సమీక్షించుకుంటే, ఈ ఆందోళనలు తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు పరిమితం కాదన్న విషయం స్పష్టం అయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇదంతా కాంగ్రెస్, వామపక్షాల కుట్ర అన్నారు. అప్పటి పరిస్థితి చూస్తే అలాగే అనిపించింది. కానీ, క్రమంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, కర్నాటక తదితర రాష్ట్రాల్లో పౌరసత్వ సెగలు వ్యాపించే సరికి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించడం మొదలు పెట్టారు. బీజేపీ ముఖ్యమంత్రులే కాకుండా, బీజేపీ మిత్ర పక్షాల ముఖ్యమంత్రులు కూడా స్పందించడం మొదలు పెట్టారు. ఒకప్పుడు బిజేపీకి మిత్ర పక్షంగా ఉన్న శివసేన ఈ బిల్లుకు లోక్ సభలో మద్దతు ఇచ్చి రాజ్యసభలో ఓటింగ్ వచ్చే సరికి మనసు మార్చుకుంది. మహారాష్ట్రలో అధికారం పంచుకునే విషయంలో బీజేపీతో వైరం రావడం, కాంగ్రెస్ ఎన్సీపీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల రాజకీయ ఒత్తిడుల కారణంగా శివసేన మనసు మార్చుకుని ఉండవచ్చన్న కథనాలు వెలువడ్డాయి. బీజేపీకి అత్యంత సన్నిహిత పక్షాలైన జనతాదళ్ (యు), ఆకాలీదళ్‌లు కూడా అదే మాదిరిగా ఈ చట్ట సవరణను వ్యతిరేకించడం మొదలు పెట్టాయి. జనతాదళ్ -యు నాయకుడు,బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మనసు మార్చుకోవడానికి ఆ పార్టీ ఉపాధ్యక్షుడైన ప్రశాంత్ కిషోర్ ఒత్తిడి కారణం. ఇందుకు సంబంధించిన బిల్లును నితీశ్ కుమార్ సమర్థించిన ప్పుడు ఆయన నిర్ణయాన్ని ప్రశాంత్ కిషోర్ బహిరంగం గానే వ్యతిరేకించారు. పౌరసత్వం మంజూరుకు మతాల పట్ల వివక్ష చూపడం వల్ల సమాజంలో చీలికలు వస్తాయని ఆయన బహిరంగంగానే విమర్శించారు. జనతాదళ్-నియమావళికి వ్యతిరేకంగా నితీశ్ కుమార్ ఈ బిల్లుకు మద్దతు ఇచ్చారంటూ ధ్వజమెత్తారు. దాంతో నితీశ్ కుమార్ మెత్తబడ్డారు.



ప్రధానమంత్రి నరేంద్రమోడీ మెప్పు కోసం ఈ చట్ట సవరణను సమర్థిస్తే, భవిష్యత్‌లో తమ పార్టీ కకావికలం అవుతుందన్న భయం ఆయనలో కలిగింది. దాంతో నితీశ్ యూ-టర్న్ తీసుకున్నారు. శివసేన అధ్యక్షుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే ముంబాయిలోని ఆగస్టు క్రాంతి మైదానంలో వేలాదిమంది సభికుల నుద్దేశించి చేసిన ప్రసంగంలో ఈ బిల్లులో మార్పులు చేసి బీజేపీ మాట తప్పిందని విమర్శించారు. సమాజంలో అన్ని వర్గాల పట్ల ప్రభుత్వానికి సమభావం ఉండాలని ఆయన అన్నారు. అకాలీదళ్ జాతీయాధ్యక్షుడు సుఖబీర్ సింగ్ బాదల్ పార్లమెంటులో ఈ బిల్లుపై చర్చలో దీనిని సమర్థిస్తూనే, పాకిస్తాన్‌లో ముస్లిం పాలకుల పాలనలో ఇక్కట్లకు లోనైన అహ్మదీయ వంటి తెగలకు పౌరసత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అఖల్ తఖ్త్ ప్రధానాచార్యుడు జ్ఞానీ హర్ ప్రీత్ సింగ్ ఈ బిల్లులో ముస్లింలను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. అఖల్ తఖ్త్‌కు జాతేదార్ అంటే క్రైస్తవులకు పోప్ మాదిరి గా సిక్కులకు అంతటి గౌరవ భాజనుడు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు, ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ దీనిపై వ్యాఖ్యానిస్తూ, కాంగ్రెస్ ముఖ్యమంత్రులెవరూ తమ రాష్ట్రాల్లో ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు జేయరని స్పష్టం చేశారు. ఈ బిల్లులో సిక్కులు, హిందూ శరణార్థులను చేర్చడాన్ని స్వాగతిస్తూనే ముస్లింలను దూరంగా ఉంచడాన్ని తాము సమర్థించబోమంటూ అకాలీదళ్ అధ్యక్షుడు సుఖబీర్ సింగ్ బాదల్ ప్రకటించి బీజేపీని ఇరకాటంలో పెట్టారు. ఈ చట్టం సవరణను పార్లమెంటు ఆమోదించిన దృష్ట్యా దీనిని మళ్ళీ తిరగతోడాల్సిన అవసరం లేదని అమిత్ షా స్పష్టం చేశారు. ఆయన దృఢవైఖరిని ప్రదర్శి స్తూనే ఉన్నారు. అయితే, మిత్ర పక్షాలకు చెందిన ముఖ్య మంత్రులు ఒక్కొక్కరూ వైఖరులను మార్చుకోవడం ఆయనను ఇబ్బంది పెట్టింది. పంజాబ్‌లో పాకిస్తాన్‌కి చెందిన హిందూ శరణార్థులు ఉన్నారు. అలాగే, అఫ్గానిస్థాన్ నుంచి వచ్చిన సిక్కు శరణార్థులు జలంధర్, అమృతసర్, లూథియానా తదితర నగరాల్లో ఉన్నారు. మిగిలిన నగరాలో కూడా సిక్కు శరణార్థులు అనేక దశాబ్దాలుగా నివసిస్తున్నారు. ఢిల్లీలో ఏకంగా శరణార్థు ల కాలనీలే ఉన్నాయి. అక్కడ కాశ్మీరీ పండిట్ల కాలనీలు కూడా ఉన్నాయి. పంజాబ్‌లో అహ్మదీయ తెగకు చెందిన ముస్లింలు దశాబ్దాలుగా శరణార్థులుగా జీవిస్తు న్నారు. సరిహద్దులను దాటి వచ్చి వివాహాలు చేసుకున్న కుటుంబాలకు చెందిన వారు కూడా భారత పౌరసత్వాన్ని కోరుతున్నారు. వీరిలో అకాలీదళ్, కాంగ్రెస్ పార్టీలకు సమానంగా సానుభూతిపరులు ఉన్నారు. అహ్మదీయ తెగకు చెందిన ముస్లింలు మన దేశంలో 15 లక్షల మంది వరకూ ఉన్నారు. ఢిల్లీ, ముంబాయి, చత్తీస్‌గఢ్‌లలో అహ్మదీయ శరణార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరిలో అనేక మంది యునైటెడ్ కింగ్ డమ్, తదితర దేశాలకు ఉద్యోగ, ఉపాధి అవసరాల కోసం శరణార్థులుగా తరలి వెళ్ళారు. అహ్మదీయ శరణార్థులకు పౌరసత్వం ఇస్తే భారత్‌కే లాభమని ఆ తెగకు చెందిన నాయకులు పేర్కొంటున్నారు. బెంగాల్‌లో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లిం శరణార్థులను సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నట్టే, పంజాబ్‌లో అకాలీ, కాంగ్రెస్ పార్టీలు అహ్మదీయ, తదితర తెగల ముస్లిలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయి. అకాలీదళ్ బీజేపీ మిత్ర పక్షమైనప్పటికీ తన ఓటు బ్యాంకును పోగొట్టుకోలేదు. అందుకే ఈ చట్ట సవరణను వ్యతిరేకిస్తోంది. పంజాబ్‌లో హిందువులు,సిక్కులు అహ్మదీయ తెగ ముస్లింలతో దశాబ్దాలుగా కలిసిమెలిసి జీవిస్తున్నారు. పంజాబ్‌లో 22 జిల్లాలు ఉన్నాయి. వీటిలో ఆరు జిల్లాల్లో ముస్లిం జనాభా రెండు శాతం మించి ఉంది. సంగ్రూర్‌లో అత్యధికంగా 10 శాతం మంది ముస్లింలు ఉన్నారు. గడిచిన రెండు దశాబ్దాల్లో వీరి సంఖ్య బాగా పెరిగింది. 1984లో అహ్మదీయ తెగకు చెందిన వారు ముస్లింలు కాదని పాకిస్తాన్ ప్రకటించింది. దాంతో వారంతా పంజాబ్‌కి వచ్చి వివిధ జిల్లాల్లో స్థిరపడ్డారు. అహ్మదీయ తెగపై పాక్ ముస్లింలలో మెజారిటీ వర్గాల వారుదాడులు చేయడంతో చాలామంది లండన్ వెళ్ళి స్థిరపడ్డారని మీర్జా మసురూర్ అహ్మద్ అనే ప్రస్తుత ఖలీఫా ప్రకటించారు. పంజాబ్‌లో అకాలీలు బీజేపీతో దశాబ్దాలుగా పొత్తు కలిగి ఉన్నా, ఈ చట్టం సవరణను ఆమోదిస్తే కనీసం ఆరు జిల్లాల్లో ముస్లింల మద్దతును కోల్పోవల్సి వస్తుందన్న బెదురుతోనే ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు. అలాగే, బీహార్‌లో ముస్లిం మైనారిటీలను ఆర్‌జెడీ ఓటుబ్యాంకుగా ఉపయోగించుకుంటున్న ప్పటికీ, నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ -యుకి కూడా ముస్లింల మద్దతు చెప్పుకోదగిన రీతిలో ఉంది. బీహార్ ముజఫర్‌పూర్, సియాన్ తదితర జిల్లాల్లో ముస్లింల జనాభా అత్యధికం. కర్నాటకలోనూ అదే పరిస్థితి. యెడియూరప్ప రాజకీయ జీవితం ఆర్ఎస్ఎస్ నుంచే ప్రారంభమైనప్పటికీ, ముస్లిం నాయకులతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. కర్నాటకలో ముస్లిం జనాభా చెప్పుకోదగిన సంఖ్యలో ఉంది. అందువల్ల ఆ వర్గాలను దూరం చేసుకోవడానికి కాంగ్రెస్ కానీ, బీజేపీ కానీ ప్రయత్నించదు. కర్నాటక ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బిఎస్ యెడియూరప్ప తమ రాష్ట్రంలో పౌరసత్వ చట్టం సవరణపై నిరసనలు ఏవీ లేవని స్పష్టం చేశారు. కొద్దిరోజుల తర్వాత సుప్రసిద్ధ చరిత్రకారుడు రామచంద్ర గుహ బెంగళూరులో అరెస్టు కాగానే, దిగ్భ్రాంతిని ప్రకటించారు. ఇవి చెదురుమదురు ఘటనలని అనుకున్నాననీ, రామచంద్ర గుహ అరెస్టు అయిన సంగతి తన దృష్టికి రాలేదని అనడం చాలా మందికి వి స్మయాన్ని కలిగించింది. కర్నాటకలో ముస్లింలతో వైరం పెట్టుకుంటే రాజకీయంగా నెగ్గుకు రాలేమన్న సంగతి యెడియూరప్పకు తెలుసు. అందుకే తటస్థ వైఖరిని అనుసరిస్తున్నారేమోననిపిస్తోంది.

- పద్మనాభ స్వామి

# మధ్య ఆసియాలో ఆరని మంటలు

ఇజ్రాయల్- పాలస్తీనాల మధ్య వివాదాలతోపాటు మధ్య ఆసియా దేశాలలో అంతర్యుద్ధం మారణ హోమానికి దోహదం చేస్తున్నాయి. ఐఎస్ఐఎస్ సహా ఉగ్ర కార్యకలాపాలు దీనికి తోడవుతున్నాయి. ఇజ్రాయల్ రాజధానిని టెల్‌అవీవ్ నుండి జెరుసలేంకు మార్చడాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమర్థించిన విషయం తెలిసిందే. అనంతరం మధ్య ఆసియా దేశాలలో వాణిజ్యం పేరిట అమెరికా జోక్యం పెరిగింది. ప్రధానంగా ఆయుధ వ్యాపారం కోసం మార్కెట్లను నెలకొల్పడంలో ఇదంతా ఓ భాగం. అందువల్లే మధ్య ఆసియా దేశాలలో 'అగ్ని జ్వాలలు' చల్లారడం లేదు. కొన్ని దేశాల్లో ఒక వర్గానికి అమెరికా మద్దతు ఇస్తే, వ్యతిరేక వర్గానికి రష్యా, మరికొన్ని చోట్ల పరోక్షంగా చైనా మద్దతు ఇస్తున్నాయి. ఇక్కడ ఎవరి ప్రయోజనాలు వారు చూసుకుంటున్నారు. ఆయా దేశాల పౌరులే అన్ని విధాలా నష్టపోతున్నారు. మధ్య ఆసియాలో అమెరికా వైఖరి భారత్‌నూ కష్టాలపాలు చేస్తోంది. ముఖ్యంగా సిరియా, ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్, లెబనాన్, సౌదీ అరేబియా, కువైట్, పాకిస్తాన్, ఖజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్కిస్తాన్‌లలో పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. మధ్య ఆసియా దేశాలలో తన సైనిక దళాలను / మిత్రదేశాల దళాలను తగ్గించడం వలన హింసాయుత సంఘటనలు జరిగి మాన, ధన, ప్రాణ నష్టాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. శాంతి కరవై జాతి, మత విద్వేషాలతో పరస్పర దాడులకు తెగబడుతున్నారు. ఇదే సమయంలో ఆయా దేశాల్లో సహజ వనరులైన చమురు, యురేనియం, ఖనిజాల వ్యాపారం జోరుగా సాగిస్తూ అమెరికా, పశ్చిమ దేశాల కంపెనీలు తమ పబ్బం గడుపుకొంటున్నాయి. అమెరికా, ఇజ్రాయిలీయులకు పూర్తి మద్దతు తెలపడం ఆ దేశ ఆయుధ డీలర్లు చడీ చప్పుడు కాకుండా ఆయుధాలు అమ్ముకొని ధనవంతులవుతున్నారు. ఇజ్రాయల్‌లో ఎన్నికలలో నెతన్యాహుకు పూర్తి మెజారిటీ రాలేదు. దీంతో మళ్లీ ఎన్నికలకు ఆదేశించారు. ఈ సమయంలోనే పాలస్తీన, సిరియా, జోర్డాన్‌లు దాడులకు తెగబడుతున్నాయి. దీనికి ప్రతీకారంగా పాలస్తీనాలోని గాజా స్ట్రిప్ పై ఇజ్రాయల్ దాడులు చేస్తోంది. అరబ్బులు అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తుంటే ఆయిల్ ఎగుమతి దేశాల అసోషియేషన ద్వారా (ఒపిఇసి) చమురు ధరలను తగ్గించి చమురు ఉత్పత్తి చేసే, ఎగుమతి చేసే దేశాల ఆదాయాన్ని తగ్గించేలా అమెరికా పావులు కదుపుతోంది. అదేవిధంగా ఆయిల్ ఫీల్డ్‌ను నియంత్రిస్తున్న ఉగ్రవాదులను కట్టడి చేయడంపై పశ్చిమ దేశాలు దృష్టిపెట్టాయి. చమురు దిగుమతి చేసుకొనే దేశాల మీద భారం పడడమే కాకనానా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయి. ఆదాయం లేని మూడో ప్రపంచ దేశాలు ఆర్థిక స్థితి చిన్నాభిన్నం అవుతోంది. దీనకంతటికి కారణం అమెరికా అనాలోచిత చర్యలే. దీనిని అదనుగా తీసుకొని రష్యా, చైనాలు అమెరికా ఆధిపత్యం కలిగిన దేశాలకు సహాయం అందిస్తున్నాయి. తిరిగి మూడో ప్రపంచ యుద్ధ పోకడలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం సిరియాలో ఒకవర్గాన్ని ప్రోత్సహించి మద్దతుగా నిలవడంతో దాడులు పెరుగుతున్నాయి. దీనివల్ల భారీగా ధన, ప్రాణ నష్టాలు జరుగుతున్నాయి.

మధ్య ఆసియా దేశాలలో ఉగ్రవాద సంస్థలు తాలిబన్, జైషే మహ్మద్, తెహరిక్, ఐఎస్ఐఎస్ లాంటి ఉగ్ర సంస్థలు తమ కార్యకలాపాలతో అలజడి సృష్టిస్తున్నాయి. మిత్ర దేశాల దళాలను అమెరికా తగ్గించడం ద్వారా మధ్య ఆసియా దేశాలలో మారణకాండ పెరిగింది.ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ఐక్యరాజ్య సమితి ప్రయత్నిస్తున్నపటికీ ఫలితం కనిపించడం లేదు. ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలతో అమెరికా సంబంధాలు భారత్‌పై ప్రభావం చూపిస్తున్నాయి. ఇరాన్‌నుంచి చమురు దిగుమతిపై అమెరికా ఆంక్షలు విధిస్తోంది. ఇది భారత్‌కు నష్టం కలిగించే పరిణామం. మొత్తం మీద మధ్య ఆసియా దేశాలపై అమెరికా అనుసరిస్తున్న వైఖరి చాలా దేశాలపై ప్రభావం చూపిస్తోంది.

- డాక్టర్ కె. ఆసయ్య, ఐఐఎస్
8008359912

# నెలాఖరులోగా ఈసీలు?

**•వీసీల కంటే ముందే ఈసీల నియామకం**

**•వర్సిటీ నామినీలతో పాటు సీసీఈ నామినీ పేర్లు ప్రభుత్వానికి పంపిన ఉన్నత విద్యా మండలి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న విశ్వవిద్యాలయాల ఉప కులపతుల(వీసీ) నియామకం కంటే ముందే వర్సిటీల కార్యనిర్వాహక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)లను నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన నామినీల పేర్లు పంపించాలని పేర్కొంటూ యూని వర్సిటీలకు, కళాశాల విద్యా కమిషనర్‌కు ఉన్నత విద్యామండలి లేఖలు రాసింది. యూని వర్సిటీలతోపాటు కళాశాల విద్యా కమి షనర్ నామినీ పేర్లను ఉన్నత విద్యా మం డలికి పంపించారు. వర్సిటీల వారీగా ఈసీకి సంబం ధించిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలి ఇప్ప టికే ప్రభుత్వానికి పంపించింది. బాసరలోని ఆర్‌జీ యూ కేటీకి సంబంధించిన ఈసీపై ఇంకా నిర్ణయం తీసు కోకపోగా జేఎన్‌ఏఎఫ్‌ఏయూకి రెగ్యు లర్ ఉప కులపతి ఉన్నందున ఈసీ కొనసాగు తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న 9 వర్సిటీలకు సంబంధించిన ఈసీల ప్రతిపాద నలను ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి సమర్పిం చింది. నెలాఖరులోగా వర్సిటీలకు ఈసీలను నియమించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమచారం. వీసీల నియామకం, ఈసీల నియామకం వెనువెంటనే జరిగే అవకా శాలు కూడా లేకపోలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

### ఈసీ కూర్పు ఇలా...

యూనివర్సిటీ ఉపకులపతి ఈసీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కార్యదర్శిగా వర్సిటీ రిజిస్ట్రార్ ఉంటారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి/ కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి/కార్యదర్శి, కళాశాల విద్యా శాఖ కమిషనర్ ప్రభుత్వం తరపున సభ్యులుగా కొన సాగు తారు. దీనిని క్లాస్-1గా పిలుస్తారు. వీరు కాకుండా యూనివర్సిటీ కాలేజెస్ నుంచి ఒక సీని యర్ ప్రొఫె సర్, యూనివర్సిటీ కాలేజెస్ నుంచి ఒక ప్రిన్సి పాల్, యూనివర్సిటీ అనుబంధ కాలేజీల నుంచి ఒక ప్రిన్సి పాల్, యూనివర్సిటీ కాలేజెస్ టీచర్స్ నుంచి ఒక టీచర్, అఫ్లియేటెడ్ కాలేజెస్ టీచర్స్ నుంచి ఒక టీచర్‌ను క్లాస్-2లో సభ్యులుగా ప్రభుత్వం నియమిస్తుంది. ఈసీలో మరో నలుగురు సభ్యులను ఆయా వర్సిటీ పరిధిలోని విద్యావేత్తలు, పరి శ్రమలు, అగ్రికల్చర్, ట్రేడ్, కామర్స్, సామాజిక సేవ కులు, లీగల్ ప్రొఫెషనల్స్, నిపుణు లను సభ్యులుగా తీసు కుంటారు. ఇలా వర్సిటీ కార్య నిర్వహక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) కూర్పు ఉంటుంది. ఈసీలు సాంప్ర దాయక డిగ్రీ, పీజీ కోర్సులు అందించే వర్సిటీలకు ప్రైమా దిరిగా ఈసీలు కొన సాగుతాయి. ఇవి కాకుం డా ఇతర వృత్తి విద్యా కోర్సులు, సాంకేతిక విద్య, భాష, సాంస్కృతిక వర్సిటీలకు ఈసీలు వేరుగా ఉంటాయి.

### అపెక్స్ కమిటీలతోనే ముగిసిన గత వీసీల పదవీ కాలం

గతంలో ఉన్న వీసీల కాలంలో పూర్తిస్థాయి ఈసీలు లేకుండా కేవలం అపెక్స్ కమిటీలతోనే కొనసాగాయి. అపెక్స్ కమిటీలంటే ముగ్గురు ప్రభుత్వ ప్రతినిధు లతో పాటు వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లతో అపెక్స్ కమిటీలను ఏర్పాటు చేసి వాటితోనే వర్సిటీల సమావే శాలు నిర్వహిం చి నిర్ణయాలు తీసు కున్నా రు. వీసీల పదవీ కాలం ముగిసే వరకు కూడా ఏ ఒక్క వర్సిటీకి పూర్తిస్థాయి ఈసీలను నియమించలేదు. వర్సిటీల నుంచి ఈసీల కోసం వచ్చిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి పంపించినప్పటికీ వాటిపై వీసీల పదవీ కాలం ముగిసే వరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో పూర్తిస్థాయి ఈసీలు లేకుండా కేవలం అపెక్స్ కమిటీలతోనే వీసీల పదవీ కాలం ముగిసింది.



# యూనివర్సిటీల్లో ఇన్నోవేషన్ సెంటర్లు

**•జనవరి నుంచి ప్రారంభం •మార్చిలోపు పూర్తి స్థాయిలో అమలు •ఎంపిక చేసిన కాలేజీల్లోనూ ఏర్పాటు**

**•ఇప్పటికే మూడు యూనివర్సిటీల్లో ఇంక్యూబేటర్ల ఏర్పాటు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో ఉన్న విశ్వ విద్యాలయాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. నేషనల్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ-2019లో భాగంగా యూనివర్సిటీ లతోపాటు, ఉన్నత విద్య కేంద్రాల్లో ఇన్నో వేషన్ కేంద్రాలను ఏర్పా టు చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని యూనివర్సి టీలతోపాటు ఎంపిక చేయబడిన డిగ్రీ కాలేజీల్లోనూ ఇన్నోవేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇన్నోవేషన్ సెంటర్లలో వచ్చిన ఆలోచనలను ఆచరణ రూపంలో ఇప్పటికే ప్రారంభించబడిన ఇంక్యూ బేటర్లలో అమలు చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగా శుక్ర వారం యూనివర్సిటీల రిజిస్ట్రార్లతో ఉన్నత విద్యా మండలి ప్రత్యేక సమావేశాన్ని మండలి కార్యా లయంలో ఏర్పాటు చేసింది.

ఇన్నోవేషన్ కేంద్రాలను జనవరి నుంచే ప్రారంభించేలా చూడాలని రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యా మండలి సూచించింది. మార్చి నాటికి పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించింది. యూనివర్సిటీలు ఏర్పాటు చేసే ఇన్నోవేషన్ సెంటర్లకు అవసరం అయితే ఉన్నత విద్యా మండలి స్వయంగా ఆర్థికసాయం చేయాలనే ఆలోచనలో కూడా ఉన్నట్టు ఛైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి వర్సిటీ రిజిస్ట్రార్లకు తెలి పారు. ఇన్నోవేషన్ కేంద్రాలను వర్సిటీల వారీగా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సాంప్రదాయక డిగ్రీ కోర్సులను అందిస్తున్న వర్సిటీలో సోషల్ సైన్సెస్ పై అలాగే సాంకేతిక వర్సిటీలు టెక్నాలజీపై అగ్రికల్చర్ వర్సిటీ వారికి సంబంధించిన వాటి గురించి ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యా మండలి సూచించింది.

సాంప్రదాయక వర్సిటీలు సామాజిక సమస్యలు, మధ్యనిషేధం, కల్చర్ వంటి వాటిపై నూతన ఆవిష్కరణలకు సంబంధించిన ఆలోచనలను చేసేలా చూడాలి. ఇన్నోవేషన్‌లో భాగంగా ఎలాంటివి చేయాలి అనే వాటిపై వర్సిటీలోని విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి అవగాహన కల్పించడమే కాకుండా వారి ఆలోచనలు తీసుకొని వాటిని అమలు చేయడం కోసం చూడాలని నిర్ణయించారు.

### సహకారం అందించనున్న జేఎన్‌టీయూ

ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు జేఎన్ టీయూ వర్సిటీ సహకరించాలని సమా వేశంలో నిర్ణయించారు. ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు, ఎటువంటి నూతన ఆలోచ నలతో ముందుకు సాగాలనే అంశాలపై జేఎన్‌టీయూ అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే జేఎన్‌టీయూలో ఇంక్యూ బేటర్‌ను ఏర్పాటు చేసి జే-హబ్‌ను కొనసాగిస్తున్న నేపథ్యంలో జేఎన్ టీయూ మిగిలిన వర్సిటీలకు సహాయ సహకారాలను అందించాలని సమా వేశంలో నిర్ణయించారు.

వర్సిటీలతోపాటు ఎంపిక చేయబడిన డిగ్రీ, పీజీ కాలేజీల్లో కూడా ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్ఐఎస్‌పీ-2019లో భాగంగా రాష్ట్రస్థాయిలో ఒక టీమ్‌ను ఏర్పాటు చేయాలని ఉంది. అదేవిధంగా యూనివర్సిటీ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే జేఎన్‌టీయూలో ఒక ఇంక్యూబేటర్‌ను ఏర్పాటు చేయగా ఉస్మానియా యూనివర్సిటీలోనూ ఏర్పాటు చేశారు. కాకతీయ యూనివర్సిటీలో కూడా త్వరలోనే ఇంక్యూబేటర్ ఏర్పాటు చర్యలు ప్రారంభించారు. ఇన్నోవేషన్ సెంటర్లలో వచ్చిన ఆలోచనలను ఆచరణ రూపంలో పెట్టడానికి ఇంకూబేటర్లను ఉపయోగించుకోనున్నారు.

### 28న హైదరాబాద్‌లో ' సేవ్ ఇండియా- సేవ్ రాజ్యాంగం' భారీ ర్యాలీ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న ' సేవ్ ఇండియా- సేవ్ కానిస్టిట్యూషన్ ' పేరుతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహిం చాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నది . శుక్రవాగరం గాంధీభవన్‌లో టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ యాదవ్, ఏఐసీసీ అధికార ప్రతినిధి మధుయాష్కీగౌడ్, టీ పీసీఈస వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్‌తో పాటు నగరంలోని పలువురు నేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28న గాంధీభవన్ నుంచి అబిడ్స్ మీదుగా ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

### నేడు ఇందిరా పార్కు వద్ద ధర్నా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఎన్‌ఆర్‌సీ బిల్లుకు వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద టీ పీసీసీ మైనార్టీ సెల్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించనున్నట్లు మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా సోహైల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసనలు, ఆందోళనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

### ముస్లిం ఓట్ల చీలికకు అసదుద్దీన్ కుట్ర: వీహెచ్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఎన్‌ఆర్‌సీ బిల్లును పార్లమెంట్‌లో చించివేసిన మజ్లిస్ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ.. ముస్లింలకు అండగా ఎందుకు ఉద్యమాలు చేయడం లేదని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి. హనుమంతరావు ప్రశ్నించారు. ఎన్‌ఆర్‌సీ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ముస్లిం, మైనార్టీలు చేస్తున్న ర్యాలీకి వీహెచ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు వీహెచ్‌ను అరెస్టు చేశారు. ముస్లింలకు అన్యాయం జరుగుతుంటే స్పందించని ఓవైసీ.. ఓట్లలో మాత్రం చీలిక తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నారని వీహెచ్ మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగిన తన పార్టీ అభ్యర్థులను పోటి చేయించి బీజేపీకి లాభం చేకూరే విధంగా కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

### సీఏఏపై కేసీఆర్ బహిరంగ ప్రకటన చేయాలి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొన్ని పాఠశాలలు విద్యార్థులకు నూరిపోస్తున్న విషయంతమ దృష్టికి వచ్చిందని అలాంటి పాఠశాలలపై దేశద్రోహ కేసులు పెడతామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లు ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఇంద్రసేనారెడ్డి సీఏఏపై పూర్తి అవగాహన లేకపోవడంతోనే కొంత మంది ఆందోళనలు చేస్తున్నా రన్నారు. సీఏఏపై కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు ఒకేరకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సీఏఏకు పార్లమెంట్‌లో వ్యతిరేకంగా వ్యవహరించిన టీఆర్ఎస్ ఎందుకు వ్యతిరేకించిందో ప్రజలకు సీఎం కేసీఆర్ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సీఏఏను వ్యతిరేకిస్తున్నామని కేసీఆర్ ఇంత వరకు ఎందుకు ప్రకటన చేయలేదని నిలదీశారు. యూనియన్లను రద్దు చేయడం రద్దు చేయాలని కేసీఆర్ భావించడం మూర్ఖత్వమన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఇప్పటికే అనేక సంస్థలను నిర్వీర్యం చేశారని, తాను చెప్పిందే వేదం, చేసిందే శాసనం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మానవత్వం గురించి తెరాస నేతలు మాట్లాడటమా?



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** మానవత్వం అంటూ టీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంఎల్‌సీ ఎన్. రాంచందర్‌రావు అన్నారు. సీఏఏ చట్టంపై టీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం అవగాహ లేదని, కేవలం ఎంఐఎంకు భయపడే గుడ్డిగా ఈ బిల్లును టీఆర్ఎస్ లోక్‌సభలో వ్యతిరేకించిందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్‌తో కలిసి మాట్లాడారు. సీఏఏ బిల్లు మతతత్వాన్ని ప్రోత్సహించేదిగా ఉందనడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లను ప్రకటించడం ఏ తత్వమో టీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు.

### ఆ ముగ్గురి అరెస్ట్.. అక్రమం కాదు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హైకోర్టు ఆదేశాల మేరకు చైతన్య మహిళా సంఘానికి చెందిన డి.దేవేంద్ర, ఎం.స్వప్న, తెలంగాణ విద్యార్థి వేదిక ప్రధాన కార్యదర్శి ఎం.సందీప్ లను పోలీసులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు హాజరుపర్చారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 164 ప్రకారం ముగ్గురు డిటెన్యూల వాంగ్మూలాల్ని నమోదు చేసి మధ్యాహ్నం 2.30 గంటల లోగా తమకు సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ను ఆదేశించింది.

జుడీషియల్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాల మేరకు డిటెన్యూలను పోలీసులు జుడీషియల్ కస్టడీ లోకి తీసుకుంటే అది అక్రమం కాదని చట్టబద్ధమేనని హైకోర్టు స్పష్టంచేసింది. సదరు మేజిస్ట్రేట్ కు ఆ అధికారాలు ఉన్నాయని, వాటిలో మేము జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఒకసారి డిటెన్యూలను కోర్టులో ప్రవేశపెట్టడంతోనే ఆర్టికల్ 21 ఉల్లంఘన ముగుస్తుంది. అందువల్ల ఈ కేసులో ఎలాంటి యోగ్యతలు లేవని పేర్కొంటూ హైకోర్టు హెబియస్ కార్పస్ పిటిషన్ పై విచారణ ముగించింది.

పిటిషనర్ల తరపు న్యాయవాది వి.రఘునాథ్ అభ్యర్థన మేరకు డిటెన్యూలు వారి బంధువులను కలుసుకునేందుకు హైకోర్టు అనుమతించింది. అయితే వారు అదనపు ఎస్పీ సమక్షంలో రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయంలో అర గంటపాటు మాత్రమే కలిసి మాట్లాడాలని హైకోర్టు స్పష్టం చేసింది. వారు మాట్లాడుకునే సమయంలో పోలీసులు జోక్యం చేసుకోరాదని హైకోర్టు పేర్కొంది. చర్చలు ముగియగానే డిటెన్యూలను జైలుకు తరలించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

# కాలేజీల షిఫ్టింగ్ ఈజీ కాదు

**•ఇకపై బదిలీ అధికారం ముఖ్యమంత్రికి •ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఉన్నత విద్యామండలి**

**•కోర్సు కన్వర్షన్, కో-ఎడ్యుకేషన్ నుంచి మహిళా కాలేజీల అంశం కూడా..**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఒక మండలం నుంచి మరో మండలానికి మార్చాలంటే ఇక ముందు ఎంతమాత్రం తేలికైన వ్యవహారం కాదు. ఇప్పటి వరకు ఉన్న అధికారాలను కాదని కాలేజీల బదలీ అధికారం ముఖ్యమంత్రికి కట్టబెట్టాలని ఉన్నత విద్యా మండలి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రతి ఏడాది కొన్ని కాలేజీలు ఒక మండలం నుంచి మరో మండలానికి మార్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తు న్నాయని ఇలా మారే క్రమంలో ఉన్నత విద్యా మండలితోపాటు ప్రభుత్వంపై కాలేజీల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాలేజీలు మండలం నుంచి మరో మండలానికి మార్చాలంటే ఇప్పటికే అక్కడ కాలేజీలు ఉంటే వారు వ్యతిరేకిస్తున్నారని అలాగే కాలేజీల షిఫ్టింగ్ ఫైల్‌ను ప్రభుత్వానికి పంపించే వరకు యాజమాన్యాలు వదలని పరిస్థితి నెలకొంది. అయితే ఈ మధ్య కాలంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో కాలేజీల షిఫ్టింగ్ అధికారాన్ని విద్యా శాఖ మంత్రి నుంచి ముఖ్యమంత్రికి కట్టబెడితే విద్య శాఖ మంత్రిపై కూడా వత్తిడి ఉండకుండా ఉంటుందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే కాలేజీల షిఫ్టింగ్ అధికారాన్ని సీఎంకు కట్టబెట్టేలా ప్రతిపాదనలను సిద్ధం చేసి సీఎంకు పంపాలని నిర్ణయించారు. కాలేజీల షిఫ్టింగ్‌తోపాటు కోర్సు కన్వర్షన్, అలాగే కో ఎడ్యుకేషన్ నుంచి మహిళా కళాశాలగా మార్చు చేసే అధికారాలను కూడా సీఎం పరిధిలోకే తీసు కురావాలని నిర్ణయించారు. సీఎం పరిధిలోకి తీసుకెళ్లితే కాలేజీల షిఫ్టింగ్‌కు బ్రేకులు పడే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

### గతంలో ఇష్టానుసారంగా షిఫ్టింగ్

గతంలో కాలేజీల షిఫ్టింగ్‌ను ఇష్టానుసారంగా చేశారని అందుకే ఇటువంటి నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా డిగ్రీ కాలేజీలు అనుమతి తీసుకున్న ప్రాంతంలో కొనసాగించకుండా ఇతర ప్రాంతాల్లో కొనసాగిస్తున్నారు. ఒకే మండలంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారితే ప్రభుత్వ అనుమతి అవసరం ఉండదు. కానీ ఒక మండలం నుంచి మరో మండలానికి కాలేజీని మార్చాలనుకుంటే మాత్రం తప్పకుండా ప్రభుత్వ అనుమతి తీసుకోవల్సిందే. అందులో భాగంగానే గతంలో కాలేజీల షిఫ్టింగ్ పెద్ద ప్రహసనంగా సాగిందని ఉన్నత విద్యా మండలి ఒక నిర్ణయానికి వచ్చింది. గత ఏడాది కొన్ని పోటీ పరీక్షలకు డిగ్రీ కాలేజీలను సెంటర్లుగా వేసిన ఉన్నత విద్యా మండలికి ఆయా కాలేజీలు సంబంధిత అడ్రస్‌లో కాకుండా ఇతర చోట్ల ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష రాయడానికి వెళ్లిన విద్యార్థులు పరీక్షా కేంద్రం చెప్పిన అడ్రస్‌లో లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం ముఖ్య మంత్రి దృష్టికి వెళ్లింది. దీనిపై సీఎం స్పందించి ఉన్నత విద్యా మండలి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### జీహెచ్ఎంసీ పరిధిలో అధ్యయనం

జీహెచ్ఎంసీ పరిధిలో కాలేజీలు మార్చాల్సి వస్తే వాటిని మండలం వారీగా చూడాలా? లేకపోతే జోన్ల వారీగా చూడాలా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిపై అధ్యయనం చేసి తగిన సూచ నలు చేయాలని ఉస్మానియా వర్సిటీ అధికారులను ఉన్నత విద్యా మండలి కోరింది. జోన్ల వారీగా కాలేజీలు ఎన్ని ఉన్నాయి..జనాభా ఎంత మంది ఉన్నారో తెలుసుకోవాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలో కాలేజీని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చే అధికారం కూడా సీఎంకే కట్టబెట్టారు. అయితే అది జోన్ల వారీగా కొనసాగిం చాలా లేకపోతే మిగిలిన వాటిలాగే మండలం వారీగానా అనేది అధ్యయనం చేసిన నివేదిక అందిన అనంతరం నిర్ణయించనున్నారు.

### 'కాళేశ్వరం' రక్షణపై ఆక్టోపస్ దళాల డెమో



**మహదేవపూర్, ప్రభన్యూస్ :** తెలంగాణ ప్రజలకు సాగు, తాగు నీరందించి సస్యశ్యామలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ రక్షణపై ఆక్టోపస్ దళాలు శుక్రవారం డెమో నిర్వహించారు. కాటారం డీఎస్పీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో అన్నారం సరస్వతి బ్యారేజి వద్ద ఆక్టోపస్ దళాలకు చెందిన 60 మంది పోలీసులు ప్రాజెక్టును మెరుపు దాడులు ఎదురైతే ఎలా రక్షించుకోవాలనే విష యమై ప్రాజెక్ట్ అధికారులకు, పోలీసులకు కల్లకుకట్టే విధంగా డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో సీఐ నర్సయ్య, ఎస్సై శ్రీనివాస్, ఏఈఈ యాకయ్య తదితరులు ఉన్నారు.

### ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** జోనల్ సమస్యలను పరిష్కరించి ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు విడుదల చేయలని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతరాయ్ డిమాండ్ చేశారు. గ్రూప్ 1, 2,3,4 తో పాటు జూనియర్, పాలిటెక్నిక్ లెక్చరెర్ల నోటిఫికేషన్స్‌ను విడుదల చేయాలన్నారు. శుక్ర వారం ఆయన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మానవతరాయ్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. తెలంగాణ నిరుద్యో గులకు ఎదురయ్యే జోనల్ చిక్కులను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని, అందుకు రాష్ట్ర ప్రభు త్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జోనల్ సమస్యపై రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకుని వినతి పత్రం అందజేయ నున్నట్లు ఆయన తెలిపారు.

### 'వాల్వ్‌ల చికిత్సలో కొత్త పద్ధతులు'

**హై దరాబాద్,ఆంధ్రప్రభ:** గుండె సంబందిత జబ్బుల్లో అరోటిక్ వాల్వ్ స్టెనోసిస్ ఒకటని దీని చికిత్సలో హార్ట్‌వాల్వ్ రీప్లేస్ మెంట్ మెరుగైె విధానమన్నారు ప్రపంచ గుండె చికిత్సా నిపుణుడు డా: అలైన్ క్రిబియర్. శుక్రవారం ఇక్కడ హైదరాబాద్ వాల్వ్ కాన్ఫరెన్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పలువురు హృద్రోగ వైద్యులకు పలు ఆధునిక మెళకువల్లో శిక్షణ ఇచ్చారు. ఇంటర్వెన్షనల్ కార్డియలజిస్టులు, హైదరాబాద్ వాల్వ్ ,అపోలో ఆసుపత్రుల గ్రూపు సంయుక్తంగా ఈ రెండు రోజుల సదస్సును ఏర్పాటు చేసింది. రూయన్ వర్సిటీ కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ హెలెన్, అపోలో గ్రూపు అధ్యక్షుడు డా: హరి ప్రసాద్, డా:పిసి రత్, డా: మనోజ్ అగర్వాల్ పాల్గొన్నారు.

# ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు చారిత్రాత్మకం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో 36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ప్రారం భించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని నోబెల్ శాంతి బహుమతి గ్రహిత కైలాష్ సత్యార్థి స్థాపించిన బచ్‌పన్ బచావో ఆందోళన సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ చందన పేర్కొన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, హై కోర్టు సీజే చౌహాన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైఎస్ చైర్మన్ వినోద్ కుమార్‌తో చందన సమావేశం అయ్యారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఫాస్ట్ ట్రాక్ కోర్టుల వల్ల మహిళలు, చిన్నారులపై జరిగే లైంగిక దాడులపై సత్వర న్యాయం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.



ఫాస్ట్ కోర్టుల అంశాన్ని బోయినపల్లి వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న ప్పుడు కైలాష్ సత్యార్థిని కలిసి వివరించారని ఆమె పేర్కొ న్నారు. ఏడాదిన్నర క్రితమే కరీంనగర్ ఎంపీగా ఉన్న ప్పుడు సీఎం కేసీఆర్‌కు వినోద్ కుమార్ లేఖ రాశారని చందన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు వల్ల సత్వర న్యాయం జరుగుతోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైఎస్ చైర్మన్ బి. వినోద్‌కుమార్ అన్నారు. ఏక కాలంలో 36 కోర్టుల ను ఏర్పాటు చేయడం రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ ఘట్టమని ఆయన అన్నారు. తాను కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పటి నుంచి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఆవశ్యకతపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు.

**చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ మృతదేహాలకు**

# రాష్ట్రేతర నిపుణులతో రీపోస్టుమార్టంపై మీ అభిప్రాయం చెప్పండి

**•ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దిశ హత్యాచార నిందితుల మృతదేహాల అప్పగింత పై సుమోటో ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో ఆధారాల సేకరణపై తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని హైకోర్టు తెలిపింది. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన హైకోర్టు మృతదేహాలకు మరోసారి పోస్టుమార్టం నిర్వహించేలా ఆదేశిస్తామని పేర్కొంది. రాష్ట్రేతరులైన ఢిల్లీ ఫోరెన్సిక్ నిపుణులతో తిరిగి శవపరీక్ష చేయిస్తామని హైకోర్టు ప్రకటించింది. రాష్ట్రేతర నిపుణులతో రీపోస్టు మార్టం చేయించాల్సిన అవసరం లేదని ఏజీ విన్నవించారు. అలాగే మృత దేహాల పరిస్థితి పై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఏజీ బీఎస్.ప్రసాద్‌ను ఆదేశించింది. మృతదేహాల పరిస్థితిని వివరించేందుకు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ శనివారం ఉదయం 10.30 గం.లకు కోర్టు విచారణకు హాజరయ్యేలా చూడాలని హైకోర్టు ఏజీని ఆదేశించింది. రాష్ట్ర న్యాయ, పోలీసు వ్యవస్థల తీరును, దేశంతో పాటు ప్రపంచమంతా గమనిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ శనివారానికి వాయిదా వేసింది.

దిశ నిందితుల మృతదేహాలకు సంబంధించి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించే అంశంపై హైకోర్టుకు వెళ్లేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. ఆధారాల సేకరణ అంశాన్ని హైకోర్టు పర్యవేక్షిస్తుందని, ఈ వ్యవహారంపై తగిన ఆదేశాలు జారీ చేస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు(రిట్ పిటిషన్ (క్రిమినల్) నంబర్ .364 /2019) 17.12.2019న వెలువరించిన తీర్పు ప్రతిని అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి ధర్మాసనానికి సమర్పించారు.

ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. నిందితుల శవాలకు స్థానికేతరులైన నిపుణులచేత రీపోస్టుమార్టం చేసేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించలేదని తెలిపారు. పిటిషనర్లు కోరకుండానే హైకోర్టు ఎలా ఆదేశాలు జారీ చేస్తుందన్నారు. దానికోసం హైకోర్టులో పిటిషనర్లు ప్రత్యేకంగా అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. సదరు పిటిషనర్లు ఎలాంటి అఫిడవిట్ దాఖలు చేయలేదని విన్నవించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. న్యాయోచితంగా నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నామో ప్రపంచానికి చాటి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ ప్రశ్నాత్మకంగా మారకూడదని ధర్మాసనం అభిప్రాయపడింది.

### వచ్చే ఏడాదికి కావాల్సిన పుస్తకాల వివరాలు సేకరణ

**•ఎన్ని కావాలో వివరాలు ఇవ్వాలని డీఈవోలకు కమిషనర్ ఆదేశాలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎన్ని పుస్తకాలు అవసరం అవుతాయో వివరాలు ఇవ్వాలని పాఠశాల విద్య కమిషనర్ జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. 2019-20 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎన్ని పుస్తకాలు తీసుకున్నారు... వచ్చే ఏడాది 2020-21 విద్యాసంవత్సరానికి ఎన్ని పుస్తకాలు అవసరం అవుతాయో చెప్పాలంటూ కమిషనర్ టి విజయ్‌కుమార్ డీఈవోలను కోరారు. ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాల్లో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలను అందిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే 2020-21 సంవత్సరానికి గానూ క్లాస్, మీడియం, టైటిల్ వారీగా ఎన్ని పుస్తకాలు కావాలో జిల్లాల వారీగా పంపించాలని కోరారు. స్కూల్ పాయింట్ల నుంచి వివరాలను సేకరించి కమిషనరేట్‌కు పంపించాలని ఆదేశించారు. ఈ ఏడాది స్కూల్స్ ప్రారంభం కంటే ముందే ఉచిత పాఠ్యపుస్తకాలను అందించిన నేపథ్యంలో వచ్చే ఏడాది కూడా పాఠశాలలు పునః ప్రారంభం కంటే ముందుగానే పుస్తకాలను అందించడం కోసం ఈ వివరాలను సేకరిస్తున్నారు.

# సీఐఎస్‌ఎఫ్ సేవలు భేష్

**నిసా డైరెక్టర్ అంజనా సిన్హా**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి చెందిన ఫైర్ సర్వీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఏఎస్‌టీఐ), ప్రముఖ ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ 28వ బ్యాచ్ కానిస్టేబుల్, ఫైర్ బేసిక్ కోర్సుకు చెందిన 604 మంది ట్రైనీల పాసింగ్ పరేడ్ శుక్రవారం హకీంపేటలో జరిగింది. జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (నిసా) డైరెక్టర్ అంజనా సిన్హా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని దీక్షాంత్ పరేడ్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సిఐఎస్ఎఫ్ దేశ ప్రధాన భద్రతా దళమని, సిఐఎస్ఎఫ్ అద్భుతమైన గతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు (సిఐఎస్ఎఫ్) క్లిష్ట పరిస్థితుల్లో అద్భుతమైన సేవలు అందించాయని, భద్రతా దళాలు అందిస్తోన్న సేవలు, వారి కార్యదీక్షపట్ల ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. 2017లో ఎఫ్ఎస్‌టిఐకి అత్యుత్తమ ఇండియా నైపుణ్యం, ప్రతిభ (ఫిస్ట్) అవార్డును ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రదానం చేసినట్లు సిన్హా గుర్తుచేశారు. భారత రాజ్యాంగం, సీఐఎస్ఎఫ్ వారసత్వాన్ని సమర్థవంతంగా కాపాడాలని, శిక్షణ పొందిన వారు తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని సూచించారు. పారిశ్రామిక భద్రతా నిర్వహణ రంగంలో ఉత్తమ కేంద్రంగా నిసా అకాడమీని భారత ప్రభుత్వం గుర్తించడంపట్ల ఆమె హర్షం వ్యక్తంచేశారు. శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్, డీఐజీ ఎస్‌కే మల్లిక్ మాట్లాడుతూ, అకాడమీ శిక్షణా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అకాడమీలో ఇచ్చే కఠినమైన శిక్షణ వారిని వృత్తి జీవితంలో గొప్ప స్థానంలో నిలిచేలా ఉపయోగపడుతోందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

### బాపట్ల బీచ్‌లో 24 అడుగుల జగన్ సైకత శిల్పం




**అమృతలూరు, ప్రభన్యూస్:** ముఖ్యమంత్రిగా తొలి జన్మదినోత్సవం జరుపుకుంటున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వినూత్నరీతిలో అభినందనలు తెలుపుతూ ఏర్పాటు చేసిన సైకత శిల్పం చూపరులను ఆకట్టుకుంటోంది. వేమూరు నియోజకవర్గం చుండూరు మండలానికి చెందిన వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరు వెంకటరెడ్డి గుంటూరు జిల్లా బాపట్ల సమీపంలోని సూర్యలంక బీచ్‌లో 24 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తుతో సీఎం జగన్ సైకత శిల్పం రూపొందింపచేశారు.. ఇందులో భాగంగా సీఎంకు శుభాకాంక్షలతో పాటు, వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా భావించి అమలు చేస్తున్న నవరత్నాల గురించి కూడా తెలిపేలా సైకత శిల్పం ఏర్పాటు చేయటం విశేషం. సైకత శిల్పం చూపరులను ఆకట్టుకునే విధంగా ఉందంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Andhraprabha business 2019

బిజినెస్

BUSINESS

# ఆర్థిక మందగమనం తాత్కాలికమే!

## వేగంగా పూర్వస్థితిని అందుకుంటాం

- గతంలోనూ ఎత్తుపల్లాలు
- పెట్టుబడుల విషయంలో భయపడొద్దు
- ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి
- బెరుకు లేకుండా వ్యయం చేయండి
- పారిశ్రామిక వర్గానికి ప్రధాని మోడీ భరోసా
- అసోచామ్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రసంగం
- ఐదారేళ్ల క్రితం ఆర్థిక వ్యవస్థను రక్షించామని వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** ఆర్థిక మందగమనంతో వృద్ధి పతనం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ మందగమనం నుంచి వేగంగా పూర్వస్థితిని అందుకుంటుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ మునుపటి కంటే అధిక వృద్ధి పథంలో పయనిస్తుంది. జీడీపీ వృద్ధి కోసం కార్పొరేట్లు భారీగా పెట్టుబడులు పెట్టాలని, ఎలాంటి భయాలు అక్కర్లేదని ఆయన భరోసానిచ్చారు. బెరుకు లేకుండా వ్యయాలు చేయాలని ఆయన సూచించారు. కార్పొరేట్ రంగంలో నేరాలకు పాల్పడుతున్నవారిపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన ఊటంకించారు. నిజాయితీగా నిర్ణయాలు తీసుకుని పనిచేస్తే ఎలాంటి చర్యలు ఉండబోవని హామీ ఇచ్చారు. పారిశ్రామిక సమాఖ్య అసోచామ్ 100వ వార్షికోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక మందగమనంపై జరుగుతున్న చర్చల గురించి నాకు పూర్తి అవగాహన ఉంది. ఈ వ్యాఖ్యలపై నేను సవాళ్లు చేయను. చర్చల నుంచి సానుకూల అంశాలను తీసుకునేందుకు నేను ప్రయత్నిస్తాను అని ఆయన అన్నారు. వ్యవస్థలోని లోపాలను అధిగమించి ఉత్తమమైన ఫలితాలు సాధించగలమని బ్యాంకింగ్, కార్పొరేట్ ప్రపంచానికి నేను హామీ ఇస్తున్నాను. కాబట్టి కార్పొరేట్లు పెట్టుబడుల విషయంలో ఎలాంటి భయం లేకుండా భారీ నిర్ణయాలు తీసుకోవచ్చు. భారీగా పెట్టుబడులు పెట్టొచ్చు. బెరుకులేకుండా వ్యయాలు చేయవచ్చు. వాణిజ్యం విషయంలో నిజాయితీగా నిర్ణయాలు తీసుకునే సందర్భంలో ఎలాంటి అవాంఛనీయ చర్యలు ఉండబోవని నేను భరోసా ఇస్తున్నానని మోడీ అన్నారు. ఐదారేళ్ల క్రితం విపత్తు దిశగా పయనిస్తున్న ఆర్థిక వ్యవస్థను రక్షించాం. తమ ప్రభుత్వం కేవలం ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం తీసుకురావడమే కాకుండా క్రమశిక్షణ కోసం ప్రయత్నించిందని మోడీ అన్నారు. పారిశ్రామిక సమాఖ్య దశాబ్దాల డిమాండ్లను మోడీ ప్రభుత్వం నెరవేర్చిందని ఆయన వ్యాఖ్యానించారు.

### 130 కోట్ల భారతీయుల భవిష్యత్‌కు ఏజెంట్లం

గత మూడేళ్లగా వృద్ధి పథంలో పయనిస్తున్న టాప్-10 దేశాల్లో భారత్ కూడా ఉందని ఆయన కొనియాడారు. ప్రజల ఆగ్రహం, ఆరోపణలను నుంచి ఈ ఫలితాన్ని సాధించలేదని వ్యాఖ్యానించారు. మేము కార్పొరేట్ ఏజెంట్లమని చెబుతూ వస్తున్నాం. అయితే 130 మంది భారతీయుల భవిష్యత్‌కు ఏజెంట్లమని ఆయన వ్యాఖ్యానించారు. పలు నిబంధనలు నేరరహితం చేస్తూ కంపెనీల చట్టంలో మార్పులు చేశాం. తదనంతరం మరిన్ని సవరణలు ఉంటాయి. ప్రస్తుతమున్న అపరిష్కృత మరియు దివాళా చట్టం(ఐబీసీ కోడ్) కారణంగా కంపెనీలు విఫలమవుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కార్పొరేట్ ప్రపంచానికి, కంపెనీల మూలధనానికి రక్షణగా నిలుస్తాయని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. జీడీపీ వృద్ధిరేటు త్రైమాసికాల వారీగా క్షీణించినప్పుడు కొంతమంది ఎందుకు నిశబ్దంగా ఉన్నారో నేను చెప్పను. ఆర్థిక వృద్ధిలో ఎత్తు, పల్లాలు గతంలో కూడా కనిపించాయి. కానీ ఇలాంటి పరిస్థితుల నుంచి కూడా గట్టెక్కేందుకు దేశానికి శక్తి ఉంది. తిరిగి అధిక ఆర్థిక వృద్ధి పథంలోకి వస్తుందనే నమ్మకం ఉందని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంక్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత్ స్థానం మెరుగుపడడాన్ని గుర్తుచేశారు. భారత్ ర్యాంకు మూడేళ్లలో 63వ స్థానానికి చేరిందని అన్నారు.



### మౌలిక రంగంలో రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులు



రానున్నసంవత్సరాలలో మౌలిక రంగంలో నిర్మాణాల కోసం రూ. 100 లక్షల కోట్లు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై రూ. 25 లక్షల కోట్లు వ్యయం చేయనున్నాం. ఫలితంగా 2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ రెట్టింపు అయ్యి 5 ట్రిలియన్ డాలర్లకు చేరడంలో సహాయ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టులు, పోర్టుల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు సమయాన్ని ఆదా చేస్తున్నాయన్నారు. కంపెనీ నమోదు కోసం గతంలో నెలల సమయం పట్టేదని, ప్రస్తుతం ఇది గంటలకు తగ్గిందని చేశారు. వాణిజ్య, పరిశ్రమల విభాగాల నుంచి అందిన సూచనల మేరకు జీఎస్టీలో అనేక మార్పులు తీసుకొచ్చామని ఆయన గుర్తుచేశారు. మేము ఎలాంటి సవాళ్లకు భయపడడం లేదు. గత ఐదేళ్లలో భారత్ అత్యధిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అందుకుంది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టం భారత్‌కు ఉందని ఆయన కొనియాడారు. కార్మిక శక్తి ప్రయోజనాల విషయంలో ఖచ్చితంగా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో ఒక త్రైమాసికంలో వృద్ధిరేటు 3.5 శాతానికి పతనమవ్వడం, ధరల ద్రవ్యోల్బణం 9.4 శాతం, ప్రధాన ద్రవ్యోల్బణం 7.3 శాతం, హోల్‌సేల్ ద్రవ్యల్బణం 5.2 శాతం, జీడీపీలో ద్రవ్యలోటు 5.6 శాతంగా నమోదవ్వడాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఇదిలావుండగా ప్రధాని మోడీ హయాంలో వరుసగా ఆరవ త్రైమాసికం క్షీణించి జులై- సెప్టెంబర్ త్రైమాసికం ఆరేళ్ల కనిష్టం 4.5 శాతంగా నమోదయింది. ఉత్పత్తి, వినియోగరంగాల్లో వృద్ధి భారీగా పతనమవ్వడం ఈ పరిస్థితికి కారణమైన విషయం తెలిసిందే.

## సందేహాలను పక్కన పెట్టండి

**న్యూఢిల్లీ:** ఆర్థిక మందగమనంపై సందేహాల నుంచి బయటకు బయట పడాలని పారిశ్రామిక సమాఖ్యను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. సహజ ధోరణులను విడనాడాలని పారిశ్రామిక వేత్తలను ఆమె కోరారు. అసోచామ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రీ బడ్జెట్ సమావేశాలు ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుత వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పారిశ్రామిక రంగానికి భరోసానిస్తూ మరిన్ని నిర్ణయాలు తీసుకునేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నామని ఆమె అన్నారు. మనం చేయగలమా? భారత్ సాధించగలదా? ప్రస్తుతం విలోమ పరిస్థితులు ఎందుకు ఉన్నాయి? వంటి సందేహాలను పక్కన పెట్టాలని ఆమె కోరారు. స్థూల ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన సూచీలన్నీ సానుకూలంగానే ఉన్నాయని ఆమె వెల్లడించారు. భారత్‌ను నమ్మండి. వందేళ్లుగా మీరు సేవలు అందిస్తున్నారు. మీరంతా ఇప్పుడు మరింత కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. మీలో ఉన్న సహజ ధోరణి ఆలోచనలను మానుకోవాలి. మార్పు తీసుకురావాలని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు.




## డ్రైవర్ రహిత కార్లను అనుమతించం



**న్యూఢిల్లీ:** డ్రైవర్ అవసరంలేని కార్లను భారత్‌లో అనుమతించబోమని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. భారత్‌లో 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని ఆయన పేర్కొన్నారు. అసోచామ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డ్రైవర్ల రహిత కార్లకు సంబంధించి నన్ను అనేక సార్లు ప్రశ్నించారు. తాను రోడ్డు రవాణా శాఖ మంత్రిగా ఉన్నంత కాలంగా డ్రైవర్ అవసరంలేని కార్లను అనుమతించను. దేశంలో డ్రైవర్లు కొరత ఎక్కువగా ఉంది. దేశంలో ఉద్యోగాల సంఖ్య కూడా పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. వాహన వ్యర్థ పేజీ విధానం రూపకల్పన తుది దశలో ఉందని ఆయన వెల్లడించారు. ఈ విధానాన్ని తీసుకొస్తే వాహన తయారీ ఖర్చులు తగ్గుతాయి. ఎందుకంటే అవసరమైన విడి భాగాలు ఇక్కడే తక్కువ ధరకు లభిస్తాయని ఆయన వివరించారు. దీంతో ఆటో మొబైల్ రంగంలో భారత్ ప్రపంచ హబ్‌గా నిలుస్తుందని, 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవడంలో ఇది తోడ్పుతుందని ఆయన పేర్కొన్నారు.

## వచ్చే ఏడాది దండిగా గూగుల్ జాబ్స్

- ఇండియా, అమెరికా, ఫిలిప్పైన్స్‌లో రిక్రూట్‌మెంట్
- కస్టమర్ కేర్ సేవలు విస్తరణ
- 3,800 మందిని నియమించుకుంటామని ప్రకటన



**న్యూఢిల్లీ:** థర్డ్ పార్టీ సంస్థల ద్వారా కస్టమర్ కేర్ సేవలు అందిస్తున్న గూగుల్ మనసు మార్చుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వినియోగదారులు, యూజర్ల సౌలభ్యం కోసం 2020లో కొత్తగా 3,800 మంది ఉద్యోగులను నియమించుకోవాలని నిర్ణయించింది. మిస్సిసిపీ(యూఎస్, భారత్, ఫిలిప్పైన్స్‌లో కస్టమర్ కేర్ కేంద్రాల విస్తరణ, ఉద్యోగుల నియామకం ఉంటుందని వివరించింది. కంపెనీ నుంచి కస్టమర్, యూజర్ సపోర్ట్ సేవలు అందించడం కోసం కొత్తగా ఉద్యోగులను తీసుకుంటామని 2018లో గూగుల్ ప్రకటించింది. ఈ ప్రకటన ప్రకారం ఉద్యోగులను తీసుకొన్నామని వివరించింది. ఈ ప్రొగ్రామ్‌కు సంబంధించి మాకు గొప్ప ఫీడ్ బ్యాక్ అందింది. 2020 చివరి నాటికి గూగుల్ కస్టమర్ సపోర్ట్ ఉద్యోగులను నియమించుకుంటాం. ఇందులో భాగంగానే గూగుల్ ఆపరేషన్స్ సెంటర్స్(జీవోసీ) ఇప్పటికే పనిచేస్తున్న1000 మంది ఉద్యోగులు ఉంటారని గూగుల్ ఆపరేషన్స్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ ట్రొయ్ డిక్కర్సన్ వెల్లడించారు. 2020లో జీవోసీ ప్రణాళిక ప్రకారం మిస్సిసిపీలో కొత్త సెంటర్, భారత్, ఫిలిప్పైన్లల్లో కొత్త సెంటర్లతోపాటు విస్తరణ కూడా ఉంటుందని ఆయన వివరించారు. ఈ సెంటర్లలో పనిచేసే వారికి పలు ప్రయోజనాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. మూడు వారాల పాటు వేతనంతో కూడా సెలవులు, పిల్లల సంరక్షణ, ఆరోగ్య సమస్యల రిత్యా 22 వారాల వరకూ సెలవులు తీసుకునే అవకాశం ఉంది. ఉద్యోగులకు ఉచితంగా భోజన సదుపాయాలు కల్పిస్తామని ఆయన వివరించారు. కొత్తగా కస్టమర్ కేర్ సపోర్ట్ ఆధారితమైన ఉద్యోగాలను సృష్టించబోతున్నామని వెల్లడించింది. గతంలో అన్సర్ కాలింగ్, ప్రొడక్ట్ ట్రబుల్ షూటింగ్, కంపెయిన్ సెటప్ వంటి కస్టమర్, యూజర్ సపోర్ట్ సేవలను గూగుల్ తరపున థర్డ్ పార్టీ కంపెనీలు నిర్వహించాయని గూగుల్ వివరించింది.

### గూగుల్‌కు ఫ్రాన్స్ జరిమానా



సెర్చింజన్ దిగ్గజం గూగుల్‌కు ఫ్రాన్స్ ప్రభుత్వ విభాగం రూ.1,188 కోట్ల(150 మిలియన్ యూరోలు) భారీ జరిమానా విధించింది. పోటీతత్వంలో విరుద్ధ విధానాలు, గూగుల్ యాడ్స్ పేజీలో అస్పష్టత కారణంగా ఈ భారీ జరిమానా విధిస్తున్నట్టు ప్రకటించింది. అమెరికా టెక్ దిగ్గజాలైన గూగుల్, ఫేస్‌బుక్, యాపిల్, అమెజాన్ వంటి కంపెనీలపై యూరోపియన్ యూనియన్ దేశాలు అధిక స్థాయిలో పర్యవేక్షణ మొదలుపెట్టాయి. ఈ నేపథ్యంలో భారీ జరిమానా ఆసక్తికరంగా మారింది. అమెరికా టెక్ కంపెనీలు పన్నులు తక్కువగా చెల్లిస్తున్నాయని యూరోపియన్ యూనియన్ దేశాలు విమర్శిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా నాలుగేళ్ల క్రితం ఆర్థిక మోసాల విషయంలో గూగుల్‌పై దర్యాప్తు మొదలైంది. ఈ అంశంలో సయోధ్య కుదుర్చుకునేందుకు దాదాపు 1 బిలియన్ యూరోలను ఫ్రాన్స్‌కు చెల్లించేందుకు గత సెప్టెంబర్‌లో గూగుల్ అంగీకరించిన విషయం తెలిసిందే. మరోవైపు ప్రకటనలు పెరిగిన నేపథ్యంలో గూగుల్‌పై ప్రపంచ వ్యాప్తంగా పర్యవేక్షణ ఎక్కువైంది.

## సరికొత్త అంచులను తాకి...

- స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్లు

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా 4వ రోజు లాభాల బాటతో ముగిశాయి. సరికొత్త రికార్డు లకు కొద్ది దూరంలో వారాంతమైన శుక్రవారం ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 7.62 పాయింట్లు లాభ పడి 41,681 పాయింట్ల వద్ద ముగిసింది. ఒకానొక దశలో 41,809 జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 12 పాయింట్ల మేర లాభపడింది. రికార్డ్ స్థాయిలో 12,271 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో అత్యధికంగా 12,239 పాయింట్లను తాకింది. మొత్తంగా ఈ వారంలో సెన్సెక్స్ 671 పాయింట్లు, నిఫ్టీ 185 పాయింట్ల మేర లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లు ఉత్సాహంతో మార్కెట్లు శుక్రవారం ఉదయం జోష్‌లో పయనించాయి. బీఎస్ఈ, సెన్సెక్స్ భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఒక దశలో జీవితకాల గరిష్ఠ స్థాయిని అందుకున్నాయి. స్థూల ఆర్థిక శాస్త్ర గణాంకాల్లో క్షీణత ఉండవచ్చంటూ రేటింగ్ సంస్థలు అంచనా వేయడం ప్రతికూల పరిస్థితులను చూపింది. దీంతో ముగింపు సమయానికి లాభాలు కొంతమేర తగ్గాయి.

మదుపర్లు లాభాలను స్వీకరించడంతో ఈ పరిస్థితి అనివార్యమైంది. ఇదిలావుండగా ఈ వారంలో అత్యధికంగా టాటా స్టీల్ షేర్లు 3.23 శాతం లాభపడ్డాయి. ఆ తర్వాత స్థానాల్లో ఎస్‌బీఐ, ఎస్ బ్యాంక్, హీరో మోటో కార్ప్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ ఉన్నాయి. మరోవైపు వేదాంత అతిపెద్ద నష్టదారుగా నిలిచింది. 3.45 శాతం మేర వేదాంత నష్టపోయింది. ఆ తర్వాతి స్థానాల్లో కోటక్ బ్యాంక్, టాటా మోటార్స్, ఐటీసీ, ఎం అండ్ ఎం, సన్ ఫార్మా ఉన్నాయి.

## మైండ్ స్పేస్‌కు బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ అవార్డులు




హైదరాబాద్: భారత్‌లో కీలకమైన ప్రాంతాలలో గ్రేడ్ ఏ ఆఫీస్ ప్రాంగణాలను నిర్వహిస్తున్న కే రహేజా కార్ప్‌కు చెందిన వాణిజ్య విభాగం మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్‌కు చెందిన 3 పార్కులకు ప్రతిష్టాత్మక బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ నుంచి మూడు ద స్వార్డ్ ఆఫ్ హానర్ అవార్డు అవార్డులు దక్కాయి. మైండ్ స్పేస్ ఎయిరోలీ ఈస్ట్(ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, మైండ్‌స్పేస్ మాదాపూర్(హైదరాబాద్, కామర్‌జోన్ ఎరవాడ (పుణే) బిజినెస్ పార్కులకు ఈ అవార్డులు దక్కాయి. లండన్‌లోని మర్చంట్స్ టేలర్స్ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును సంస్థ అందుకుంది. స్వార్డ్ ఆఫ్ హానర్ అవార్డులు అందుకోవాలంటే ఆరోగ్యం, భద్రత ఆడిట్‌లో ఐదు స్టార్లు(92 శాతం స్కోర్ లేదా అంతకన్నా అధికం) సాధించాల్సి ఉంటుంది.

## చైర్మన్‌గా తప్పుకోనున్న ఆనంద్ మహీంద్రా

- కంపెనీ సమర్థ నిర్వహణ కోసం నిర్ణయం
- మహీంద్రా గ్రూప్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదం
- స్టాక్ ఎక్చేంజీకి వెల్లడించిన కంపెనీ



**న్యూఢిల్లీ:** మహీంద్రా గ్రూప్ చైర్మన్ పదవి నుంచి ఆనంద్ మహీంద్రా తప్పుకోనున్నారు. ఏప్రిల్ 1, 2020 నుంచి నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కంపెనీకి సేవలు అందించనున్నారు. కంపెనీ సమర్థవంతమైన నిర్వహణ కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆనంద్ మహీంద్రా గ్రూప్ శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు స్టాక్ ఎక్చేంజీకి వెల్లడించింది. మార్చి 31, 2020 వరకూ కంపెనీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా కొనసాగుతారని, ఆ తర్వాత చైర్మన్‌గా మరొకరు బాధ్యతలు స్వీకరిస్తారని వివరించింది. కంపెనీ పాలనా, నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీ సిఫార్సుల మేరకు డిసెంబర్ 20, 2019న సమావేశమైన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఈ మేరకు ఆమోదం తెలిపింది. ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నుంచి నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా పదవీ బాధ్యతల మార్పునకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమ్మతి తెలిపింది. ఈ నిర్ణయం ఏప్రిల్ 1, 2020 నుంచి కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఆయన పదవీ బాధ్యతలు మారతాయి. నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నామని నోటిఫికేషన్‌లో కంపెనీ వెల్లడించింది. ఈ విషయంపై ఆనంద్ మహీంద్రా కూడా స్పందించారు. కంపెనీ సమర్థవంతమైన నిర్వహణకు ఆనంద్ మహీంద్రా గ్రూప్ కట్టుబడి ఉంది. దాన్ని ప్రతిబింబించేలా మా నాయకత్వంలో మార్పులు జరిగాయని చెప్పేందుకు సంతోషంగా ఉంది. ఈ మార్పుల కోసం ఏడాది పాటు శ్రద్ధగా కఠినమైన కసరత్తు నిర్వహించిన బోర్డ్, నామినేషన్ కమిటీకి నా ధన్యవాదాలు అని ఆనంద్ మహీంద్రా ట్వీట్ చేశారు.



### చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పవన్ కుమార్ గొయెంకా

ఆనంద్ మహీంద్రా గ్రూప్ కంపెనీకి ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న పవన్ కుమార్ గొయెంకాను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా కొత్త బాధ్యతలు నిర్వర్తిస్తారని కంపెనీ వెల్లడించింది. ఏప్రిల్ 1, 2020 నుంచి ఆయన ఈ మేరకు బాధ్యతలు కొనసాగిస్తారని వెల్లడించింది. పవన్ గొయెంకా పదవీ కాలం నవంబర్ 11, 2020 వరకూ ఉంటుందని, అప్పటి వరకూ ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారని కంపెనీ ప్రకటన వివరించింది. అంతేకాకుండా కంపెనీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం ఆనంద్ గ్రూప్ అధ్యక్షుడిగా( వ్యూహాత్మకం)గా ఉన్న అనీష్ షాను కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1, 2020 నుంచి బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపింది. వీఎస్ పార్థసారథి స్థానంలో ఆయన సేవలు అందిస్తారని వివరించింది. సీపీ గుర్నానీ ఏప్రిల్ 1, 2020 నుంచి అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించింది.

## ట్రేడ్ డీల్‌పై సంతకానికి ఏర్పాట్లు

- ఒప్పందం దిశగా అమెరికా, చైనా అడుగులు
- జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చలు
- పురోగతిపై హర్షం వ్యక్తం చేసిన ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుభవార్త చెప్పారు. అమెరికా, చైనాల మధ్య ప్రాథమిక వాణిజ్య ఒప్పందంపై సంతకానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. వాణిజ్య ఒప్పందంపై చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్‌తో మాట్లాడానని, ఒప్పందంపై పురోగతి ఉందని హర్షం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందంతోపాటు హాంగ్‌కాంగ్, ఉత్తరకొరియా అంశాలపై కూడా చర్చించానని పురోగతి ఉందంటూ ట్విట్టర్‌లో వివరించారు. ఈ అంశాలపై మరిన్ని వివరాలు వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. ఇది చాలా మంచి రోజు. భారీ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్‌తో చర్చించా. వ్యవసాయ సంబంధ, ఇతర ఉత్పత్తులను కొనడం చైనా ఇప్పటికే ప్రారంభించింది. ప్రాథమిక సంతకాలకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్తరకొరియా, హాంగ్‌కాంగ్ అంశాలపై కూడా చర్చించాం అని ఆయన ట్వీట్ చేశారు. ఇదిలావుండగా మొదటి దశ వాణిజ్య ఒప్పందంపై చైనాతో చర్చలు జరిపామని గతవారమే అమెరికా వాణిజ్య విభాగం అధికారులు వెల్లడించారు. వాణిజ్య వివాదాలను పరిష్కరించుకునేందుకు దాదాపు కొన్ని నెలలపాటు జరిగిన చర్చల్లో ఈ మేరకు పురోగతి వచ్చింది. ఒప్పందంలో భాగంగా చైనా వస్తువులపై అమెరికా టారీఫ్‌లను ఎత్తివేస్తుంది. అదేవిధంగా అమెరికా ఉత్పత్తులను చైనా కొనుగోలు చేస్తుందని ప్రకటించినవిషయం తెలిసిందే.



## ఈ ఏడాది జీడీపీ 4.6 శాతమే

- అంచనాలను తగ్గించిన ఫిచ్

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2019- 20 జీడీపీ వృద్ధి రేటు 4.6 శాతానికే పరిమితమవుతుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ పేర్కొంది. ఈ ఏడాది జీడీపీ 5.6 శాతం నమోదవ్వొచ్చని గతంలో అంచనా వేసినప్పటికీ దీనిని తగ్గించింది. గత త్రైమాసికాల్లో గణనీయమైన వృద్ధిరేటు క్షీణతే ఈ ఇందుకు కారణమని వివరించింది. ప్రస్తుత పరిస్థితుల కారణంగా వాణిజ్య రంగం, వినియోగదార్లు విశ్వాసం సన్నగిల్లిందని పేర్కొంది. అయితే నెమ్మదిగా వృద్ధిని అందుకుంటుందని, 2020-21లో 5.6 శాతం, 2021-22లో 6.5 శాతం నమోదవ్వొచ్చని అంచనా వేసింది. ఇదిలావుండగా 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడీస్, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ) అంచనాల కంటే ఫిచ్ అంచనాలు తక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది వృద్ధి రేటు 4.9 శాతం ఉండొచ్చని మూడీస్, 5.1 శాతం నమోదవ్వొచ్చని ఏడీబీ అంచనా వేసిన విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కూడా ఈ ఏడాది వృద్ధిరేటును సవరించింది. తొలుత 6.1 శాతంగా అంచనావేసి దీనిని 5 శాతానికి తగ్గించింది.

# ఏడుగురు దేశద్రోహుల అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఆపరేషన్ డాల్ఫిన్ నోస్ పేరిట ఈ రహస్య ఆపరేషన్‌ను నిర్వహించారు. దేశ ద్రోహానికి పాల్పడుతున్న వీరందరినీ వేర్వేరు ప్రాంతాల్లో అరెస్ట్ చేయడం జరిగింది. వీరితో పాటు ఓ హవాలా బ్రోకర్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దేశ ద్రోహానికి పాల్పడుతున్న ఏడుగురు నేవీ అధికారులు, హవాలా బ్రోకర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయవాడ ఎన్ఐఏ కోర్టులో న్యాయమూర్తి ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. వీరికి న్యాయ స్థానం జనవరి 3వరకు రిమాండ్ విధించింది.

## విశాఖలో నిఘా వర్గాలు భారీ డాల్ఫిన్ నోస్ ఆపరేషన్

విశాఖలో ఆపరేషన్ డాల్ఫిన్ నోస్ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నిఘా వర్గాలు మూడో కంటికి తెలియకుండా భారీ రహస్య ఆపరేషన్ నిర్వహించాయి. చాలా కాలం నుంచి భారత్ సముద్ర రక్షణ రహస్యాలను విశాఖ కేంద్రంగా పాకిస్థాన్ ప్రభుత్వానికి, ఆ దేశ నిఘా వర్గాలకు అత్యంత చాకచక్యంగా చేరవేస్తున్న దేశద్రోహుల సమాచారాన్ని కొంత కాలం క్రితం కేంద్ర నిఘా వర్గాలు సేకరించాయి. ఈ సమాచారాన్ని కేంద్ర నిఘా వర్గాలు అత్యంత గోప్యంగా ఉంచడమే కాకుండా వచ్చిన సమాచారాన్ని నిశితంగా విశ్లేషించి భారత్ సముద్ర రక్షణ శాఖకు సంబంధించిన రహస్యాలను మన దేశంలో ఎవరెవరు చేరవేస్తున్నారో కేంద్ర నిఘా వర్గాలు పసికట్టాయి. ఇండియన్ నేవీకి సంబంధించిన అధికారులే దేశ రహస్యాలను చేరవేస్తున్నట్లు నిఘా వర్గాలు ధృవీకరించుకున్నాయి. విశాఖ కేంద్రంగా శత్రు దేశమైన పాకిస్థాన్‌కు నేవల్ రహస్యాలను చేరవేస్తున్నట్లు నిఘా విభాగం అధికారులు ఇటీవలే నిర్ధారణకు వచ్చారు. ఇందులో ఒక హహవాలా వ్యాపారి మధ్యవర్తిగా ఉన్నట్లు గుర్తించారు. దేశ ద్రోహానికి పాల్పడుతూ నేవల్ రహస్యాలు పాకిస్థాన్‌కు చేరవేస్తున్న నేవల్ అధికారులు దేశంలో పలు చోట్ల పనిచేస్తున్నట్లు ఆధారాలు కనుగొన్నారు. వీరందరినీ ఒకేసారి అరెస్ట్ చేయడానికి కేంద్ర నిఘా వర్గాల అధికారులు వ్యూహం పన్నారు. ఈ రహస్య ఆపరేషన్‌కు ఆపరేషన్ డాల్ఫిన్ నోస్ నామకరణం చేసి రంగంలోకి దిగారు. దేశ ద్రోహులను ఒకేసారి అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుని వారందరినీ శుక్రవారం ఒకేసారి అరెస్ట్ చేయడం జరిగింది. ఈ ఏడాది పాకిస్తాన్ నుంచి శిక్షణ పొంది వచ్చిన ఉగ్రవాధులు భారత్ జవాన్లపై ప్రేలుడు పదార్ధాలతో దాడి చేసి పదుల సంఖ్యలో ఆర్మీ జవాన్లను చంపి వేయడంతో కేంద్ర ప్రభుత్వంకూడా అదే రీతిలో పార్థిస్థాన్ నుంచి వస్తున్న ఉగ్రవాదుల పని పట్టడానికి వాయు రక్షణ దళంతో పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉగ్రవాదుల స్థావరాలపై బాంబులతో ధ్వంసం చేసి ఉగ్రవాదులను మట్టుపెట్టింది. అదే విధంగా ఆర్మీ జవాన్లు జమ్మూకాశ్మీర్‌లో పలు పేరు మోసిన ఉగ్రవాదులను చంపేయడం జరిగింది. అప్పటి నుంచి భారత్‌పై దాడి చేయడానికి పాకిస్తాన్ ప్రభుత్వం అనేక ఎత్తుగడలు వేసుకుని వస్తుంది. ఇందులో భాగంగానే పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ నిఘా అధికారులు ఒకపదకాన్ని రూపొందించి భారత నౌకాదళ స్థావరాలపై దాడులు చేయడానికి పథకం వేశారు. ఈ ఉగ్రపదకంలో భాగంగానే భారత్ నౌకాదళ స్థావరాలు, ఓడరేవులు పై టార్గెట్ పెట్టడం జరిగింది. అక్కడకు ఉగ్రవాదులు పంపి భారీ విధ్వంసాలు చేయడానికి పథకం వేసింది.ముఖ్యంగా విశాఖ నౌకాదళ కేంద్రంపై, ఓడరేవులపై గురి పెట్టినట్లు నిఘా వర్గాల సమాచారం ద్వారా విషయం బయటకు వచ్చింది. ఈ కుట్రలో భాగంగానే భారత నౌకాదళంలో కొంతమంది అధికారులను వేర్వేరు రూపాల్లో ప్రలోభాలు పెట్టి నౌకాదళంకు చెందిన అత్యంత కీలకమైన రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకు ఎరవేసింది. పాకిస్తాన్ భావించినట్లే ఆ దేశపు ఏజెంట్లు మన నేవల్ అధికారులను బుట్టలో వేసుకున్నారు.

అప్పటి నుంచి భారత నౌకాదళానికి సంబదించిన రహస్యాలను దేశ ద్రోహానికి తలపడి దేశంలో వివిధ చోట్ల ఉన్న ఏడుగు భారత్ నేవల్ అధికారులు పాకిస్థా న్‌కు నిరంతరం నౌకాదళ రహస్యాలను, సముద్ర మార్గాలను పాకిస్తాన్ ఏజెంట్ల ద్వారా ఆ దేశానికి చేరవేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు, నేవల్ ఇంటిలిజెన్స్ వర్గాలు సంయుక్తంగా ఆపరేషన్ డాల్ఫిన్ నోస్ ఆపరేషన్ నిర్వహించి ఏడుగురు దేశద్రోహులను అరెస్టు చేశారు. దేశంలో పలు ప్రాంతాల్లో సోదాలు కూడా ఎన్ఐఏ నిర్వహించింది.

అరెస్ట్ అయిన ఈ నేవల్ ఏ ర్యాంకులో పనిచేస్తున్నారు? పాకిస్తాన్‌లో ఎవరికి సమాచారం చేరవేస్తున్నారు? ఎన్నో ఏళ్లుగా ఈ అడ్డగోలు పను లు చేస్తున్నారన్న వివరాలు పై నిఘా అధికారులు ఆరా తీస్తు న్నారు. ఈ స్కాంలో మరికొందరి సూత్రధారులు, పాత్రధారుల కోసం వేట సాగిస్తున్నారు. లోతుగా విచారణ చేస్తు న్నా రు. భారత నౌకాదళంలో దేశద్రోహులు ఉన్నట్లు కొన్నాళ్ల క్రితం కేంద్ర నిఘా అధికారులకు సమాచారం అందిం ది. వారి గుట్టు రట్టు చేసేందుకు స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది.

# ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ హబ్

● అమెరికా తెలుగు సంఘం వ్యాపార సదస్సులో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్



**హైదరాబాద్,ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో ద్వితీయ శ్రేణి నగరా ల్లో ఐటీ హబ్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు. హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహ బూబ్‌నగర్ ప్రాంతాలలో ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీతో ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఐటీ రంగంలో ప్రపంచంలోనే హైదరాబాద్ నగరం ఉత్తమమైనదిగా నిలవడమే కాక, గోల్స్‌ను రీచ్ అవుతుందని ఆయన వెల్లడించారు. సుస్థిరాభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని, రెండవసారి టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక పెట్టుబడులు పెరుగుతోన్నాయని ఆయన చెప్పారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో నెలకొల్పబడుతున్న పరిశ్రమలకు స్థలం లీజును భారీ తగ్గింపు తోనూ, విద్యుత్ ఇతర సౌకర్యాలలో రాయితీ సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఎక్కడిక్కడ పరిశ్రమలు స్థాపించడంతో వలసలు లేకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆయన వెల్లడించారు. అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అమెరికాలోని వివిధ కంపెనీల సీఈవోలు వచ్చి వాళ్ళ అనుభవాలను పంచుకోవడం సంతోషకరమన్నారు శుక్రవారం టీ -హబ్‌లో అమెరికా తెలుగు సంఘం (అటా) వ్యాపార సదస్సు జరిగింది. ఈ సదస్సులో చాలెంజ్ అపర్చునిటీస్ సొల్యూషన్స్ అనే అంశంపై చర్చించారు. ఈసందర్భంగా ఐటీ రంగంలో ప్రతిభ కనబరిచిన వైపాస్ కంపెనీకి ఉత్తమ కంపెనీ అవార్డును ప్రదానం చేశారు. సదస్సులో అటా ప్రెసిడెంట్ పరమేష్ భీంరెడ్డి, ఎలక్ట్ ప్రెసిడెంట్ భవనేష్ బుజాల, వినయ్ తుమ్మలపల్లి, డాక్టర్ వెంకటరెడ్డి, శ్రీకాంత్ బాడుగ సహా అటా బోర్డు ట్రస్టీలు, అటా కమ్యూనిస్టు మెంబర్లు, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు..

## సాటి మనుషులకు సేవ చేయాలి

● నారాయణ ఉత్సవ్‌లో రాజ్‌దీదీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దళితులు, అగ్రవర్ణాలనే బేధం చూపెట్టకుండా అన్నివర్గాల ప్రజలను ఆపదలో ఆదుకోవటమే లక్ష్యంగా జీవించాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత రాజ్‌దీదీ అన్నారు. లక్‌డీకపూల్‌లోని వాసవి కల్యాణమండపంలో నిర్వహించిన నారాయణ ఉత్సవ్ లో ఆమె పాల్గొని ప్రవచనాలు చేశారు. సమయాన్ని సేవాకార్యక్రమాలతోసద్వినియోగంచేసుకుని ఆనందంగా తృప్తిగా జీవించాలన్నారు. ఈకార్యక్రమం లో 2వేల మంది దాకా మహిళలు పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

తెలంగాణ ఇంటి పార్టీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని రైతులకు సకాలంలో రుణాలు మంజూరి చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఇంటి పార్టీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర నేత రామన్న శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త రుణాలు అందక రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పార్టీలో చేరిన గాదెపాక కృష్ణను పార్టీ కార్మిక విభాగం అధ్యక్షునిగా, సంగెంరాములును అధికార ప్రతినిధిగా నియమించారు.

## ఎంసీఈఎంఈ కమాండెంట్‌గా లెఫ్టినెంట్ జనరల్ నారాయణ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్(ఎంసీఈఎంఈ) కమాండెంట్‌గా లెఫ్టినెంట్ జనరల్ టీఎస్ఏ నారాయణన్ బాధ్యతలు తీసుకున్నారు. సికింద్రాబాద్‌లోని ఏవోసీలో ఉన్న ఎంసీఈ ఎంఈలో శుక్రవారం నారాయణన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించా రు. మిలటరీ కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ లో స్పెషలిస్టు అయిన నారాయణన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో బంగారు పతకం సాధించారు. అన్ని కేటగిరీలకు చెందిన ఆర్మీ అధికారులకు టెక్నికల్ ట్రెయినింగ్‌ను ఎంసీఈ ఎంఈలో ఇవ్వనున్నారు.

## దక్షిణ మండల అదనపు సొలిసిటర్ జనరల్‌గా ఇంద్రకరణ్‌రెడ్డి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ హైకోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయ వాదిటి ఇంద్రకరణ్ రెడ్డిని దక్షిణ మండలం(జోన్) అదనపు సోలిసిటర్ జనరల్ గా నియమిస్తూ భారత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా విధులు నిర్వర్తిస్తారని, మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొంటూ అదనపు కార్యదర్శి ఆర్ ఎస్.వర్మ నోటిఫికేషన్ జారీ చేశారు.

# ఆర్టీసీకి ప్రతిష్టాత్మక అవార్డులు

● అందజేసిన గవర్నర్ తమిళిసై

● ఇంధన పొదుపులో పైచేయి సాధించిన టీఎస్ఆర్టీసీ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) మరోసారి ప్రతిష్టాత్మక అవార్డులను కైవసంచేసుకుంది. ఇంధన పొదుపులో బంగారు, వెండి పతకాలను సాధించింది. బ్యూరో ఆఫ్ ఎఫియేషిన్సీ విద్యుత్ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వర య్యభవన్‌లో పురస్కారాల ప్రదానం నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ తమి ళిసై, మంత్రి జగదీశ్‌రెడ్డి అవార్డులను ఆర్టీసీ ఉన్న తాధికారులకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఈడీలు వినోద్‌కుమార్, టీ. రఘునాథ రావు, ఆర్ఎంలు వెంకన్న, డీపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

### సమష్టి కృషితోనే ఈ ఖ్యాతి

మెరుగైన ఇంధన పొదుపు సాధించటం ద్వారా సంస్థకు ఖర్చుతగ్గిందని ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ అన్నారు. గతంలోఉత్పాదకత,రోడ్డు భద్రతవిభాగాల్లో అవార్డులు సాధించారనిఅభినందించారు

## ప్రజారవాణాను మెరుగు పరచాలి

● తెలంగాణ అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** జీహెచ్ఎంసీ పరిధిలో ని పేద, మధ్యతరగతి ప్రజల రవాణా అవసరాలను తీర్చేవిధంగా... ఆర్టీసీని మెరుగుపరచాలని తెలంగాణ అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్(టీయూడీఎఫ్)పట్నం కమిటీ డిమాండ్ చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో అదనపు బస్సు సర్వీసులను నడపాలని కోరింది. ఈ మేరకు నేతలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మినీ బస్సులను అవసరమైన ప్రాంతాలకు నడిపించాలని, బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

## విధుల్లో చేరిన అశ్వత్థామరెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఎట్టకేలకు ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి విధుల్లో చేరారు. కంట్రోలర్‌గా ఎంజీబీఎస్ బస్టాండ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. 6నెలల పాటు సెలవు కావాలని కోరుతూ అశ్వత్థామరెడ్డి పెట్టుకున్న దరఖాస్తును యాజమాన్యం తిరస్కరించింది. దీంతో చేసేది లేక ఆయన ... ఎంజీబీఎస్ బస్టాండ్‌లో కంట్రోలర్‌గా విధుల్లో చేరారు. ఆర్టీసీ కార్మిక జేఏసీ కో.కన్వీనర్లు థామస్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధ, లింగమూర్తి ఇప్పటికే విధుల్లో చేరారు.

## క్రిస్టియన్ ఉద్యోగులకు అడ్వాన్స్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సీఎం కేసీఆర్ కురిపించిన వరాల జల్లుతో ఆర్టీసీలో పండుగ వాతావరణం నెలకొంది. సమ్మె కారణంగా దసరా, దీపావళి పండుగకు దూరమైన ఉద్యోగులు.. క్రిస్మస్ పండుగను ఆనందంగా నిర్వహించుకోనున్నారు. టీఎస్ఆర్టీసీలోని క్రిస్టియన్ ఉద్యోగులకు యాజమాన్యం క్రిస్‌మస్ పండుగ అడ్వాన్స్‌ను ప్రకటించింది. దీంతో క్రిస్టియన్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో జీఎస్టీ నిఘా దాడులు

● నటి లావణ్య త్రిపాఠితో పాటు సాఫ్ట్‌వేర్, చిట్‌ఫండ్, కోల్డ్ స్టోరేజీ సంస్థలపై దాడులు

● జీఎస్టీని ఎగవేసినట్టు సోదాల్లో వెల్లడి ● కేసుల నమోదు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** డైరెక్టర్ జన రల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు హైదరాబాద్‌లోని పలు సంస్థలు, కార్యాల యాలపై శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. మొత్తం 23 బృందాలుగా ఏర్పడి సోదాలు చేసినట్టు తెలుస్తోంది. టాలీ వుడ్ నటి లావణ్య త్రిపాఠి నివాసంపై జీఎస్టీ అధికారులు దాడులకు దిగడంతో సినిమా పరిశ్రమ ఒక్కసారిగా షాక్‌కు గురైంది. తన ఇంట్లో దాడులు జరుగుతున్నాయని తెలుసుకున్న లావణ్య త్రిపాఠి అర్ధాంతరంగా షూటింగ్‌లను రద్దుచేసుకుని ఇంటికి చేరుకుంది. త్రిపాఠి ఇంట్లోనే కాకుండా హైదరాబాద్ నగరంలో పేరొందిన పలు చిట్‌ఫండ్ కంపెనీలు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, నిర్మాణ సంస్థలతో పాటు ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీలు, ఫిట్‌నెస్ సంస్థల కార్యా లయాల్లోనూ ఈ అధికారుల బృందం దాడు లు నిర్వహించినట్టు సమాచారం. రాత్రి పొద్దుపోయేంత వరకు ఈ దాడులు కొనసా గినట్లు చెబుతున్నారు. కోట్ల రూపాయల్లో సర్వీస్ ట్యాక్స్, జీఎస్టీ ఎగవే సిన ట్టుగా ఈసోదాల్లో బయటపడినట్టు సమాచారం. ఒక మీడియా సంస్థతో పాటు ప్రముఖుల నివాసాలపై కూడా జీఎస్టీ నిఘా విభాగం అధికారులు ఆకస్మిక దాడులు జరిపి నట్టు తెలుస్తోంది. కొన్ని సంస్థలపై అక్కడికక్కడే కేసులు నమోదు చేసినట్టు సమాచారం.

## హవాలా గుట్టు రట్టు

● రూ. కోటి స్వాధీనం చేసుకున్న పోలీసులు

● ఆదాయ పన్నుశాఖకు అప్పగింత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హవాలా మార్గంలో డబ్బులు తరలిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను హైదరాబాద్ తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వీరినుంచి రూ.కోటి నగదును స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఈనెల 16న గౌలిగూడలోని బాలాజీ మిఠాయి దుకాణంవద్ద వేచి ఉన్న ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆయన బ్యాగులో రూ.80 లక్షలు బయటపడ్డాయి. ఎలాంటి పత్రాలు సమర్పించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్టు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ చెప్పారు. డైనమిక్ టూల్స్ యజమాని రాజ్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ డబ్బు ముగ్గురు వ్యక్తుల నుంచి తీసుకున్నట్టు ఈశ్వర్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉస్మాన్‌షాహిలోని మూడు ఇళ్ళల్లో సోదాలు నిర్వహించగా అక్కడ దాచి పెట్టిన మరో రూ.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ హవాలా వ్యవహారంపై కేసు నమోదుచేసి ఈశ్వర్‌రెడ్డి, రాజేశ్ కుమార్, రాజేశ్ శర్మ, రాంరాజ్, విశాల్, విశ్వనాథ్‌లను అరెస్టు చేసినట్టు కమిషనర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కోటి రూపాయల నగదును ఆదాయ పన్నుశాఖ అధికారులకు అప్పగించినట్టు ఆయన వివరించారు.

# ముందస్తు మందు రాబడి

● పెరిగిన విక్రయాలతో అమ్మకం పన్నుల జోష్ ● ఖజానాకు అబ్కారీ రాబడులు కీలకం ● భారీ అంచనాల దిశగా మద్యం ఆదాయం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మద్యం అమ్మకాల రాబడి ఖజానాను ఆదుకుంటోంది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి నేటి వరకు రూ. 5176.66 కోట్ల మద్యం విక్రయాలు నమోదవగా, పన్నుల రూపంలో భారీగా రాబడి సర్కార్‌కు చేరుతోంది. తాజాగా పెంచిన మద్యం ధరలతో ఆదనపు ఎక్సైజ్ డ్యూటీ రూపంలో పన్ను ఆదాయం రెండింతలు కానుంది. ఈ ఏడాది ఎక్సైజ్ డ్యూటీల రూపంలో రూ. 12 వేల కోట్లకుపైగా రాబడి సమకూరుతుందని అంచనా. దీనికి అమ్మకపు పన్నుతో కలుపుకుంటే మొత్తం మీద ఆబ్కారీ శాఖ రాబడి రూ. 30 వేల కోట్లకు చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆర్ధిక శాఖ అంచనా వేసుకుంది.1994-95లో రూ. 1105 కోట్లుగా ఉన్న మద్యం విక్రయాలు గరిష్టస్థాయికి చేరాయి. 2003-04 వరకు రూ. 3 వేల కోట్ల లోపుగా ఉన్న విక్రయాలు క్రమంగా పుంజుకున్నాయి. 2009-10లో రూ. 11,771 కోట్లకు చేరి 2018లో రూ. 21 వేల కోట్ల మార్కును అధిగమించాయి. మద్యం దుకాణాలకు దరఖాస్తుల రూపంలో రూ. 934 కోట్లు రాగా, ఈ వార్షిక ఏడాది ఇప్పటివరకు వివిధ రాబడుల రూపంలో రూ. 21,054 కోట్ల రాబడి ఖజానాకు ఆదాయం చేరింది. లైసెన్సు రుసుముల రూపంలో రూ. 1,736 కోట్లు, ఎక్సైజ్ సుంకాలు, వ్యాట్, ఇతర రూపాల్లో ఆదాయం వచ్చి చేరుతోంది.గతేడాది నుంచి రాష్ట్రంలోని బార్లలో అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలకు అబ్కారీ శాఖ అనుమతించింది. దీంతో అర్ధరాత్రి 12 గంటల వరకు యధేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. గతంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు బార్లలో మద్యం అమ్మకాలు జరగ్గా తాజా మినహాయింపు నేపథ్యంలో విక్ర యాల్లో పెరుగుదల నమోదవుతోంది. లిక్కర్‌కు అదనంగా మరో గంటపాటు ఆహారపదా ర్థాలు అమ్ముకు నేందుకు అవకాశం ఉంది. ముంబై, పుణె, నాగపూర్, నాసిక్, ఔరంగాబాద్, చెన్నై, ఒడిశా, హరియానా, ఢిల్లీ రాష్ట్రాల్లో కూడా అర్ధరాత్రి వరకు బార్లకు అనుమతులున్నాయి. ప్రభుత్వం అవలంభించిన పన్ను విధానాలతో ఖజానాకు కాసుల పంట పండుతోంది. ప్రధానం గా ఆబ్కారీ శాఖపై అమ్మకం పన్నును 170 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. ఫలితంగా మొత్తం రాష్ట్ర రాబడుల్లో కీలకంగా ఉన్న అమ్మకం పన్ను(వ్యాట్)లో మద్యంపై వస్తున్న వ్యాట్ ఆదాయం 40 శాతానికి మించుతోంది. 1993-94లో రూ.576 కోట్లుగా ఉన్న మద్యంపై వ్యాట్ ఆదాయం తాజాగా గత ఆర్థిక ఏడాది రూ. 10,421 కోట్లకు ఎగబాకింది. రెవెన్యూ రాబడుల్లో కీలక ఆదాయాల నందించే శాఖల్లో వాణిజ్య పన్నుల శాఖ, ఆబ్కారీ శాఖలే కీలకం. ఇందులో వ్యాట్ ఆదాయంతో పాటు ఎగుమతి, దిగుమతి సుంకాలు, అదనపు ఎక్సైజ్ డ్యూటీలు ఆదాయాన్నిస్తున్నాయి.



2000 ఆర్థిక ఏడాదిలో వ్యాట్ రాబడి రూ.510 కోట్లు, 2006-07లో రూ. 1,205 కోట్లకు చేరి ఆర్థిక వనరుల్లో కీలకంగా ఎదిగింది. 2011-12లో రూ. 2,877 కోట్లు, 2012-13లో రూ. 3,862 కోట్లుగా నమోదైంది. 2012-13లో ప్రభుత్వం మద్యం అమ్మకాలపై ఏకీకృత పన్నును అమలుచేస్తూ మొత్తం పన్నులను ఒకే తాటిపైకి తెస్తూ వ్యాట్‌ను 170 శాతానికి పెంచింది. దీంతో భారీ ఆదాయం సాధ్యమవుతోంది.

## ముగిసిన జార్ఖండ్ పోలింగ్

● ఐదో విడతలో 70.83 శాతం నమోదు ● 23న ఫలితాల వెల్లడి

**రాంచీ:** జార్ఖండ్‌లో ఐదో, తుది విడత పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. సాయంత్రం 5 గంటల వరకు 70.83 శాతం పోలింగ్ నమోదైనట్టు వివరించింది. 40.05 లక్షల మంది కోసం తుది విడత ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. బోరియో, బర్‌హెట్, లితిపార, మహేశ్‌పుర, శికారిపార లో మధ్యాహ్నం 3గంటలకే పోలింగ్ ముగిసింది. జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం కీలక నేత హేమంత్ సోరెన్‌తో పాటు ఇద్దరు రాష్ట్ర మంత్రుల నియోజక వర్గాలకు ఎన్నికలు జరిగాయి. సోరెన్ దుమ్కా, బర్‌హెట్ స్థానాల్లో పోటీ చేయగా.. మంత్రి లూయిస్ మరాండీ (బీజేపీ) దుమ్కా నుంచి బరిలో దిగారు. శరత్ నియోజకవర్గం నుంచి మరో మంత్రి రాన్‌ధీర్ సింగ్ పోటీ చేశారు. 81 నియోజకవర్గాలకు ఐదు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. నవంబర్ 30న ప్రారంభమైన పోలింగ్.. డిసెంబర్ 20తో ముగిసింది. జార్ఖండ్ తీర్పు ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. డిసెంబర్ 23న ఫలితాలు వెల్లడవుతాయి.

# జార్ఖండ్‌లో హంగ్ సర్కార్..!

● ముగిసిన ఐదవ దశ పోలింగ్

● బీజేపీకి వ్యతిరేకంగా ఎగ్జిట్‌పోల్స్

● కాంగ్రెస్ కూటమికే మెజార్టీ స్థానాలు

● కింగ్‌మేకర్ కానున్న జేఎంఎం

**రాంచీ :** జార్ఖండ్‌లో శుక్రవారంతో ఐదు దశల్లో పోలింగ్ ముగిసింది. డిసెంబర్ 23న విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో పలు సంస్థలు ఎగ్జిట్ పోల్ సర్వేను వెల్లడించాయి. సర్వేను బట్టి జార్ఖండ్‌లో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం కష్టమే కనిపిస్తోంది. అన్నీ సర్వేలు కూటమి ప్రభుత్వ ఏర్పాటుకే మొగ్గు చూపాయి. 81 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఐదు దశల్లో పోలింగ్ నిర్వహించారు. రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీలతో కలిపి మొత్తం ఆరు పార్టీలు పోటీ పడ్డాయి. అధికార పార్టీ బీజేపీ ఒంటరిగి బరిలోకి దిగగా... కాంగ్రెస్ స్థానిక పార్టీలైన ఏజేఎస్‌యూ పార్టీ, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతాంత్రిక్)తో పాటు రాష్ట్రీయ జనతా దళ్ పార్టీలు అసెంబ్లీ బరిలో ఉన్నాయి. జేఎంఎం 43 స్థానాల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయగా.. కూటమి పార్టీలైన ఆర్‌జేడీ 31, కాంగ్రెస్ 7 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. అధికార బీజేపీ నుంచి విడిపోయిన ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ చీఫ్ సుదేశ్ మహతో పాటు మాజీ సీఎం, జార్ఖండ్ వికాస్ మోర్చా చీఫ్ బాబులాల్ మరాండీలు కింగ్ మేకర్ అయ్యే అవకాశాలున్నాయి. 81 స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్ 41 నియోజకవర్గాలు ఉంది. ఇక ఓట్ల షేరింగ్‌లో ఇండియా టుడే తెలిపిన వివరాల ప్రకారం.. బీజేపీ (34 శాతం), కాంగ్రెస్, జేఎంఎం (37 శాతం), ఏజేఎస్‌యూ (9 శాతం), జేవీఎం (6 శాతం), ఇతరులు (14 శాతం) వచ్చే అవకాశాలున్నాయి. ఎగ్జిట్ పోల్స్‌ను ఎవరూ విశ్వసించొద్దని బీజేపీ నేతలు చెప్పుకొచ్చారు. కచ్చితంగా మళ్లీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని సీఎం అభ్యర్థి రఘుబర్‌దాస్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చేసిన అభివృద్ధి పనులు, పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. కాంగ్రెస్ నేత ఆర్‌పీఎస్ సింగ్ స్పందిస్తూ.. స్థానిక సమస్యలపై తాము పోరాడామని, కానీ బీజేపీ మాత్రం ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ఆధారపడి ప్రచారం నిర్వహించాయని విమర్శించారు.జార్ఖండ్‌లో 29 శాతం మంది ఓటర్లు హేమంత్ సోరెన్ సీఎం అవ్వాలని కోరుకుంటున్నట్టు ఇండియా టుడే- యాక్సిస్ మై ఇండియా సర్వేలో వెల్లడైంది. ఇక రఘుబర్‌దాస్ 26 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు.

### ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు పరిశీలిస్తే..

ఐఏఎన్ఎస్ - సీ ఓటర్ - ఏబీపీ : బీజేపీ (32), కాంగ్రెస్ కూటమి (35), ఏజేఎస్‌యూ (5), ఇతరులు (9) స్థానాల్లో గెలుపొందే అవకాశాలున్నాయి.

**ఇండియా టుడే- యాక్సిస్ మై ఇండియా** : బీజేపీ (22-32), కాంగ్రెస్ కూటమి (38-50), ఏజేఎస్‌యూ (3-5), ఇతరులు (6-11) స్థానాల్లో విజయం సాధించే ఛాన్స్ ఉంది.

**కశిష్ న్యూస్ :** బీజేపీ (25-30), కాంగ్రెస్ కూటమి (37-49), ఏజేఎస్‌యూ (2-4), ఇతరులు (2-4) గెలిచే అవకాశాలున్నాయి.





## ఏపీ ఇంగ్లీష్ జీవోకు తాత్కాలిక బ్రేక్!




తదుపరి విచారణ జనవరి 27కు వాయిదా

**గుంటూరు, ప్రభన్యూస్ బ్యూరో:** ఏపీ ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంపై జారీ చేసిన జీవో సందిగ్ధంలో పడింది. ఆ జీవోపై నాలు గు వారాల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రభు త్వానికి నోటీసు జారీచేసింది. ఆంగ్ల మాధ్యమంపై ప్రభుత్వం జారీచేసిన 81, 85జీవోలను రద్దు చేయాలని సామాజిక అధ్యయనవేత్త డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై శుక్రవారం హైకోర్టులో విచారణ ప్రారంభమైంది. కేసు తదుపరి విచారణను జనవరి 27వ తేదీకి వాయిదా వేశారు. అయితే జీవో అమలు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించినందున కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టే అవకాశముందని పిటిషనర్ తరపు న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్ళారు. అప్పటి వరకూ జీవో నిలుపుదల చేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. అయితే ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి తన ఆదేశాలలో పేర్కొన్నారు. ఆంగ్ల మాధ్యమంలో పుస్తకాల ముద్రణ వంటివి చర్యలు చేపట్టకూడదని, ఏ చర్య చేపట్టినా అందుకయ్యే వ్యయానికి సంబంధిత ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాల్సివుంటుందని న్యాయమూర్తి వెల్లడించారు. దీంతో ఆంగ్ల మాధ్యమంపై జారీచేసిన జీవో అమలుకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్టే. రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన ఈ బిల్లు శాసనమండలిలో వీగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం భాషాపరమైన మైనార్టీలు(లింగ్విస్టిక్ మైనార్టీలు) హక్కులు కోల్పోతున్నారని, అది రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని పిటిషనర్ డాక్టర్ గుంటుపల్లి తన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో పేర్కొన్నారు.

# 4 రీజియన్లు.. 3 రాజధానులు

**ఏపీ రాజధానికి నిపుణుల కమిటీ ఇచ్చిన కొత్త రూపమిదే**

(మొదటిపేజీ తరువాయి)

కలిసి సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో జి.ఎన్. రావు మాట్లాడారు. ప్రాంతీయ అసమానతలు రూపుమాపేలా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని సూచనలు, సలహాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించినట్టు ఆయన తెలిపారు. అభివృద్ధి ఒకే చోట కేంద్రీకృతం కావటం వల్ల రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య అనేక సమస్యలు ఏర్పడుతున్నట్టు, అసమానతలు పెరుగుతున్నట్టు తమ అధ్యయనంలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో తాము అందించిన నివేదికలో ప్రభుత్వానికి కొన్ని కీలక సూచనలు చేసినట్టు తెలిపారు. విశాఖపట్టణంలో సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు హైకోర్టు బెంచిను ఏర్పాటు చేయాలని సూచించినట్టు వెల్లడించారు. శ్రీభాగ్ ఒడంబడికను అనుసరించి కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలనీ, అసెంబ్లీతో పాటు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం, రాజ్‌భవన్‌ను అమరావతిలోనే కొనసాగించాలని సూచించినట్టు వెల్లడించారు. అమరావతిలో హైకోర్టు బెంచితో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలను కొనసాగించాల్సిందిగా సూచించినట్టు వెల్లడించారు. పర్యావరణ, వరద ముంపును దృష్టిలో ఉంచుకుని అమరావతిలో పరిపాలనా భవనాలను కరకట్టకు సమీపంలో కాకుండా మంగళగిరి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని సూచించినట్టు తెలిపారు. రాష్ట్రాన్ని ఉత్తరాంధ్ర, ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలనీ, అపుడే అసమాన అభివృద్ధి, ప్రాంతీయ అసమానతలకు అవకాశం లేకుండా ఉంటుందని సూచించినట్టు వెల్లడించారు. రాష్ట్రంలో 10,600 కిలోమీటర్ల మేర పర్యటించాం. వివిధ ప్రాంతాల్లో ప్రజలనూ, ప్రజాప్రతినిధులను కలిశాం. వారి మనోభావాలను, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేశాం. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు ఎక్కువగా ఉన్నట్టు స్పష్టంగా కనబడింది.. కొన్ని ప్రాంతాలు అబివృద్ధిలో దూసుకుపోతుంటే మరికొన్ని ప్రాంతాలు బాగా వెనకబడి ఉన్నాయి. ఈ పరిస్థితులు రూపుమాపాలంటే వికేంద్రీకరణ విధానాన్ని అనుసరించటం అనివార్యమని ప్రభుత్వానికి సూచించామని వెల్లడించారు.

**కమిటీ సూచించిన ఇతర అంశాలు**

వేసవికాలంలో నిర్వహించే అసెంబ్లీ సమావేశాలను విశాఖలోనే నిర్వహించాలి. అమరావతిలో కేవలం అసెంబ్లీనే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను కొనసాగించాలి. పర్యావరణ, వరద ముంపుపై ప్రభుత్వం అప్రమత్తగా వ్యవహరించాలి. అమరావతిలో నిర్మాణ దశలో ఉన్న భవనాలన్నిటినీ పూర్తి చేయాలి. రీజియన్లుగా జిల్లాలను విభజించి అక్కడి వనరుల ను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేపట్టాల్సిందిగా సూచించినట్టు జీ.ఎన్.రావు తెలిపారు. రీజయన్‌కమిషన రేట్లను ఏర్పాటు చేయటం ద్వారా ఆ ప్రాంతాల నిరంతర అభి వృద్ధిపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టికేంద్రీకరించాలి.



# అంతా అనుకున్నట్లే!

**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** అమరావతి రాజ ధాని వ్యవహారంలో అంతా అనుకున్నట్లే జరిగింది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పిందే ఆయన నియమించిన నిపుణుల కమిటీ కూడా తేల్చింది. ఏపీ రాజ ధానిగా గత ప్రభుత్వం ఎంపిక చేసిన అమరావతి అన్ని రకాలుగా అనుకూలం కాదని జీఎన్ రావు కమిటీ తేల్చి చెప్పింది. ఈమేరకు శుక్రవారం సాయంత్రం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆయనకు తమ నివేదికను అందజేశారు. అనంతరం సచివాలయంలో మీడియాకు నివేదిక వివరాలను వెల్లడించింది. ఈ సందర్భంగా రిటైర్డ్ సీనియర్ ఐఏఎస్ అధికారి, కమిటీ కన్వీనర్ జీఎన్‌రావు మాట్లాడుతూ, సెప్టెంబరు 13వ తేదీ సీఎం జగన్ కమిటీని ఏర్పాటుచేశారని, రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సుమారు 10,600 కీమీ పర్యటించి అన్ని ప్రాంతాల ప్రజల అభిప్రాయాలను, ఆయా ప్రాంతాల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేశామన్నారు. అందులో భాగంగా రాజధాని పరిధిలోని పలు గ్రామాల రైతులతో కూడా ప్రత్యక్షంగా సమావేశమై వారి అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన నివేదికను సీఎంకు అందజేశామన్నారు. విభజన గాయంతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి సంబంధించి అభివృద్ధి అమరావతికే పరిమితమైతే భవిష్యత్తులో అనర్థాలు ఎదురయ్యే అవకాశం ఉందని, అభివృద్ధి ఫలాలు 13 జిల్లాలకు సరిసమానంగా అందేలా చూడాలని తమ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నామన్నారు. అందులో భాగంగానే రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి పాలనాపరమైన నిర్ణయాలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో వీలైనంత తక్కువ సమయంలో ఆయా జిల్లాలను అన్ని రంగాల్లో అభివృద్ధిచేసే అవకాశం లభిస్తుందన్నారు.

**విశాఖలో సచివాలయం.. కర్నూలులో హైకోర్టు**

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఒకే ప్రాంతానికి పరిమితం కాకూడదన్న ఆలోచనతో కీలకమైన విభాగాలను మూడు ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని నివేదించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే విశాఖపట్టణంలో సచివాలయం, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, హైకోర్టు బెంచిను ఏర్పాటు చేయాలని సూచించిండం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ పరిధిలోని కర్నూలులో హైకోర్టు, ప్రస్తుత ఏపీ రాజధానిగా ఉన్న అమరావతిలో అసెంబ్లీ, గవర్నర్ కార్యాలయం, రాజ్‌భవన్, హైకోర్టు బెంచితోపాటు సీఎం క్యాంపు కార్యాలయం, మంత్రుల పేషీలను ఏర్పాటు చేయాలని కమిటీ నివేదికలో పేర్కొనడం జరిగిందని తెలిపామన్నారు. అలాగే ప్రాంతీయ అసమానతలు రూపుమాపేలా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని సూచనలు కూడా ఇచ్చామన్నారు. అభివృద్ధి ఒకేచోట కేంద్రీకృతం కావడం వల్ల రాష్ట్రలో వివిధ ప్రాంతాల మధ్య అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశముందన్నారు. ఇదే విషయాన్ని తమ అధ్యయనంలో కూడా గుర్తించామన్నారు. అందుకోసమే రాష్ట్రంలోని 13 జిల్లాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమస్యలు ఎదురుకాకుండా ఉండేలా సముచిత నిర్ణయంగా ఈ సూచన చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వానికి కూడ కొన్ని కీలకమైన సూచనలు కూడా ఇచ్చామన్నారు. శ్రీభాగ్ ఒప్పందం ప్రకారమే కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు చేయాలని సూచించామని జీన్ రావు తెలిపారు. తాము రాయలసీమ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఆ ప్రాంత ప్రజల నుండి అనేక వాస్తవ విషయాలు తెలుసుకున్నామన్నారు. ఫలితంగానే హైకోర్టు వంటి అత్యున్నత న్యాయస్థానాన్ని ఆప్రాంతంలో ఏర్పాటు చేయడం ద్వారా రాయలసీమ మొత్తం అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. అలాగే ప్రస్తుతం అమరావతిలో హైకోర్టు బెంచితోపటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలను కొనసాగించాల్సిందిగా ప్రభుత్వానికి సూచించామన్నారు. పర్యావరణ, వరద ముంపు వంటి ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో ఉంచుకుని అమరావతిలో పరిపాలనా భవనాలను కరకట్ట సమీపంలో కాకుండా మంగళగిరి ప్రాంతంలోని నాగార్జున వర్సిటీ పరిధిలో ఏర్పాటు చేయాలని సూచించడం జరిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రాన్ని ఉత్తరాంధ్ర, ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ రీజియన్లుగా అభివృద్ధి చేయాలని చెప్పామన్నారు.

**రెండు ప్రాంతాల్లో అసెంబ్లీ సమావేశాలు**

ప్రస్తుతం వెలగపూడిలోని అసెంబ్లీ భవనంలో కొనసాగుతున్న సమావేశాలను ఇకమీదట విశాఖ, కర్నూల్లో నిర్వహించాలని సూచించామన్నారు. శీతాకాల సమావేశాలు కర్నూల్లోనూ, వేసవికాల సమావేశాలు విశాఖలోనూ, వర్షాకాల సమావేశాలను అమరావతిలోనూ నిర్వహించడం ద్వారా పై రెండు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి, మంత్రులు కొంత కాలం పాటు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు వెసులుబాటు కలుగుతుందని, తద్వారా ఆయా ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని వివరించారు.

**మూడు ప్రాంతాల్లో నాలుగు జోన్లు**

రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను నాలుగు జోన్లుగా విభజించి పరిపాలనను కొనసాగించేందుకు తాము సిఫార్సు చేశామన్నారు. వీటిలో ఉత్తరాంధ్ర జోన్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలు, ఉత్తర కోస్తా జోన్‌లో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలు, మధ్య కోస్తా జిల్లాల్లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, రాయలసీమ జోన్‌లో చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు ఉండేలా జోన్లను విభజన చేయాలని సూచించామన్నారు.

# అక్కడి మార్పులకు ఇక్కడ రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు ఇంటిస్థలం, ప్లాట్లను కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉండగా తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ధరలు మరింతగా పెరగవచ్చని స్థిరాస్తి వ్యాపారులు భావిస్తున్నారు. ఏపీలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో స్థిరాస్తి వ్యాపారం పడిపోయింది. రాజధాని విషయంలో పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వస్తుండడంతో ఈ వ్యాపారంలో స్థిరపడిన వారు నెమ్మదిగా హైదరాబాద్‌కు చేరుకుని ఇక్కడే పెట్టుబడులు పెట్టేందుకు మక్కువ చూపారు. 3 నెలల్లో పదుల సంఖ్యలో స్థిరాస్తి వ్యాపారులు హైదరాబాద్ చేరుకుని శివార్లలోని చందానగర్, శేర్లింగంపల్లి, పటాన్‌చెరు, చేవెళ్ళ, వికారాబాద్, మణికొండ, మొయినాబాద్, ఘట్‌కేసర్, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి అమ్మకాలను ప్రారంభించినట్టు చెబుతున్నారు. హెచ్ఎండీఏ ఇటీవల ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో వేలంవేసిన ప్లాట్లలో ఎక్కువ శాతం విజయవాడ, తిరుపతి, విశాఖకు చెందిన స్థిరాస్తి వ్యాపారులు టెండర్లు దాఖలు చేసి వాటిని సొంతం చేసుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు ఒక్కో చదరపు అడుగు ధర రూ.4,500 నుంచి రూ.5,500లకు పలకగా అమరావతిలో తాజాగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని గత నాలుగైదు రోజులుగా ఒక్కో చదరపు అడుగును రూ.500 పెంచి విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. అమరావతి ప్రాంతంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినా కొనుగోలు చేసేవారు లేక మధ్యలోనే వారిని వదిలేసి వచ్చామని మరింత పెట్టుబడి పెట్టి నిర్మాణాలను పూర్తిచేసినా అక్కడ కొనుగోలు చేసేవారు లేరని ఓ స్థిరాస్తి వ్యాపారి ఆవేదన వెలుబుచ్చుతూ చెప్పారు. తెదేపా అధికారంలో ఉండగా హైదరాబాద్‌కు చెందిన ఎంతో మంది పేరొందిన స్థిరాస్తి వ్యాపారులు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోట్ల రూపాయలు వెచ్చించి భూములను కొనుగోలు చేశారు.

**జగన్ ప్రకటనతో నిరాశచెందిన వ్యాపారులు**

పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ రాజధాని అమరావతిలోనే ఉంటుందన్న విషయాన్ని స్పష్టంచేశారని ఈ ప్రకటన వెలువడిన మూడు రోజుల్లోనే సీఎం జగన్ అసెంబ్లీ వేదికగా రాజధానిపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారని ఆ వ్యాపారి తెలిపారు. అసెంబ్లీ, శాసనమండలితో పాటు సీఎం, గవర్నర్ కార్యాలయం అమరావతిలో ఉంటుందని సచివాలయం విశాఖలో, హైకోర్టు కర్నూలులో ఏర్పాటు చేస్తున్నట్టు జగన్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే అమరావతిలో స్థిరాస్తి వ్యాపారానికి భవిష్యత్తు లేదన్న విషయం అర్థమైందని చెప్పారు. తాజాగా జీఎన్‌రావు చేసిన ప్రకటనతో రాజధాని విషయంలో మరింత స్పష్టత వచ్చిందని ఇక అమరావతిలో తమ వ్యాపారానికి భవిష్యత్తు లేదని తెలిసి తాము తమ మకాన్ని హైదరాబాద్‌కు మార్చామని ఆ వ్యాపారి వెల్లడించారు. అమరావతి, విశాఖపట్నం, కర్నూలు రాజధానుల విషయంలో ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో స్థిరాస్తి వ్యాపారులకు తమ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని చెబుతున్నారు. ఏపీలో మద్యం దుకాణాల నిర్వాహణ బాధ్యతను ప్రభుత్వమే చేపట్టడంతో ఇదివరకు ఈ వ్యాపారాన్ని చేపట్టిన వారు తెలంగాణకు వచ్చి కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలను దక్కించుకున్నారని మరికొంత మంది స్థిరాస్తి వ్యాపారాన్ని ఎంచుకుని అందులో తమ పెట్టుబడులు పెట్టారని అంటున్నారు. పదేళ్ళ క్రితంతో పోలిస్తే హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు అప్పట్లో రూ.10 లక్షలు ఉన్న ఎకరం భూమి ఇవాళ రూ.కోటి నుంచి కోటిన్నరకు చేరిందని అలాగే పదేళ్ళ క్రితం రూ.5వేలున్న గజం ప్లాటు ధర ప్రస్తుతం రూ.50వేల నుంచి రూ.70వేలకు చేరిందని భవిష్యత్తులో ప్లాటుతో పాటు అపార్ట్‌మెంట్‌లో ప్లాటును కొనుగోలుచేసే పరిస్థితి ఉండదని వినియోగదారులు చెబుతున్నారు.

**హైదరాబాద్‌లో మూడు రోజుల**

# ఆర్‌ఎస్‌ఎస్ శిబిరం

**హాజరుకానున్న చీఫ్ మోహన్ భగవత్**

**25న సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగసభ**

**విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దేశంలో తన కార్యకలాపాలను విస్తరించుకునే పనిని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ దేశవ్యాప్తంగా పర్యటనలను ముమ్మరం చేశారు. తన పర్యటనలలో ప్రధానంగా క్షేత్రస్థాయి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాలలో పని చేస్తున్న వారితో మమేకమవుతున్నారు. ఇందు లో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ మధుకర్ భగవత్ (మోహన్ భగవత్) 24, 25, 26 తేదీల్లో తెలంగాణలో పర్యటించనున్నారు. తర్వాత 27 వ తేదీ బెంగళూరులో పర్యటించి తిరిగి తెలంగాణకు రానున్నారు. 28, 29 తేదీల్లో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థగా ఉంటూ విద్యారంగంలో తనదైన శైలిలో సేవలందిస్తున్న విద్యాభారతి అనుబంధ విభాగం సరస్వతీ విద్యా పీఠంకు చెందిన పలువురితో భేటీ అవుతున్నారు. 24, 25, 26 తేదీలలో హైదరాబాద్‌లోని సాగర్ రింగ్ రోడ్‌లో ఉన్న భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప శిబిరంలో పాల్గొంటున్నారు. ఈ శిబిరంలో ఆర్‌ఎస్‌ఎస్ విస్తరణకు కీలకమైన సంఘ్ శాఖకు ముఖ్య శిక్షక్‌గా పని చేసే వారు... ఆపై వారు పాల్గొంటున్నారు. దాదాపు 13, 450 పాల్గొనే మూడు రోజుల శిబిరంలో మోహన్ భగవత్ పలు రంగాలలో ఆర్ఎస్ ఎస్ చేస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణను వివరించనున్నారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ స్టేడియంలో 25న జరిగే భారీ బహిరంగసభలో మోహన్‌భగవత్ ప్రసంగించనున్నారు. సర్ సంఘ్ చాలక్ (ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్) పాల్గొనే మూడు రోజుల శిబిరం, బహిరంగసభలను పూర్తిగా విజయవంతం చేయడంతో పాటు భవిష్యత్ ప్రణాళికలను ఆచర ణలో పెట్టేందుకు వీలుగా తెలంగాణ ఆర్‌ఎస్‌ఎస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



**29 న శారదా ధామంలో సభ**

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తన పర్యటనలో 29న రాజేంద్రనగర్ మండలంలోని బండ్లగూడలోని శ్రీ సరస్వతీ విద్యా పీఠంలో జరిగే సభలోనూ ప్రసంగించనున్నారు. ఈ సమావేశంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యులతో ఈ సమావేశం జరుగనుంది. శ్రీ సరస్వతీ విద్యా పీఠం ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రా లలో దాదాపు 400 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు, ఆచార్యులు సుమారు 10 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. సభలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ముందుగా తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే ప్రక్రియను కూడా ప్రారంభించారు.

విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సామాజిక సమరసత ఆధ్వర్యంలో 22, 23 తేదీలలో శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రంలో లక్ష కలశాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్షరకోటి శివ పంచాక్షరీ సహిత లక్షకలశాభిషేకంలో ప్రతి రోజు 3500 మంది జంటలు, ఒక్కరైనా అభిషేకం చేసేందుకు వీలు కల్పించారు. ఈ 2 రోజులు చండీ యాగం, అతి రుద్ర పారాయణం నిర్వహిస్తారు.

# హైదరాబాద్ తరువాత 2వ నగరంగా కరీంనగర్

**కరీంనగర్ అంటే సీఎంకు ప్రత్యేక అభిమానం**

**70 ఏళ్లలో జరగని అభివృద్ధి జరిగింది**

**30న ఐటీ టవర్ ప్రారంభం**



ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్ అభవృద్ధిపై ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ముఖమంత్రి సహకారంతో కరీంనగర్‌లో అభవృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత కరీంనగర్‌ను రెండో స్థానంలో నిలుపుతాం. ఈనెల 30న ఐటీ టవర్ ను ప్రారంభిస్తున్నాం, పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. వచ్చే జూన్ కల్లా కేబుల్ బ్రిడ్జీ పూర్తి చేస్తాం. కాళేశ్వరం జలాలతో 6 గ్రామాలకు నీరు అందించాం. ధాన్యం కొనుగోలు కొనసాగుతుంది, గురువారం నాటికి 3076540 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోల చేశాం.

– బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్

**ప్రశ్న: కరీంనగర్ నగరంకు ఎన్ని నిధులు తీసుకువచ్చారు?**

**మంత్రి:** గడిచిన 70 ఏళ్ళలో కరీంనగర్‌లో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. టిఆర్ఎస్ పాలనలో కరీంనగర్ అభివృద్ధి రాష్ట్రంలోనే గొప్పగా చెప్పుకునే స్థాయికి వెళ్లింది. సీఎం కేసీఆర్ కరీంనగర్ అభివృద్ధికి రూ. 350 కోట్లు ఇచ్చారు. వీటిలో రూ. 100 నుంచి 120 కోట్ల పనులు జరుగున్నాయి. మిగిలిన 200 కోట్ల నిధులతో నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం. నగరంలోని 14.5 కిలోమీటర్ల ప్రధాన రోడ్ల కోసం రూ. 106 కోట్లు కేటాయించడం జరిగింది ఇట్టి నిధులతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు 80 శాతం పూర్తయినాయి.

**ప్రశ్న: కరీంనగర్ అభివృద్దిలో నంబర్ వన్‌లో ఉంచుతారా?**

**మంత్రి:** తెలంగాణలో హైదరాబాద్ తరువాత కరీంనగర్‌ను అభివృద్ధిలో రెండవ స్థానంలో నిలపడమే లక్ష్యంగా ముందుకు వెలుతున్నాం, ఉద్యమానికి అండగ నిలిచిన కరీంనగర్ జిల్లా అంటే సీఎం కేసీఆర్‌కు వల్లమాలిన ప్రేమ. 2014లో సీఎంగా ప్రమాణ స్వీకారణ చేసిన అరువాత మొదటి పర్యటన కరీంనగర్‌లోనే సాగింది. ఈ సంధ్బంగా ప్రకటించిన హామీలన్ని వరుసగా నెరవేరుస్తూ నిధులు కేటాయిస్తున్నారు. తనపై ఉన్న నమ్మకం కరీంనగర్ జిల్లాపై ఉన్న ప్రేమతో కేసీఆర్ తనకు మంత్రి పదవి ఇవ్వడంతో పాటు నాలుగు శాఖలు కేటాయించడం అదృష్టం.184 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి మే, జూన్ నాటికి బ్రిడ్జి పూర్తి చేస్తాం.

**ప్రశ్న: మానేరు రివర్ ఫ్రంట్ పనులు ఆలస్యమవుతున్నాయి, కేసీఆర్ ఐలాండి ఎప్పుడు మొదలు పెడుతారు?**

**మంత్రి:** లోయర్ మానేరుడ్యాంలో 22 కోట్ల రూపాయలతో కేసీఆర్ ఐలాండ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇది పూర్తయితే కరీంనగర్ తెలంగాణలోనే ఒక మంచి పర్యాటక కేంద్రంగా మానేరుడ్యాం మారుతుంది. ఐలాండ్‌లో చిల్డ్రన్స్ పార్క్, కాటేజీలు నిర్మిస్తాం, త్వరలో పనులు ప్రారంభమవుతాయి. టూరిజం అభివృద్ధిలో భాగంగా జెట్‌స్కీలు, స్పీడ్ బోట్లు తెప్పించాం. ఇప్పటికే 3కోట్ల రూపాయలతో జెట్‌స్కీ ఏర్పాటు చేశాం. లోయర్ మానేరు డ్యాం డౌన్ స్ట్రీంలో 506 కోట్ల రూపాయలతో మానేరు రివర్ ఫ్రంట్ పనులను చేపడుతాం, దీనిపై టాటా కన్సల్‌టెన్సి అధ్యాయనం చేసింది, సింగపూర్ తరహాలోఈ ప్రాజెక్టు పనులు చేపడుతాం.

**ప్రశ్న: స్మార్ట్‌సిటీ పనులు ఎందుకు ఆలస్యమైనాయి?**

**మంత్రి:** స్మార్ట్ సిటిలో భాగంగా కరీంనగర్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దుతాం. కొందరు కోర్టుకు వెళ్లిన కారణంగా కొద్ది రోజులు ఆగి పోయాయి. పనులను ప్రస్తుతం వేగవంతంగా నిర్వహిస్తున్నాము. మొదటి విడత స్మార్ట్ సిటి పనులు రూ. 220 కోట్లతో మూడు ప్యాకేజీలుగా 7 రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాము. నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి అదునాథన స్వీపింగ్ మిషన్లు తెప్పించామని అన్నారు. తెలంగాణలోనే హైదరాబాద్ తరువాత రెండో సుందర నగరంగా కరీంనగర్‌ను తీర్చిదద్దడమే తన ధ్యేయం.

**ప్రశ్న: ధాన్యం కొనుగోలు ఏ విధంగా సాగుతుంది?**

**మంత్రి :** గురువారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 3076540 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాము. కొనుగోళ్లలో ఇబ్బందులను అధిగమించి రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని నిర్ణయించాం. అకాల వర్షానికి తడిసిన ధాన్యం కూడ కొనుగోలు చేస్తున్నాం, ధాన్నం సేకరణలో తెలంగాణ, తెలంగణలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నంబర్‌వన్‌గా నిలువనుంది.

**ప్రశ్న: ఐటీ టవర్ తో ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి, ఎప్పుడు ప్రారంభిస్తారు?**

**మంత్రి:** కరీంనగర్ ఐటీ టవర్ నిర్మాణం పూర్తి కావచ్చింది, ఈనెల 30న రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారు. 11 కంపెనీలతో చర్చించాం, 10 కంపెనీలు ముందుకు వచ్చాయి, ప్రారంభం రోజునుంచే సేవలు ప్రారంభమవుతాయి. మొదటి విడతలో మూడువేల మందికి ఉద్యోగవకాశాలు లభిస్తాయి. ప్లగ్ అండ్ పే విధానంతో నిర్మించాం, భవిష్యత్తులో మరో టవర్ నిర్మించి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న: కాళేశ్వరం జలాలు కరీంనగర్‌కు ఉపయోగపడుతున్నాయా?**

**మంత్రి:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కావడంతోనే నాగుల మల్యాల చెరువులోకి నీరువచ్చింది. వరదకాలువ లేకముందు గర్షకుర్తి, విలాసగార్ నుంచి వరదనీరు వచ్చి ఆచంపల్లి, నాగుల మల్యాల, బద్దిపల్లి, కమాన్‌పూర్, కొండాపూర్, బావుపేట, ఎలగందుల గ్రామాల చెరువుల నీటితో కళకళలాడేవి. వరదకాలువ నిర్మాణం తరువాత వర్షపునీరు వచ్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయపోవడం మూలంగా చెరువులు వట్టిపోయి ఈ ప్రాంతాల్లో కరువు ఏర్పడింది. గంగాధర మండలం ఆచంపల్లి వద్ద వరదకాలువకు రెండు తూములు ఏర్పాటు చేసి గాయత్రీ పంపుహౌస్ నుంచి 150 క్యూసెక్కుల నీటిని చెరువులోకి తరలిస్తున్నాం, కొత్తచెరువు మత్తడి దూకడంవల్ల గొలుసుకట్టుద్వారా ఆరు గ్రామాలచెరువులు నిండాయి. కాళేశ్వరం జలాలు రాకుంటే నీరే అందేదికాదు, ఈ రబీకి కాళేశ్వరం జలాల ద్వారా సాగు విస్తీర్ణం పెరగనుంది.

**– ప్రభన్యూస్ బ్యూరో, కరీంనగర్**

## వేగంగా రోడ్ల విస్తరణ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రోడ్ల విస్తరణ పనులు వేంగంగా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం టీఎస్ రెడ్కో కార్యాలయంలో మంత్రి సూర్యాపేట పబ్లిక్ హెల్త్ అధికారులతో రోడ్ల విస్తరణ పనులు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణంలో మట్టికి బదులు కొంత ఎక్కువ ఖర్చుయినప్పటికీ కంకర పొడినే వినియోగించాలని సూచించారు. సూర్యాపేటలో జరుగుతున్న రోడ్ల విస్తరణతోపాటు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ , పబ్లిక్‌హెల్త్ ఇఎన్‌సి శ్రీధర్ ఎస్ ఇ దేవానంద్ , ఇఇ వెంకటేశ్వర్లు , కమీషనర్ రామాంజుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి బాధ్యత ఎంపీవోలదే



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి బాధ్యత మండల పంచాయతీ అధికారుల(ఎంపివో)పైనే ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం మంత్రి గ్రూప్-2 ద్వారా ఎంపికైన63 మంది ఎంపివోల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవచేసే అవకాశం కొందరికే వస్తుందన్నారు. ఎంపీవోలుగా ఎంపికైన వారంతా చాల అదృష్టవంతులన్నారు. మంచి పనితీరుతో తల్లితండ్రులకు , గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అధికారులకు సామాజికసేవ స్పృహ ఉంటే అభివృద్ధి బాగా జరుగుతుందన్నారు. వృత్తిలో చేసే మంచిపనుల ద్వారానే గౌరవం పెరుగుతుందన్నారు. విధినిర్వహణలో చెడును సహించవద్దన్నారు. అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు, నర్సరీలు, డంపింగ్ యార్డులు నిర్మించాలన్నారు. కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధికోసం పట్టుదలతో పనిచేస్తున్నారని తెలిపారు.

## విజయ బ్రాండ్ మనదే

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దాదాపు 3 దశాబ్దాల చరిత్ర కలిగిన రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ విజయ బ్రాండ్ తెలంగాణకే దక్కింది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఏర్పాటైన తెలంగాణ కొత్త రాష్ట్రానికే ఈ బ్రాండ్ చెందుతుందని శుక్రవారం కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. విజయ బ్రాండ్‌తో ప్రసిద్ధిగాంచిన పాలు, పాల ఉత్పత్తులు ఇకనుంచి తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలోనే క్రయ, విక్రయాలు జరగనున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పటి వరకు ఉపయోగించుకునే ఈ బ్రాండ్‌ను మార్చుకోవాల్సి ఉం టుంది. తెలంగాణ రాష్ట్రపాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ విజయ బ్రాండ్, లోగో తమ రాష్ట్రానికే చెందాలని భారత ప్రభుత్వరంగ సంస్థ ట్రేడ్ మార్క్ అథారిటీని సంప్రదించగా.. తెలంగాణకే కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

## యాసంగికి ఎరువులు సిద్ధం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** యాసంగి సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో ఎరువుల కొరత ఏమాత్రం తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని కోణాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. సాధారణ స్థాయికి మించి వర్షపాతం నమోదైనందున పంటల విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ సీజన్‌లో 31.95 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

ఇందుకు అవసరమైన ఎరువులను సంసిద్ధం చేస్తోంది. సకాలంలో ఎరువుల నిల్వాలు విడుదల చేయాల్సిందిగా ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. 2019-20 యాసంగి సీజన్‌కు 15.40 లక్షల మెట్రి క్ టన్నుల ఎరువులను కేటాయించినట్లు వ్యవసాయశాఖ చెబుతోంది.




## పాక్ హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం

**ఏడుగురికి పత్రాలందజేసిన కేంద్ర మంత్రి మాండవీయ కచ్‌లోని మోర్బి శిబిరంలో సంబరాలు**

**కచ్ (గుజరాత్):** పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఒక వైపు ఆందోళనలు కొనసాగుతున్నాయి. పోలీసులపై నిరసనకారులు రాళ్లు రువ్వుతూ ప్రజా రవాణాను స్తంభింపజేస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతోంది. పౌర హక్కుల నేతలను జైల్లో వేశారు. విద్యార్థులు, ప్రతిపక్ష నేతలు రోడ్లపైకొచ్చి రచ్చ రచ్చ చేస్తున్నారు. కానీ మోడీ ప్రభుత్వం మాత్రం తన పని తాను చూసుకుంటూ పోతోంది. సీఏఏను కచ్చితంగా అమలు చేసి తీరుతామన్న అమిత్‌షా ప్రకటన కూడా శుక్రవారం గుజరాత్‌లో కార్యరూపం దాల్చింది. పాకిస్తాన్ నుంచి వచ్చిన ఏడుగురు హిందు శరణార్థులకు కచ్‌లో కేంద్ర మంత్రి ఎంఎల్ మాండవీయ భారత పౌరసత్వ సర్టిఫికెట్లను అందజేశారు. గుజరాత్‌లోని కచ్ జిల్లా మోర్బిలో ఆశ్రయం పొందిన పాకిస్తాన్ హిందు శరణార్థులను మంత్రి మాండవీయ కలిశారు. పౌరసత్వ సవరణ చట్టం అనేది శరణార్థులు భారతదేశంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఏడుగురికి భారత పౌరసత్వ సర్టిఫికెట్లు అందజేయడంతో మోర్బి శిబిరంలో ఆనందం నెలకొంది.

## నటుడు సిద్ధార్థ్‌పై కేసు

తమిళనాడు వ్యాప్తంగా నిరసనలు జోరందుకున్నాయి. గురువారం ఆందోళనల్లో పాల్గొన్న 600 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రముఖ నటుడు సిద్ధార్థ్, గాయకుడు టీఎం కృష్ణపేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఉండటం గమనార్హం. చెన్నైలోని వళ్లువర్ కొట్టంలో గురువారం జరిగిన ఆందోళనల్లో వీరు పాల్గొన్నట్టు పోలీసులు తెలిపారు. శ్రీలంక తమిళులకు పౌరసత్వం ఎందుకు ఇవ్వరని తాను ప్రశ్నించానని, కొన్ని వర్గాలకే చట్టం పరిమితం చేయడంలో ఆంతర్యమేంటని నటుడు సిద్ధార్థ్ నిలదీశారు.

● ఉన్నావ్ అత్యాచార కేసు..!

## కుల్దీప్ సింగార్‌కు జీవిత ఖైదు

**రూ.25 లక్షల చెల్లించాలి: తీస్ హజారీ కోర్టు**



**న్యూఢిల్లీ:** ఉన్నావ్ అత్యాచారం కేసులో కుల్దీప్ సెంగార్‌కు తీస్ హజారీ కోర్టు శుక్రవారం జీవిత ఖైదు విధించింది. బాధిత యువతి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం, విచారణ ఖర్చుల నిమిత్తం రూ.15 లక్షలు (మొత్తంగా రూ.25 లక్షలు) నెలలోపు చెల్లించాలని కుల్దీప్ సెంగార్‌ను కోర్టు ఆదేశించింది. రెండు సంవత్సరాల పాటు సుదీర్ఘంగా సాగిన విచారణ ఎమ్మెల్యేకు జీవిత ఖైదు విధించడంతో తెరపడింది. ఈ తీర్పుతో న్యాయం గెలిచిందని ఉన్నావ్ బాధితురాలి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని ఈ తీర్పు చాటి చెప్పిందన్నారు. తీర్పు సమయంలో సెంగార్ ఉద్వేగానికి లోనయ్యాడు. న్యాయమూర్తి తీర్పు వెల్లడించగానే తన కుమార్తె, సోదరితో కలిసి కన్నీళ్లు పెట్టుకున్నాడు.

### నెలకు రూ.15వేల అద్దె చెల్లించాలి

అత్యాచారం చేయడంతో సదరు బాలిక గౌరవం, పవిత్రత, పేరు, ఖ్యాతిని భంగపర్చినట్టే అని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబానికి నిందితుడు కుల్దీప్ నుంచి ఏదైనా ముప్పు ఉందేమో సమీక్షించాలని సీబీఐకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బాధితురాలి కుటుంబానికి సరైన రక్షణ కల్పించాలని న్యాయ స్థానం ఆదేశించింది. మూడు నెలలకోసారి బాధితురాలి కుటుంబ సభ్యుల విషయాలను కోర్టుకు తెలియజే యాల్సిందిగా సీబీఐను ఆదేశించింది. మరో ఏడాది పాటు బాధితురాలి కుటుంబం ఢిల్లీ కమిషన్ ఫర్ ఉమెన్‌లో ఉంటుందని, వారి వసతి కోసం అద్దె రూపంలో నెలకు రూ.15 వేలు చెల్లించాలని యూపీ ప్రభుత్వాన్ని తీస్ హజారీ కోర్టు ఆదేశించింది.

### రెండేళ్లుగా రహస్య విచారణ

సీబీఐ వాదనలు పూర్తయిన తరువాత ఘటనలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సెంగార్‌ను ఈనెల 16న దోషిగా తేల్చుతూ కోర్టు తీర్పు వెలువరించింది. అత్యాచారం (376) (2) కింద ఆయన్ను దోషిగా కోర్టు నిర్ధారించింది. బాలిక కిడ్నాప్.. అత్యాచారం.. బాధితురాలి తండ్రి లాకప్‌లో మరణం.. ఆమె ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం.. వంటి మలుపులతో రెండేళ్లుగా నలుగుతున్న ఈ కేసులో ఎట్టకేలకు న్యాయం జరిగింది. 2017, జూన్ 4న మైనర్ బాలికపై సెంగార్ అత్యాచారం చేశాడు. తప అధికార బలంతో బాధితురాలి కుటుంబాన్ని అనేక ఇబ్బందులకు గురి చేశాడు. ఆమె తండ్రిపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టించగా.. చనిపోయాడు. దీంతో బాధితురాలు సీఎం యోగి ఇంటి ముందు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఈ కేసు సీబీఐకి బదిలీ అయ్యింది. ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేసినా.. బాధితురాలికి కష్టాలు తప్పలేవు.

### గొగోయ్ కారణంగా ఢిల్లీకి కేసు బదిలీ

బాధితురాలు ప్రయాణిస్తున్న కారును లారీతో ఢీకొట్టించాడు. ఈ ప్రమాదంలో ఆమె తన ఇద్దరు బంధువులను కోల్పోగా.. బాధితురాలి తరపున వాదిస్తున్న లాయర్ కూడా గాయపడ్డాడు. అప్పటి సుప్రీం సీజే గొగోయ్‌కు బాధితురాలు లేఖ రాసింది. దీంతో ఆయన స్పందించి ఇందుకు సంబంధించిన అన్నీ కేసులను లక్నో నుంచి ఆగస్టు 1న ఢిల్లీకి బదిలీ చేశారు. రోజు వారీ విచారణ జరిపి 45 రోజుల్లోగా పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

● జైపూర్ పేలుళ్ల కేసు..!

## నలుగురికి ఉరి

**ఒకరిని నిర్దోషిగా తేల్చిన కోర్టు**



**జైపూర్ :** పింక్ సిటీ జైపూర్‌ను వణికించిన వరుస బాంబు పేలుళ్ల కేసులో నలుగురు నిందితులకు శుక్రవారం ఉరిశిక్ష పడింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో రద్దీ ప్రాంతాల్లో బాంబులు అమర్చి, వాటిని పేల్చిన ఘటనలో నలుగురిని ప్రత్యేక న్యాయ స్థానం ఇది వరకే దోషులుగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసులో దోషులుగా తేలిన మహ్మద్ సైఫ్, మహ్మద్ సర్వర్ అజ్మీ, మహ్మద్ సల్మాన్, సైపుర్ రహ్మన్ ప్రస్తుతం జైపూర్‌లోని కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఇదే కేసులో షెహబాజ్ హుస్సేన్‌ను ప్రత్యేక న్యాయ స్థానం నిర్దోషిగా గుర్తించింది. అతనిపై నమోదైన కేసును కొట్టేసింది. ఈ మేరకు నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ తీర్పు వెలువరించారు.

# పౌరసెగ

## యూపీలో ఆరుగురి మృతి

- ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన
- కాంగ్రెస్ నాయకురాలు శర్మిష్ఠా ముఖర్జీ అరెస్టు
- పోలీసుల అదుపులో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్
- యూపీలోని కాన్పూర్‌లో కాల్పులు
- ఏడుగురికి గాయాలు.. పరిస్థితి విషమం
- ఢిల్లీలో మెట్రో సేవలకు అంతరాయం
- చెన్నై 600, యూపీలో 150 మందిపై కేసు
- యూఎస్ ప్రస్తావనపై మమతా బెనర్జీ యూటర్న్
- దీదీ వైఖరిపై కేంద్ర మంత్రుల మండిపాటు




చికాగోలో నిరసన ప్రదర్శన

### ఒక్క బుల్లెటూ కాల్చలేదు : యూపీ డీజీపీ.. 7కు చేరిన సీఏఏ మరణాలు

**లక్నో :** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనల్లో శుక్రవారం ఆరుగురు చనిపోయినట్టు అధికారులు వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకు సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో మృతుల సంఖ్య 7కు చేరింది. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన తరువాత జరిగిన ఆందోళనల్లో వేర్వేరు చోట్ల ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. యూపీ డీజీపీ ఓపీ సింగ్ మాట్లాడుతూ.. 20 జిల్లాలో జరిగిన నిరసనల్లో ఐదుగురు చనిపోయారని ఇప్పటి వరకు తెలిసిందన్నారు. ఇద్దరు బిజ్నూర్‌లో, మీరట్, సంభల్‌తో పాటు ఫిరోజాబాద్‌లో ఒకరు చొప్పున మరణించినట్టు వివరించారు. కాన్పూర్‌లో ఒకరు చనిపోయినట్టు తెలిసినా అధికారుల ఇంకా ధృవీకరించలేదు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం తరువాతే తెలుస్తుందని సింగ్ వివరించారు. అయితే ఎవరూ పోలీసుల కాల్పుల్లో మాత్రం చనిపోలేదని చెప్పుకొచ్చారు. 50 మందికిపైగా పోలీసులు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. తాము ఒక్క బుల్లెట్ కూడా కాల్చలేదన్నారు.




**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, ముంబై, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో నిరసన జ్వాలలు చెలరేగుతున్నాయి. అసోం, త్రిపుర, మేఘాలయలో కొంత వరకు ఆందోళనలు తగ్గినా.. సమస్యాత్మక ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. రాజధాని ఢిల్లీ గేటు వద్ద విద్యార్థులు, పౌర హక్కుల సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొని సీఏఏకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. శాస్త్రి భవన్, ద్వారక, నజఫ్‌గఢ్, ఎర్రకోట, చాందినీ చౌక్‌తో సహా మరికొన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించిన వారిని అరెస్టు చేశారు. వారిలో ఢిల్లీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శర్మిష్ఠా ముఖర్జీ ఉన్నారు. సీమాపూర్‌లో ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో షహదారా అడిషనల్ డిప్యూటీ కమిషనర్ రాజ్‌బిర్ సింగ్ తలకు గాయాలు కాగా అతన్ని ఆస్పత్రికి తరలించారు. జామియా మిలియా ఇస్లామియాలో ఆందోళనలు గురువారంతో 5వ రోజుకు చేరుకున్నాయి. సీఏఏ, ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా నినాదాలుచేపట్టారు.

### జామియాలో ఎన్‌హెచ్ఆర్సీ సందర్శన

జామా మసీదు సమీపంలో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో జరిపిన నిరసన ప్రదర్శనలో పాత ఢిల్లీలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. జామా మసీద్, ఎర్రకోట ప్రాంతాల్లో నిషేదాజ్ఞలు విధించడంతో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. జామియా మిలియా ఇస్లామియా వర్సిటీలో హింసకు సంబంధించిన పలు పిటిషన్‌ల విచారణ సందర్భంగా న్యాయమూర్తులను అవమానపర్చేలా మాట్లాడిన వారిపై కోర్టు ధిక్కారణ కింద చర్యలు తీసుకోవాలని పలువురు అడ్వకేట్లు శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో పిల్ వేశారు. వందలాది మంది ప్రజలు జంతర్‌మంతర్ నుంచి జామా మసీదు వరకు నిర్వహించిన ర్యాలీని ఢిల్లీ గేటు వద్ద పోలీసులు నిలిపివేశారు. ఢిల్లీలోని కొన్ని కీలక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా పోలీసులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జామియా మిలియా ఇస్లామియా వర్సిటీని ఎన్‌హెచ్ఆర్‌సీ బృందం శుక్రవారం సందర్శించి ఆదివారం నాటి ఘటన వివరాలను అడిగి తెలుసుకుంది. దర్యాగంజ్‌లో కారుకు నిప్పంటించారు.

### యూపీలో పోలీసులపై దాడి

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆందోళనలు మరింత ఉగ్రరూపం దాల్చాయి. ఫిరోజాబాద్, భడోహితో సహా ఆందోళనకారులు శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ పూర్తయిన తరువాత నిరసన చేపట్టారు. ర్యాలీని అడ్డుకున్న వారితో పోలీసులు తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. రాళ్లు రువ్వడంతో పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో వారు కాల్పులు జరిపారు. కాన్పూర్, బాబుపుర్వా కాల్పుల్లో గాయపడిన ఏడుగురికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచినట్టు ఐజీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గోరఖ్‌పూర్, షర్వాన్‌పూర్, ముజఫర్‌నగర్, హపూర్, శామ్లీ, ప్రయాగ్‌రాజ్, బులంద్‌షహర్, మీరట్, ఫిరోజాబాద్, వారణాసి, ఫరుఖాబాద్, బిజ్నోర్, భడోయితో పాటు హమిర్‌పూర్‌లో వందలాది మంది రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు. యాతిమ్‌పూర్ ఏరియాలో వాహనాలను ధ్వంసం చేసి నిప్పటించారు. ఫిరోజాబాద్‌లో కూడా కొన్ని వాహనాలను దహనం చేశారు. దీంతో ఫిరోజాబాద్‌లో భారీ బలగాలను మోహరించారు. శామ్లీ, హపూర్, ముజఫర్‌నగర్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. 3,505 మంది నిర్బంధంలో ఉండగా.. శుక్రవారం 150 మందిని అదుపులోకి తీసుకున్నారు. సంభల్ జిల్లాలో 200కుపైగా కేసులు నమోదయ్యాయి. వీరిలో కొంత మంది సమాజ్‌వాది పార్టీ నేతలు కూడా ఉన్నారు.

### 'మహా'లో బస్సులపై దాడి

మహారాష్ట్రలోని బీడ్, నాందేడ్ జిల్లాల్లో పలు చోట్ల ఆర్టీసీ బస్సులను నిరసనకారులు ధ్వంసం చేశారు. భారీగా పోలీసులను మోహరించడంతో పరిస్థితి అదుపులోకొచ్చింది. అంబజోగేలోని యశ్వంత్‌రావు చావాన్ చౌక్‌లో మధ్యాహ్నం ఓ బస్సును ధ్వంసం చేశారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. నాందేడ్ రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న బస్సులు కూడా ధ్వంసం అయ్యాయి. మహారాష్ట్రలోని కొన్ని జిల్లాల్లో బస్సు సర్వీసులను ఉదయం తాత్కాలికంగా నిలిపివేశారు. సాయంత్రానికి మళ్లీ ప్రారంభించారు.

### మంగుళూరు విమానాశ్రయంలో హస్తం నేతల నిర్బంధం

మంగళూరులో 22 అర్ధరాత్రి వరకు ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. కాల్పుల్లో చనిపోయిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను మంగుళూరు విమానాశ్రయంలో పోలీసులు అడ్డుకుని నిర్బంధించారు. సిద్ధరామయ్య కూడా తన మంగుళూరు నుంచి బెంగళూరు ట్రిప్‌ను రద్దు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రతిపక్ష నేత ఎస్ఆర్ పాటిల్, మాజీ హోంశాఖ మంత్రి, ఎమ్మెల్యే ఎంబీ పాటిల్, మాజీ స్పీకర్ రమేశ్ కుమార్, మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్పను పోలీసులు మంగళూరు విమానాశ్రయంలోనే నిర్బంధించారు. ఉగ్రప్ప, రమేష్ కుమార్‌లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బెంగుళూరులో కొనసాగుతున్న 144 సెక్షన్‌పై వివరణ ఇవ్వాల్సిందిగా కర్నాటక హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### మమతా వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

సీఏఏపై ఐరాస రెఫరెండం చేయించాలన్న మమతా డిమాండ్‌పై కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, ప్రకాశ్ జవదేకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఏఏపై ఐక్యరాజ్య సమితితో ప్రజాభిప్రాయ సేకరణ చేయించాలన్న మమతా డిమాండ్ సరికాదని, అసలు దేశంలో చట్టం ఏర్పాటు చేయడానికి.. యూఎన్‌తో ఏం సంబంధమో అర్థం కావడం లేదని జవదేకర్ అన్నారు. ఎంతో ఆశ్చర్యం వేసిందన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ఓ సీఎం చేయడం దురదృష్టకరమని అన్నారు. సీఏఏపై యూఎన్‌తో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్న మమతా డిమాండ్ భారత పార్లమెంటరీ వ్యవస్థను అవమానపర్చడమే అవుతుందని అన్నారు.

### మమత బెనర్జీ యూటర్న్

సీఏఏపై ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) జరగాలని చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ యూటర్న్ తీసుకున్నారు. తాను ఒపీనియన్ పోల్ మాత్రమే నిర్వహించాలని కోరానని చెప్పుకొచ్చారు. ఓటింగ్ మాత్రమే అన్నా అని, అది కూడా మానవ హక్కుల కమిషన్ వంటి నిపుణుల పర్యవేక్షణలో జరగాలని కోరా అని, దేశంతో పాటు ఇక్కడి ప్రజలపై తనకు నమ్మకం ఉందంటూ మమతా శుక్రవారం చెప్పుకొచ్చింది.

## హింసను ఖండిస్తున్నాం

**ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ**



**ప్రభన్యూస్, హైదరాబాద్ :** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడం తమ హక్కు అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. హైదరాబాద్ ఎంఐఎం పార్టీ కార్యాలయంలో పౌరసత్వ సరవరణ చట్టంపై యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ శుక్రవారం నాడు సమావేశమైంది. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ.. నిరసన చేపట్టే ముందు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. లక్నో, ఢిల్లీల్లో హింస చెలరేగడంతో పోలీసులు దారుణంగా వ్యవహరించారని అన్నారు. కర్ణాటకలోని మంగళూరు లో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు ముస్లింలు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టంపై దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నా యని తెలిపారు. పౌరసత్వ సరవణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడం తమ హక్కని అన్నారు. కానీ హింసను ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.



## ఎన్ఆర్సీ, సీఏబీకి వ్యతిరేకంగా ఆందోళనలు

**అంబర్‌పేటలో ముస్లింల భారీ ర్యాలీ... అడ్డుకున్న పోలీసులు, పరిస్థితి ఉద్రిక్తం**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఎన్ఆర్‌సీ, సీఏబీకి వ్యతిరేకంగా రాష్ట్రంలోనూ నిరసనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఎన్ఆర్‌సీ, సీఏబీకి వ్యతిరేకంగా ముస్లింలు శుక్రవారం ఆందోళనకు దిగారు. కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ ప్రదర్శనగా బయలు దేరడానికి ప్రయత్నిస్తుండగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. వారికి మద్దతునిచ్చేందుకు వస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావును సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిరసనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన వి.హనుమంతరావును దారిలోనే అడ్డుకున్న పోలీసులు వెనక్కి పంపారు. కొన్ని రాష్ట్రాలు సీఏబీని అమలు చేయమని చెప్పాయని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయడం లేదన్న విషయాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్‌ను కలిసి సీఏబీకి వ్యతిరేకంగా తమ పార్టీ శనివారం చేపట్టనున్న ప్రదర్శనకు అనుమతించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని ఆయన ఈ సందర్భంగా ఓవైసీకి సూచించినట్టు సమాచారం.



## ఎన్డీఏకు జేడీయూ గుడ్‌బై!

**పాట్నా :** బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయేకు బీహార్ సీఎం నితీష్‌కుమార్ శుక్రవారం భారీ షాక్ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా ఎన్ఆర్‌సీ అమలు చేస్తామని ఓ వైపు కేంద్రం చెబుతుండగా... దాన్ని బీజేపీయేతర రాష్ట్ర సీఎంలు వ్యతిరేకిస్తున్నారు. మిత్రపక్షంగా ఉన్న జేడీయూ పార్టీ అధినేత బీహార్ సీఎం నితీష్ కుమార్ బీహార్‌లో ఎన్ఆర్‌సీ అమలు ఉండదని స్పష్టం చేశారు. బీహార్‌లో ఎన్ఆర్సీ అమలు చేయాల్సిన అవసరం ఏముందని నితీష్ కేంద్రాన్ని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏపై కూడా ప్రారంభంలో వ్యతిరేక గళం వినిపించిన అతిపెద్ద మిత్ర పక్షంగా కూడా జేడీయూ నిలిచింది. సీఏఏ చట్టంతో పాటు ఎన్ ఆర్సీని వ్యతిరేకిస్తూ ప్రశాంత్ కిశోర్ ట్వీట్లు చేశారు. వివాదాస్పద చట్టాలు తమ రాష్ట్రంలో అమలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్న వారి సరసన నితీష్ చేరారు. సీఏఏకు పార్లమెంట్‌లో నితీష్ నేతృత్వంలోని జేడీ యూ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. అయితే నితీష్ నిర్ణయానికి వ్యతిరేకంగా గడిచిన వారం రోజుల నుంచి ఆందోళనలతో బీహార్ అట్టుడుకుతోంది. చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం సంఘాలతో పాటు ప్రతిపక్ష ఆర్‌జేడీ, వామపక్ష నిరసనలతో రాష్ట్రం మండిపోతోంది. వారి ఆగ్రహానికి నితీష్ స్పందిస్తూ.. తమ రాష్ట్రంలో అమలుచేసే ప్రసక్తే లేదంటూ నితీష్‌కుమార్ తేల్చి చెప్పారు.

## కాంగ్రెస్ నిద్ర నటిస్తోంది

**ప్రజలను రెచ్చగొట్టి చోద్యం చూస్తోంది: ప్రతిపక్షాలపై మండిపడ్డ నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** పౌరసత్వ చట్ట సవరణ, ఎన్ఆర్సీ అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. శుక్రవారం రాత్రి బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు ఒకవర్గం ప్రజలను రెచ్చగొట్టి అగ్గి రాజేస్తున్నాయని ఆరోపించారు. పౌరసత్వచట్టం వివక్షా పూరితం కాదని హరీశ్ సాల్వే వంటి ప్రముఖ న్యాయ వాదులు చెప్పిన తర్వాత తాము తప్పు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీకి అర్థ మైందని, అయితే దాన్ని అంగీకరించలేక ఇప్పుడు ఎన్ఆర్సీ పేరుతో రాద్ధాంతం చేస్తున్నారని ఆమె అన్నారు. సోనియా గాంధీ వంటి నేతలు సైతం ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని నిర్మల హితవు పలికారు. ఎన్ఆర్సీ ఇంకా రాలేదని, దానికి సంబంధించిన విధివిధా నాలు ఇంకా రూపొందించలేదని, అప్పుడే ఎన్ఆర్సీ పేరు చెప్పి లేనిపోని భయాలు, అపోహలు సృష్టిస్తున్నారని ఆమె మండిపడ్డారు. పౌరసత్వ చట్టం ఏ ఒక్క వర్గానికీ వ్యతిరేకం కాదని, ఇది కేవలం పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్ దేశాల్లో మతపరమైన హింసకు, దాడు లకు గురై అక్కడ ఉండలేక భారతదేశానికి వచ్చినవారికి పౌరసత్వం కల్పించే బిల్లు అని ఆమె స్పష్టం చేశారు. పాకిస్తాన్ నుంచి మతపర మైన వివక్షకు, దాడులకు గురై వచ్చిన ముస్లింలలో వేరే వర్గాల ప్రజలకు కూడా భారతదేశం పౌరసత్వం కల్పించిందని ఆమె గుర్తుచేశారు. పాక్, బంగ్లా నుంచి వచ్చిన మైనారిటీ మతాలకు చెందిన వారికి పౌరసత్వం కల్పించాలని గతంలో కాంగ్రెస్, టీఎంసీ పార్టీలు కోరాయని, మమతా బెనర్జీ ఏకంగా సభలో పత్రాలు చింపి రభస చేశారని ఆమె గుర్తుచేశారు. ఆనాడు ఎన్ఆర్సీని సమర్థించిన మమతా ఇప్పుడు మనసు మార్చుకుంటే తమకు అభ్యంతరం లేదని, కానీ ప్రజల్ని రెచ్చగొట్టడం మాత్రం తగదని నిర్మలా అన్నారు.

ఆర్థిక మందగమనం గురించి జరుగుతున్న చర్చ నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసమే ఈ చట్టం తీసుకొచ్చారని జరుగుతున్న ప్రచారంపై కూడా ఆమె స్పందించారు. ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆమె అన్నారు. విద్యార్థులను, ఒక వర్గం ప్రజలను ఎవరు రెచ్చగొడుతున్నారో అందరికీ తెలుసునని, దాన్ని బట్టి ఎవరు దృష్టి మళ్లిస్తున్నారో అర్థమవుతుందని ఆమె వ్యాఖ్యానించారు.

## సీఏఏపై అపోహలు వద్దు

**ఎన్నార్సీతో ఎలాంటి ఇబ్బందీ ఉండదు: నిరసనలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** పౌరసత్వ చట్ట సవరణపై అపోహలు వద్దని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. పౌరసత్వ చట్ట సవరణ దేశంలో ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని, పాక్, బంగ్లా, అఫ్ఘనిస్తాన్ దేశాల్లో హింసకు, అణచివేతకు గురైన మైనారిటీల కోసమే ఈ చట్టమని ఆయన తేల్చి చెప్పారు. ఈ చట్టంతో భారత ముస్లింలకు ఏమాత్రం నష్టం లేదని, రోడ్లమీదకొచ్చి ఆందోళన చేసే ముందు చట్టాన్ని ఓసారి చదవాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. ఎన్నార్సీతోనూ ఎవరికీ నష్టం లేదని, దానిపై ఇంకా చట్టం రూపొంద లేదు కాబట్టి విధి విధానాలు తయారు కాలేదని అన్నారు. ఎన్నార్సీ అనేది కేవలం భారతీయ పౌరుల జాబితా మాత్ర మేనని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా జాబితా రూపొందిస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. డిటెన్షన్ క్యాంపుల ఏర్పాటు ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. బతుకుదెరువు కోసం బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లింలకు వర్క్ పర్మిట్లు ఇస్తామని, వర్క్ పర్మిట్లతో వారు భారతదేశం లో ఉండొచ్చని, పనులు చేసుకోవచ్చని ఆయన వివరించా రు. బతుకుదెరువు కోసం వచ్చిన వాళ్లకు, అక్రమ చొర బాటు దారులకు మధ్య తేడా ఉందని, చొరబాటు దారులను ప్రపంచంలో ఏ దేశం కూడా అంగీకరించ దని కిషన్ వెల్లడించారు. ప్రతిపక్షాలు, మేధావులు మోడీ సర్కారుపై విషం కక్కు తున్నారని, గతంలోనూ మోడీ సర్కారు ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేశారని ఆయన విమర్శించారు. ఇంటాలరెన్స్, అవార్డ్ వాపసీ, గోరక్షక్ దాడుల పేరుతో బద్నాం చేశారని, ఇప్పుడు ముస్లింలలో అపోహలు సృష్టించి విద్వేషాలు రెచ్చగొ డుతున్నారని చెప్పారు.

**శరణార్థులకు పౌరసత్వం కల్పించడం ప్రభుత్వ బాధ్యత**

శ్రీలంక తమిళులకు గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పౌరసత్వం ఇచ్చిందని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే భవిష్యత్తులో పౌరసత్వం కల్పిస్తామని కిషన్ రెడ్డి వెల్లడిం చారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చిన హిందువులకు గత ప్రభుత్వాలు పౌరసత్వం ఇచ్చాయని గుర్తు చేశారు. పాక్, బంగ్లా, అఫ్ఘన్ నుంచి వచ్చిన సిక్కు, హిందూ, పార్శీ, జైన్, క్రైస్తవ, బౌద్ధ మతస్థులు దేశంలో శరణార్థులుగా దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారికి పౌరస త్వం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పీడిత, బాధిత వర్గాలకు పౌరసత్వం కల్పించడాన్ని కొంద రు దురుద్దేశంతో తప్పుబడుతున్నారని విమర్శించారు.



# ఎన్‌సీఏలో బుమ్రాకు ఫిట్‌నెస్ టెస్ట్

## బీసీసీఐ చీఫ్ గంగూలీ



**ముంబై:** బుమ్రా ఫిట్‌నెస్ పరీక్ష నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో జరుగుతుందని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూల్ శుక్రవారం తెలిపాడు. రాహుల్ ద్రావిడ్ నేతృత్వంలోని కమిటీ బెంగళూరులో ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదన్న నేపథ్యంలో గంగూలీ ఈ వ్యాఖ్యలు చేశాడు. విశాఖలో విండీస్‌తో జరిగిన రెండో వన్డేకు ముందు భారత జట్టుకు నెట్స్‌లో బౌలింగ్ చేశాడు. దీనిపై గంగూలీ స్పందిస్తూ ఆ విషయం తనకు తెలియదన్నాడు. భారత ఆటగాళ్లందరూ ఎన్‌సీఏకు వెళ్లవలసి ఉంటుందని అయితే సౌకర్యవంతంగా తేలికగా ఉండేలా చేస్తామని తెలిపాడు. ఎన్‌సీఏలో ఫిట్‌నెస్ పరీక్ష కోసం బుమ్రా చేసిన అభ్యర్థనను ద్రావిడ్ తిరస్కరించాడనే నివేదికపై గంగూలీ స్పందించాడు. ఎన్‌సీఏ నుంచి వచ్చేవారికి బదులుగా ప్రైవేట్ ట్రైనర్స్‌తో శిక్షణ తీసుకోవాలన్న బుమ్రా నిర్ణయంపై భారత మాజీ కెప్టెన్ మండిపడినట్టు తెలిపాడు. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో 6వ స్థానంలోఉన్న 26ఏళ్ల బుమ్రా గాయనుంచి కోలుకున్న తరువాత ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ ట్రైనర్ రజనీకాంత్ శివజ్ఞానం ఆధ్వర్యంలో సాధన చేస్తున్నాడు.కాగా అంతర్జాతీయ క్రికెటర్లకు ఎన్‌సీఏ మొదటి, చివరి పాయింట్ కావాలని, భారత క్రికెటర్లకు ఇదే కేంద్రమని అందరూ ఎన్‌సీఏ ద్వారానే వెళ్లాలని గంగూలీ స్పష్టం చేశాడు. గంగూలీ ఇటీవల ఎన్‌సీఏను సందర్శించి ఈ ఏడాది జులైలో చీఫ్‌గా నియమితులైన ద్రావిడ్‌తో చర్చలు జరిపాడు.

### రెండు రోజుల్లో సీఏసీ ఏర్పాటు

మూడేళ్ల పదవీకాలంలో కొత్త సెలెక్షన్ ప్యానెల్‌ను ప్రకటించడానికి మరో రెండురోజుల్లో క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఐసీ) ఏర్పాటు చేయనున్నట్టు గంగూలీ తెలిపాడు. నూతన కమిటీ పదవీకాలం మూడేళ్లుగా తెలిపాడు. టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ నేతృత్వంలోని గత ప్యానెల్ ఇప్పటికే ప్రధాన కోచ్ నియామకాన్ని పూర్తి చేసినందున కేవలం సెలక్టర్లను నిర్ణయించడానికి ఒక సమావేశానికి మాత్రమే సీఏసీని నియమిస్తామని గంగూలీ వెల్లడించాడు. హెడ్ కోచ్ ఇప్పటికే ఎంపికైనందున సెలక్టర్లను నియమించడానికి ఒకసమావేశం మాత్రమే ఉంటుందన్నాడు. ప్రస్తుత సెలక్షన్ ప్యానెల్ హెడ్ ఎంఎస్‌కే ప్రసాద్ పదవీకాలం ముగిసింది. ఎంఎస్కేతోపాటు మరో సభ్యుడు గగన్ ఖోడా గడువు కూడా ముగిసింది. జతిన్ పరంజపే, దేవాంగ్ గాంధీ, శరన్‌దీప్‌సింగ్ ఇంకా ఏడాది పదవీకాలం ఉన్నా వారిని కూడా తొలగిస్తారనే ఊహాగానాలు ఉన్నాయి. గంగూలీ తన ఫాంటసీ ఎలెవన్ జట్టును ఎంచుకున్నాడు. కోహ్లితోపాటు రోహిత్‌శర్మ, ఆసీస్ లెఫ్ట్‌హ్యాండర్ డేవిడ్ వార్నర్, రిషబ్‌పంత్ ఉన్నారు. అయితే కెప్టెన్ స్థానాన్ని గంగూలీ తనకే ఉంచుకున్నాడు.



# త్వరలోనే బరిలోకి బుమ్రా

## ముంబై ఇండియన్స్ కోచ్ జయవర్దనే

ముంబై: టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వెన్నెముక గాయం నుంచి కోలుకున్నాడని ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేలా జయవర్ధనే తెలిపాడు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరిగే శ్రీలంక, ఆస్ట్రేలియాతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు బుమ్రా బరిలోకి దిగే అవకాశం ఉందని జయవర్ధనే శుక్రవారం తెలిపాడు. ఇటీవల భారత జట్టుకు నెట్స్‌లో బౌలింగ్ చేసిన బుమ్రా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించాడు. బుమ్రా పురోగతి గురించి విలేఖరులు జయవర్ధనేను అడిగనప్పుడు ముంబై ఇండియన్స్ సిబ్బంది అతడి పురోగతి పరిశీలిస్తుందని వెల్లడించాడు. జనవరి నాటికి అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టవచ్చని భావిస్తున్నామని జయవర్ధనే తెలిపాడు. బుమ్రాతోపాటు హార్దిక్ పాండ్యా కూడా జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ఆడే అవకాశం ఉందని వారి జనవరిలో జరిగే శ్రీలంక సిరీస్ లేదా ఆస్ట్రేలియా సిరీస్‌కు అందుబాటులో ఉంటారని జయవర్ధనే అన్నాడు. కాగా గాయం నుంచి కోలుకున్న బుమ్రా విశాఖలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా సభ్యులకు నెట్స్‌లో బౌలింగ్ చేశాడు. మరోవైపు లండన్‌లో వెన్నెముక సర్జరీ చేయించుకున్న పాండ్యా సబర్బన్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో సాధన చేస్తున్నాడు. ముంబై ఇండియన్స్ పేస్ దళానికి నేతృత్వం వహిస్తున్న బుమ్రా 77మ్యాచ్‌ల్లో 82వికెట్లు పడగొట్టాడు.



## క్రిస్మస్ తాతగా కోహ్లి

**కోల్‌కతా:** టీమిండియా కెప్టెన్ కోహ్లి తాజాగా శాంటాక్లాజ్ అవతార మెత్తాడు. క్రిస్మస్‌తాత వేషధారణలో చిన్నారులను అలరించడమేకాక వారికి బహుమతులు కూడా అందజేశాడు. క్రిస్మస్ నేపథ్యంలో అనాథ బాలల్లో ఆనందం నింపేందుకు తన పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి సమాజసేవ చేస్తున్నాడు. శాంటాక్లాజ్ వేషంలో కోల్‌కతాలోని ఓ అనాథాశ్రమానికి వచ్చి చిన్నారులకు కానుకలు అందించాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది.

### ఆర్‌సీబీ ఆటగాళ్ల ఎంపికపై సంతోషం

రాయాల్ చాలెంజర్స్ బెంగళూరు, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి శుక్రవారం ఆర్‌సీబీ ఆటగాళ్ల ఎంపికపై సంతృప్తి వ్యక్తం చేశాడు. ఆర్‌సీబీ ఫ్రాంచైజీ ఐపీఎల్ వేలంలో క్రిస్‌మోరిస్, ఆరోన్‌ఫించ్, కేన్ రిచర్డ్‌సన్, డేల్‌స్టెయిన్‌తోసహా 8మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా ఆర్‌సీబీ కెప్టెన్ కోహ్లి మాట్లాడుతూ తన ఫ్రాంచైజీ ఎంపిక చేసిన ఆటగాళ్లతో తాను సంతోషంగా ఉన్నాను అని తెలిపాడు. ధైర్యంగా ఆడటం ద్వారా ఉత్తమ క్రికెట్‌ను ఆస్వాదించాలని కొత్త సీజన్‌కోసం ఎదురుచూస్తున్నట్టు తెలిపాడు. ఆర్‌సీబీ చైర్మన్ సంజీవ్ చురివాలా మాట్లాడుతూ తన ఫ్రాంచైజీని ప్రతిబింబించేసమతుల్య జట్టును కోరుకుంటుందని, ఈ టోర్నమెంటులో అత్యుత్తమ క్రికెట్‌ను ప్రదర్శించాలనుకుంటున్నా మని తెలిపారు. అయితే ఇప్పటి వరకు జరిగిన 12ఎడిషన్లలో ఆర్‌సీబీ ఐపీఎల్ టైటిల్‌ను ఒక్కసారి గెలుచుకోలేదు.

## బ్యాకప్ ఆటగాళ్లు లేని కేకేఆర్



**ముంబై:** కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు తగినంతగా బ్యాకప్ ఆటగాళ్లు లేరని ఆ జట్టు మాజీ కెప్టెన్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఐపీఎల్ వేలంలో మిచెల్ మార్ష్ మార్కస్ స్టొయినిస్ వంటి ఆల్‌రౌండర్లను ఎక్కువగా తీసుకుంటే మరింత బలం పెరిగేదని గంభీర్ తెలిపాడు. ఆండ్రూ రసెల్, ఇయాన్ మోర్గాన్, సునీల్ నరైన్‌కు బ్యాకప్ ఆటగాళ్లు లేరని, మోర్గాన్ గాయపడితే మిడిలార్డర్‌ను భర్తీ చేసే మరో ఆటగాడు లేడని గంభీర్ వివరించాడు. టాప్ ఆర్డర్‌లో ఎవరు గాయపడినా వేరొకరితో భర్తీ చేసే అవకాశం లేదన్నాడు. బౌలింగ్‌లో కమిన్స్ గాయపడితే ఫెర్గూసన్ ఉన్నాడని అయితే కమిన్స్ మంచి పేస్‌తో కొత్త బంతిని స్వింగ్‌చేసి వికెట్లు తీయగలడని స్టార్‌స్పోర్ట్స్ క్రికెట్ లైవ్ షోలో తెలిపాడు.

ఆసీస్ పేసర్ కమిన్స్‌ను 15.50 కోట్లు, వరల్డ్‌కప్‌ను సాధించిన ఇంగ్లాండ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్‌ను 5.25కోట్లు, ఇండియన్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని రూ.4కోట్లుకు కోల్‌కతా నైట్‌రైడర్స్ యాజమాన్యం కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. కాగా 2012, 2014లో కేకేఆర్‌ను ఐపీఎల్ విజేతగా గంభీర్ నిలిపాడు.

# రంజీట్రోఫీలో ఏపీ ఘన విజయం

## 9వికెట్ల తేడాతో ఢిల్లీని ఓడించిన ఆంధ్రప్రదేశ్



**ఒంగోలు:** శుక్రవారం గ్రూప్ ఎ రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఢిల్లీపై 9వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఏపీ పేస్ ద్వయం శశికాంత్, చీపురుపల్లి స్టీఫెన్ చెరో 5వికెట్లు పడగొట్టి ఏపీ విజయంలో కీలకపాత్ర పోషించారు. మూడోరోజు శుక్రవారం మూడు వికెట్లు తీయగా గురువారం నాలుగు వికెట్లతో ఢిల్లీ వెన్నువిరిచిన స్టీఫెన్ మరో వికెట్ తీశాడు. దీంతో పర్యాటక జట్టు 169 పరుగులకే కుప్పకూలింది. తొలుత 6 వికెట్ల నష్టానికి 89పరుగులు వద్ద ఢిల్లీ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన లలిత్ యాదవ్ అర్ధశతకం పూర్తిచేసిన అనంతరం 61వ ఓవర్లో ఔటయ్యాడు. ఓవర్‌నైట్ బ్యాట్స్ మన్ యాదవ్ 61వ ఓవర్లో స్టీఫెన్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ రూపంలో వెనుదిరిగాడు. అనంతరం 70వ ఓవర్లో సిమ్రజిత్ సింగ్ (10) శశికాంత్ బౌలింగ్‌లో కేఎస్ భరత్‌కు క్యాచ్‌ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఢిల్లీ 8వికెట్లను కోల్పోయి 156 పరుగులు చేసింది. 72వ ఓవర్లో శశికాంత్ మరోసారి విజృంభించి నవదీప్ సైనీ (7)ని ఔట్‌చేశాడు. తరువాతి ఓవర్లోనే ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ వికాస్ మిశ్రా (36) ఔటయ్యాడు. మొత్తం 72.2 ఓవర్లలో ఢిల్లీ జట్టు ఆలౌటైంది. లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన ఆంధ్ర ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (0) రిటైర్డ్ హర్టుగా వెనుదిరిగాడు. దీంతో కెప్టెన్ హనుమ విహారి సిమర్జీత్‌సింగ్‌ను బ్యాటింగ్‌కు పంపాడు. మనీష్ 7బంతుల్లోనే 15పరుగులు చేసి మ్యాచ్‌కు ముగింపు పలికాడు. ఏపీ లక్ష్యం 17పరుగులే అవటంతో ఆంధ్రప్రదేశ్ 2.3ఓవర్లోనే ఒక వికెట్‌ను కోల్పోయి 20పరుగులు చేసి విజయం సాధించింది. మూడు ఫోర్లు బాదిన మనీష్ 15పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఈ విజయంతో ఏపీకి 6పాయింట్లు లభించాయి.

**సంక్షిప్త స్కోరు:** ఢిల్లీ 215, 169 (లలిత్ యాదవ్ 55, కేవీ శశికాంత్ 5/41, సీవీ స్టీఫెన్ 5/91)

**ఆంధ్ర:** 368, 20/1 (జీ.మనీష్ 15 నాటౌట్, సిమర్జిత్‌సింగ్ 1/12).



దక్షిణాఫ్రికాలో జరిగే అండర్-19 ప్రపంచకప్ 2020 పర్యటనకు బయలుదేరే ముందు ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో భారత్ యువ క్రికెట్ జట్టు

## టెన్నిస్ లీగ్‌ల్లో ప్రభుత్వం పెట్టుబడి పెట్టాలి

**న్యూఢిల్లీ:** చిన్న నగరాల నుంచి క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు దేశీయ టెన్నిస్ లీగ్‌ల్లో ప్రభుత్వమే పెట్టుబడి పెట్టాలని ఆసియాగేమ్స్ డబుల్ పతక విజేత విష్ణువర్ధన్ ప్రభుత్వాన్ని కోరాడు. 2010 ఆసియా క్రీడల్లో మిక్సడ్ డబుల్స్, పురుషుల ఈవెంట్‌లో రజతం, కాంస్య పతకాలు సాధించిన వర్ధన్ మాట్లాడుతూ అనేక లీగ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ అన్నింటినీ ఢిల్లీ, చెన్నైవంటి పెద్దనగరాల్లోనే నిర్వహిస్తున్నారని అన్నాడు. ప్రభుత్వం ముందుకు వచ్చి దేశీయ లీగ్‌లకుమద్దతు ఇవ్వాలని ప్రొ టెన్నిస్ లీగ్ సందర్భంగా అన్నాడు. చిన్న నగరాల నుంచి ప్రతిభావంతులు ఆడటానికి గుర్తింపు పొందటానికి అవకాశం కల్పించేవిధంగా ప్రభుత్వం అదనంగా కొంత పెట్టుబడి పెట్టాలని కోరుతున్నామన్నాడు. ఒలింపిక్స్ గురించి మాట్లాడుతూ సానియా మీర్జా,రోహన్ బోపన్న కాంబినేషన్ భారత్‌కు మేలు చేస్తుందని వర్ధన్ అన్నాడు.



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో ముబదాలా వరల్డ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న రష్యా క్రీడాకారిణి మరియా షరపోవా

# పాక్‌పై శ్రీలంక ఆధిక్యం



**కరాచీ:** కరాచీలో జరుగుతున్న రెండోటెస్టులో శుక్రవారం పాకిస్థాన్‌పై శ్రీలంక జట్టు ఆధిక్యాన్ని సాధించింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 191పరుగులకే ఆలౌటైంది. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన లంక 271పరుగులు చేసింది. మాజీ కెప్టెన్ దినేష్ చండీమాల్ 74 పరుగులు చేశాడు. చండీమాల్‌కు ఇది 18వ టెస్టు అర్ధశతకం. 143 బంతులను ఎదుర్కొని పది బౌండరీలు బాదాడు. చివరకు చండీమాల్‌ను పార్ట్‌టైమ్ స్పిన్నర్ హరిస్ సోహైల్ ఔట్ చేశాడు. ఉదయం 80/5తో ప్రారంభించిన లంక జట్టు ప్రారంభంలో తడబాటుకు గురైంది. చండిమాల్ ఆరవ వికెట్‌కు ధనంజయ డిసిల్వా (32)తో కలిసి 67పరుగుల భాగస్వామ్యాన్ని, నిరోషన్ డిక్వెల్లా (21)తో ఏడవ వికెట్‌కు 37పరుగులు, పెరెరాతో 51పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించాడు. చండిమాల్ వెనుదిరిగిన అనంతరం దిల్‌రువాన్ పెరెరా (48), విశ్వ ఫెర్నాండో (5) నాటౌట్‌గా నిలిచాడు. పాక్ పేసర్లు మహ్మద్ అబ్బాస్ (4/55), షాహీన్ షా అఫ్రిది (5/77) లంకను కట్టడి చేశారు. తొలిటెస్టులో సెంచరీ చేసిన డిసిల్వా తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. మొత్తం మీద 85.5 ఓవర్లు ఆడిన లంక 271 పరుగులు చేసి ఆలౌటైంది. రావల్పిండిలో జరిగిన మొదటి మ్యాచ్ వర్షం కారణంగా డ్రా అయిన సంగతి తెలిసిందే.

**స్కోర్ బోర్డు:** పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్ 191.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 271.

ఫెర్నాండో (సి) రిజ్వాన్ (బి) షాహీన్ 4, కరుణరత్నే (బి) అబ్బాస్ 25, మెండిస్ (సి) సోహైల్ (బి) అబ్బాస్ 13, ఎంబుల్‌దినియా (సి) షఫీక్ (బి) అబ్బాస్ 13, చండీమాల్ (సి) మసూద్ (బి) సోహైల్ 74, డి డిసిల్వా (సి) అబ్బాస్ (బి) షహీన్ 32,డిక్వెల్లా (బి) అబ్బాస్ 21, పెరిరా ఎల్బీడబ్ల్యూ (బి) షహీన్ 48, ఫెర్నాండో నాటౌట్ 5, కుమార (బి) షహీన్ 0, ఎక్స్‌ట్రాలు 23.

మొత్తం (85.5 ఓవర్లు. ఆలౌట్) 271.

**వికెట్ల పతనం:** 1-28, 2-39, 3-61, 4-78, 5-80, 6-147, 7-184, 8-235, 9-271.

**బౌలింగ్:** షాహీన్ 26.5-5-77-5, అబ్బాస్ 27-9-55-4, నసీమ్ 16-1-71-0, యాసిర్ 13-0-43-0, సొహైల్ 3-0-11-1

**పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్:** షాన్ మసూద్ (నాటౌట్)21, అబిద్ అలీ (నాటౌట్) 32.

**మొత్తం:** 14ఓవర్లులో 57/0.

# 2020 సన్‌రైజర్స్ జట్టు ఇదే




ఐపీఎల్ 2020 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. గురువారం జరిగిన వేలంలో స్టార్ క్రికెటర్లను విస్మరించి యువ క్రికెటర్లకే ప్రాధాన్యమిచ్చింది. భారత్ అండర్ -19 కెప్టెన్ ప్రియం గార్గ్, విరాట్‌సింగ్‌తో సహా ఏడుగురు క్రికెటర్లను మాత్రమే సన్‌రైజర్స్ కొనుగోలుచేసింది. ఐపీఎల్ 2020 టైటిల్ వేటకు బరిలోకి దిగే జట్టును పరిశీలిస్తే ఈవిధంగాఉంది.

కేన్ విలియమ్సన్(సి), డేవిడ్ వార్నర్, మనీష్‌పాండే, విజయ్‌శంకర్, రషీద్‌ఖాన్, మహ్మద్ నబీ, అభిషేక్‌శర్మ, జానీ బెయిర్‌స్టో, భువనేశ్వర్, సాహా, శ్రీవాత్సవ గోస్వామి, ఖలీల్ అహ్మద్, సందీప్‌శర్మ, సిద్ధార్థకౌల్, సదాబ్ నదీమ్, బిల్లీ స్టాన్‌లేక్, బసిల్‌థంపీ, ప్రియమ్‌గార్గ్, విరాట్‌సింగ్, మిచెల్ మార్ష్ సందీప్, అలెన్, అబ్దుల్, సంజయ్ యాదవ్.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com





# ఏమార్చేస్తున్నారు..!

## ప్రోస్తెటిక్ మేకప్ అద్భుతాలు

**కంగనారనౌత్ జయలలితగా నటిస్తున్న 'తలైవి' చిత్రం తాలూకూ ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల అయిన తరువాత ఆమె లుక్‌పై మిశ్రమ స్పందన వచ్చింది. కంగనా అచ్చంగా జయలలితలా మారిపోయిందని కొందరంటే... జయలలిత పాత్రకు కంగనా సూట్ కాలేదని ముఖ్యంగా ఆమెకు చేసిన ప్రోస్తెటిక్ మేకప్ ఏ మాత్రం బాగోలేదనే విమర్శలు సైతం వచ్చాయి. ఈ మధ్యకాలంలో ప్రోస్తెటిక్ మేకప్ అనే మాటని చాలాసార్లు వింటున్నాం. 'భామనే సత్యభామనే' చిత్రంలో కమల్ హాసన్ నుండి...రోబోలో అక్షయ్ కుమార్ వరకు... అనేక మంది తారలు అబ్బురపరచే ఈ తరహా మేకప్‌లతో ప్రేక్షకులను అలరించారు. కంగనాని జయలలితగా మార్చేందుకు వాడింది కూడా ప్రోస్తెటిక్ మేకప్పే...దీని కథా కమామిషు చెప్పాలంటే...**



ప్రోస్తెటిక్ మేకప్‌ని స్పెషల్ మేకప్ ఎఫెక్ట్స్, ఎఫ్ ఎక్స్ ప్రోస్తెసిస్ అని కూడా అంటారు. ప్రోస్తె టిక్ అంటే అవయవ మార్పిడి అని, ప్రోస్తెసిస్ అంటే కృత్రిమం అని అర్థం. శరీరం పైన క్రీములు లోషన్లు పూసి రంగుని రూపా న్ని మార్చడం కాదు ఇది. ఒక వ్యక్తి రూపాన్ని పాత్రకు తగిన ట్టుగా పూర్తిగా మరో రూపం లోకి పంపే వినూ త్న మేకప్ ప్రక్రియ ఇది. సరైన ప్రోస్తెటిక్ మేకప్ అర్టిస్టులు... పిజ్జాని గుమ్మడికాయగా మార్చేస్తారని అంటారు.

### ఇదీ....ప్రోస్తెటిక్ మేకప్ ప్రక్రియ విధానం...

శరీరంలో ఏ భాగానికి ఈ తరహా మేకప్ అవసరం అవుతుందో...దాని కొలతకోసం శరీరంలోని ఆ భాగాన్ని ...చర్మానికి హాని చేయని సిలికాన్ రబ్బర్‌తో పూర్తిగా కప్పేస్తారు. ఉదాహ రణకి మొహం కొలత కావాలనుకుంటే...పూర్తిగా మొహమంతా సిలికాన్ రబ్బర్‌తో కప్పేసి...దాని అచ్చుని తీసుకుంటారు. సున్నితంగా ఉండే ఈ సిలికాన్ రబ్బర్‌తో తయారైన అచ్చు.... బలంగా నిలబడేందుకు దానిపైన ప్లాస్టర్ లేదా ఫైబర్ గ్లాస్ బ్యాండేజ్‌తో మరొక వరుస వేస్తారు. ఇప్పుడు మొహంలోని అవయవాల కొలతలు అచ్చులో కనబడుతుంటాయి. మొహంపై ఒక ముసుగు వేస్తే ఎలా ఉంటుందో అలాంటిదన్నమాట. ఇక ఏ అవయవాన్ని మేకప్‌తో మార్చాలనుకుంటు న్నారో దానిని జిప్సమ్ సిమెంట్‌తో నింపి...అలా తయారైన అచ్చుపై ఫోమ్ లాటెక్స్, జెలటిన్, సిలికాన్ లాంటి మెటీయల్స్ ఉపయోగించి నటీనటులకు పెట్టాల్సిన, లేదా అతికించాల్సిన అవయవాన్ని తయారుచేస్తారు. ఇలా ముక్కుని, కళ్లను, చెవులను భిన్నంగానూ, పెద్దగానూ చూపించే తొడుగుల వంటివి తయారవుతాయి. వీటిని శరీర భాగా లకు అతికిస్తారు. ఈ మేకప్ ద్వారా నటుల మొహాలను పూర్తి గా మార్చేసే అవకాశం ఉంటుం ది. ముక్కు, నోరు, కళ్లు చెవులు.. ఏవైనా... తాము అనుకున్న ఆకారం లోకి మార్చేయగలుగుతారు. పలు చగా ఉండే కంగానా మొహంలోని బుగ్గలు, చుబుకం, నుదురు లాంటివి జయలలితలా కని పించేందుకు ఇలాగే పెంచి ఉంటారు. అలాగే శరీ రంపైన గాయాలు, మచ్చలు, కురుపులు లాంటివి సైతం సృష్టిస్తారు. మేకప్ ఆర్టిస్ట్.....చేసే మాయా జాలంతో అత్యంత సహజాతి సహజంగా మనిషి మరో రూపంలోకి మారతాడన్నమాట. హాలో వీన్ వేడుకలో భాగంగా వేసుకునే భయంకరమైన మేకప్‌లను సైతం ఇలాగే తయారుచేస్తారు.

### రూపాలు మార్చుకుని... పాత్రల్లోకి పరకాయ ప్రవేశం

ప్రోస్తెటిక్ మేకప్‌తోనే అమితాబ్ పా సినిమాలో గుండుతో పన్నెండేళ్ల కుర్రాడిగా కనిపించా రు. కపూర్ అండ్ సన్స్‌లో రిషికపూర్ తొంభై ఏళ్ల తాతలా కనిపించి అబ్బురపరచారు. ఈ మేకప్‌ని.. టైటానిక్‌తో పాటు ఇంకా అనేక ప్రతిష్టాత్మక సినిమాలకు మేకప్ చేసిన గ్రెగ్ క్యానమ్ చేశాడు. ఫ్యాన్ అనే సినిమాలో షారుఖ్ ఖాన్‌ని సైతం భిన్నమైన రూపంలో తెరమీద చూపించారు. ప్రోస్తెటిక్ విఎఫ్ఎక్స్ కలిసి తనని ఇరవై అయిదేళ్ల గౌరవ్ పాత్రగా మార్చేశాయని షారుక్ చాలా సందర్భాల్లో చెప్పాడు.

బధాయ్ హో బధాయ్ సినిమాలో అనిల్ కపూర్ చాలాలావుగా కనబడతాడు. ప్రోస్తెటిక్ తో పాటు ఫ్యాట్ సూట్‌తో అలా కనిపించేలా చేశారు. సాధారణంగా చిన్నవయసు వారు ముసలి పా త్రలు ధరించాలంటే విగ్గుపెట్టేసి, రంగులతోనే మొహంపై ముడతలు సృష్టించే ప్రయత్నం చేస్తా రు. కానీ క్రిష్-3లో హృతిక్ రోషన్ తండ్రి పాత్రలో వయసు మళ్లిన వ్యక్తిలాగే ఉంటాడు. అది కూడా ఈ మేకప్ మహత్యమే. ధూమ్ 2లో అతను ధరించిన దొంగ పాత్ర ప్రేక్షకులకు నచ్చడానికి కూడా ప్రోస్తెటిక్ మేకపే కారణం.

ఇక కమల్‌హాసన్ సంగతి చెప్పనక్కర్లేదు. ఏ పాత్ర ధరించినా పాత్రలో ఒదిగిపోయే కమల్.. మేకప్ విషయంలోనూ అలాంటి జాగ్రత్తలే తీసుకుంటాడు. భారతీయుడు, దశావతారం, భామనే సత్యభామనే (హిందీలో చాచీ 420) మొదలైన సినిమాలు కమల్‌లోని నటనా ప్రతిభనే కాకుండా భిన్నమైన మేకప్‌లను సైతం చూపిం చాయి. రోబో 2.0లో అక్షయ్ కుమార్ భయం కరమైన పక్షి రూపంలో డాక్టర్ రిచర్డ్‌గా కనబడ తాడు. ఈ మేకప్‌కి ఆయనకు రోజుకి మూడున్నర గంటల కాలం పట్టేది. రెండున్నర గంటలపాటు దానిని తీయడానికి పట్టేది. శరీర మంతా ప్రోస్తెటిక్స్ పెట్టుకుని నటించడం వలన శరీరంలో స్వేద రంధ్రాలు మూసుకుని పోయేవని...వాటిని తీసిన తరువాత తన శరీరంలో చెమట వాసన వచ్చేదని అక్షయ్ ఒక సందర్భంలో చెప్పాడు. అంత కష్టమైనా... మేకప్ చూసుకున్నాక మాత్రం తన శ్రమ అంతా మర్చిపోయి సెల్ఫీలు తీసుకున్నట్టుగా అక్షయ్ తెలిపాడు.

2017లో విడుదలైన రొమాంటిక్ థ్రిల్లర్ రాబ్టాలో రాజ్ కుమార్ 324 ఏళ్ల వయసున్న వ్యక్తిగా కనబడతాడు. ముడుతలతో టాటూలతో అసలు గుర్తుపట్టడానికి వీలులేకుండా అతడిని మార్చేసింది ప్రోస్తెటిక్ మేకప్పే. అలాగే మహానటి సినిమాలో సావిత్రి పాత్రకోసం కీర్తి సురేష్ సైతం ఈ మేకప్ వేసుకుంది.





సాధారణంగా హీరోయిన్లు ప్రోస్తెటిక్ మేకప్ వేసుకోరని కానీ తను ఫేస్ మాస్క్‌ని ఏడునుండి ఎనిమిది గంటలపాటు వేసుకుని నటించానని ఆమె తెలిపింది. చెమటలు పట్టి దురదలు వచ్చే వని మొటిమలు కూడా వచ్చాయని... కానీ తెర మీద అద్భు తంగా కనిపిం చిందని ఆమె తెలిపింది.



- వి.దుర్గాంబ

# ఆరోగ్యానికి... ఇలా ఆహ్వానం!

**ఇప్పుడు ఎక్కడ చూసినా లైఫ్‌స్టైల్ వ్యాధులనే మాట వినబడుతోంది. బిపి, అధికబరువు, మధుమేహం... వీటికారణంగా గుండెసమస్యలు, నడుము, వెన్ను నొప్పులు...ఇవన్నీ జీవనశైలిలో లోపాల వల్లనే ఎక్కువగా వస్తున్నాయి. అంటే వీటిని నివారించే అవకాశం మన చేతుల్లోనే ఉందన్నమాట. జీవనశైలిని ఇలా మార్చుకుంటే...ఆరోగ్యాన్ని ఆహ్వానించవచ్చు మరి-**



మీరు మీ బరువుని అదుపులో ఉంచుకుంటున్నారా, ప్రతిరోజు పళ్లు కూరగాయలను కనీసం ఐదుసార్లయినా తీసుకుంటున్నారా, వారానికి అయిదుసార్లయినా...అరగంట, అంతకుమించి వ్యాయామం చేస్తున్నారా...ఈ ప్రశ్నలకు సమాధానాల్లోంచి మన జీవనశైలి మార్పులు మొదలవుతాయి. చాలా చిన్నపాటి మార్పులతో జాగ్రత్తలతోనే తీవ్రస్థాయి అనారోగ్యాలను నివారించే అవకాశం ఉంది.

- రోజుకి రెండుసార్లు నోటిని శుభ్రం చేసుకుంటూ దంతాల ఆరోగ్యంపై శ్రద్ధ పెడితే...తరచుగా వచ్చే దంత సమస్యలు రాకుండా ఉంటాయి.
- కంటినిండా తగినంత నిద్రపోవాలి. నిద్రతో ఒత్తిడి తగ్గటమే కాకుండా ఆకలి నియంత్రణలో ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. మరీ తక్కువ నిద్రపోతున్నవారు...రోజుకి కనీసం పదినిముషాల ముందు నిద్రకు ఉపక్రమించే అలవాటు చేసుకోవాలి.
- రోజుకి ఒక్కసారయినా కుటుంబంతో కలిసి భోంచేయటం అలవాటు చేసుకుంటే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను నేర్పటం సాధ్యమవుతుంది.
- ఎక్కువ సార్లు నవ్వటం అదీ పెద్దగా నవ్వటం అలవాటు చేసుకోండి...దీనివలన సమస్యలను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది.
- రోజూ ధ్యానం, ప్రార్థన అలవాటు చేసుకోండి. దీనివలన ఎమోషనల్ బ్యాలన్స్ సాధ్యమవుతుంది. బిపి సైతం అదుపులో ఉంటుంది.
- సాధ్యమైనంత వరకు రోజువారీ పనుల్లో నడిచేందుకు ప్రయత్నించండి. దీనివలన కేలరీలే కాదు..ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- నిటారుగా నిలబడండి. అలా నిలబడితే బరువు తగ్గిన అనుభూతి కలుగుతుంది.
- యోగా చేయటం వలన శరీరంలో బ్యాలన్స్ పెరుగుతుంది. దీనివలన కిందపడటం, దెబ్బలు తగలటం లాంటివి ఉండవు. అలాగే కదలికలు సులువు కావటం వలన కండరాల నొప్పులు, పట్టేయటం లాంటి సమస్యలు రావు.
- ఆహారంలో ప్రొటీన్లు పీచు ఉండేలా చూసుకోండి. ఈ తరహా ఆహారం...తిరిగి త్వరగా ఆకలి వేసేలా చేయదు. ఎక్కువ సమయం శక్తిని ఇస్తుంది. ప్రొటీన్లు పీచు ఉన్న ఆహారం తీసుకుంటే తక్కువ కేలరీలతోనే పొట్టనిండిన అనుభూతి కలుగుతుంది. నట్స్, కొవ్వు తక్కువగా ఉండే పాలతో తయారైన పదార్థాలు, బీన్స్, చేపలు, చికెన్ వంటిని తక్కువ పరిమాణాల్లో తీసుకోవచ్చు. అలాగే కూరగాయలు ఆకుకూరలు...ఇంకా రంగుల్లో ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోండి.
- ఎల్లప్పుడు పాజిటివ్‌గా ఆలోచించండి. వారానికి కనీసం 150 నిముషాలపాటు చాలా తీవ్రమైన స్థాయిలో ఎరోబిక్ వ్యాయామాలు చేయటం ఆరోగ్యానికి చాలామంచిది.

# రంగవల్లిక

## ముగ్గులు మీరూ పంపొచ్చు..!

| |
|---|
| 15 చుక్కలు |
| చుక్క విడిచి చుక్క |
| 7 వరుసలు |
| 7 వచ్చేవరకు |



**ముగ్గుని మందపాటి తెల్లకాగితంపై వేయాలి. స్కెచ్ పెన్నుతో ఔట్ లైన్ వేసి రంగులు నింపాలి. చుక కలు స్పష్టంగా కనిపించాలి. చుక్కల వివరాలతో పాటు మీ పేరు, పూర్తి చిరునామా రాయాలి. ఇ-మెయిల్ ( lifepage2012@gmail.com ) ద్వారా ముగ్గులు పంపవచ్చు.**



బి. సునీత సుధాకర్
పెబ్బేరు గ్రామం, వనపర్తి జిల్లా

**మా చిరునామా**
రంగవల్లిక
ఆంధ్రప్రభ
8-2-293/82/ఎ/75
ప్లాట్ నెం:75
రోడ్ నెం:9
జూబ్లీహిల్స్,
హైదరాబాద్- 500033

# పిల్లల పెంపకంలో... చిన్నోడు..పెద్దోడు...తేడాలొద్దు!

**తల్లిదండ్రులకు పిల్లలను పెంచడం అంత తేలిక కాదు సుమండి. ముఖ్యంగా ఒక్కరికంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా..అది వారి భవిష్యత్తుమీద ప్రభావం చూపుతుంది. ఉదాహరణకు ఇద్దరు పిల్లలు ఉన్నారు అనుకోండి.వాళ్లిద్దరిని సమానంగా చూడాలి. అందులో ఏమాత్రం తేడా వచ్చినా వారి మధ్య శత్రుత్వం ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే మీ పిల్లల మధ్య చిన్ననాటి నుంచి ఒకరంటే ఒకరికి వైరం పెరగకుండా ఉండాలంటే తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం!**

ఇద్దరు పిల్లల మధ్య వైరం పెరగడానికి తల్లిదండ్రుల ప్రవర్తన కారణం అవుతుంది. అందుకే ముందు మీ పిల్లల మధ్యశత్రుత్వానికి కారణాలు తెలుసుకోవాలి.

సాధారణంగా తల్లిదండ్రులు చిన్న వాళ్ల పట్ల అధిక శ్రద్ధ చూపుతూ,పెద్దవారిని కాస్త నిర్లక్ష్యం చేస్తుంటారు. ఎందుకంటే పెద్దవాళ్లు కదా, సర్దుకుంటారనే ఆలోచన. వారిని కూడా ఇలాగే పెంచామన్న భావన. కాని ఒక్కరు ఉన్నప్పుడు పిల్లలకు ఎక్కువ,తక్కువ అనే ఫీలింగ్ కలుగదు. కాని తమ్ముడో, చెల్లెలో ఉన్నప్పుడు మాత్రం అమ్మ లేదా నాన్న నాకంటే తమ్మునికి/ చెల్లికి ఎక్కువ ప్రియారిటీ ఇస్తున్నారనే ఫీలింగ్ మొదలవుతోంది. ఎందుకంటే చిన్నవాళ్లను కాస్త ఎక్కువ గారాబం చేస్తాం. అవసరమైతే పెద్దవాళ్ల ఆటల్లో చిన్నవాళ్లు ప్రవేశించి,మారాం చేస్తే పెద్దవాన్ని సర్దుకోమని చెబుతాం. లేదంటే వాడితో కలిసి ఆడోకోమని పురమాయిస్తాం.కానీ పెద్దయిన తర్వాత వాళ్లకు సొంత ఆలోచనలు ఉంటాయని,వాటికి ప్రాధ్యాన్యత ఇవ్వాలని ఆలోచించం.కానీఅలా చేస్తే, తనను నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన ఏర్పడి, అది తమ్ముడు లేదా చెల్లి మీద ద్వేషంగా మారి, వాళ్ల యసుతో పాటు పెరిగి పెద్దదవుతుంది. అది వారు కలిసిమెలిసి జీవించే వాతావరణాన్ని దెబ్బతీస్తుంది.

- ప్రతి ఇంటిలో తల్లిదండ్రులు పిల్లల మధ్య పోటీ పెంచి మంచిగా చదువుకోవాలని..మంచి ప్రవర్తన అలవరుచుకోవాలని ఇద్దరిని పోల్చుతుంటారు.అన్న లేదా తమ్ముడు చూడూ ఎంతబుద్ధిగా చదువుకుంటున్నాడో, లేదా ఆడుకుంటున్నాడో అంటూ పోల్చి చెబుతుంటారు.అలా చేడయడం కూడా ఇద్దరి మధ్య వైరానికి కారణం అవుతుంది.తల్లిదండ్రులు అలా ప్రవర్తించడం వల్ల, ప్రతిసారి తమ్మున్ని లేదా చెల్లిని పొగడుతూ, తనను తిడుతున్నారనే భావన పెద్దవారిలో గలుగుతుంది. అది వారిలో ఆత్మన్యూనతా భావానికి దారితీస్తుంది. తమ్ముడు లేదా చెల్లితో పోటీపడడానికి బదులు శత్రుత్వం పెంచుకుంటారు.

-పిల్లలు అన్నప్పుడు అల్లరిచేస్తుంటారు.. గొడవలు పడుతుంటారు. దానికి ఇద్దరిలో ఎవరోఒకరే కారణం అవుతారు. అందుకే పిల్లల మధ్య జరిగే చిన్నచిన్న తగాదాల విషయంలో చీటికిమాటికి జోక్యం చేసుకోవద్దు. జోక్యం చేసుకోవాల్సి వస్తే, చిన్నవాడు కదా తెలియక చేసుంటే నువ్వెందుకు వాడితో గొడవపడ్డావు.. ఏదైనా ఉంటే మాతో చెప్పాలిగా అంటూ.. పెద్దవాన్ని అల్లరికి బాధ్యున్ని చేస్తూ చిన్నవారిని వెనుకేసుకు రావద్దు . సాధ్యమైనంత వరకు నిష్పాక్షికంగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఎక్కువ శాతం పిల్లలే తమ సమస్యను పరిష్కరించుకునేలా చూడం ఉత్తమం.



# దినఫలాలు

### మేష రాశి
నూతన పనులకు శ్రీకారం చుడతారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు, ఇంక్రిమెంట్లు పొందుతారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

### వృషభ రాశి
పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఇంటాబయటా మీ మాటకు విలువ పెరుగుతుంది. విందు వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తులాభాలు ఉంటాయి.

### మిథున రాశి
ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా నిదానంగా, సకాలంలో పూర్తి చేస్తారు. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. స్వల్ప ధన లాభాలు ఉంటాయి.

### కర్కాటక రాశి
శ్రమ తప్ప ఫలితం ఉండదు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. మిత్రులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకుంటారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

### సింహ రాశి
నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సకాలంలో విజయవంతంగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. చేపట్టిన ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

### కన్య రాశి
రెండు, మూడు విధాలుగా ధనలాభాలు పొందుతారు. సంఘంలో గౌరవం పొందుతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

### తులా రాశి
ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. శ్రమ తప్పదు. పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

### వృశ్చిక రాశి
ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా నిదానంగా, సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యుల నుంచి సహాయసహకారాలు అందుకుంటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

### ధనుస్సు రాశి
ఇంట్లో శుభ కార్యాల గురించి కుటుంబ సభ్యులతో చర్చలు సాగిస్తారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. దూర ప్రాంతాల నుంచి కీలక సమాచారాం అందుకుంటారు.

### మకర రాశి
అనవసర విషయాలు, వివాదాలకు దూరంగా ఉండండి.ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది.

### కుంభ రాశి
సంఘంలోని ప్రముఖుల నుంచి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. కీలక నిర్ణయాలతో ఆలోచనలు శ్రేయస్కరం.

### మీన రాశి
చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా, సకాలంలో పూర్తి చేస్తారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. మిత్రులు, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. స్వల్ప ధనలాభాలు ఉంటాయి.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి



# అన్నీ ఇక్కడే!

స్వర్గం, నరకం ఈ రెండూ ఒకటేనా? వేర్వేరా? కలసి ఉండి వేర్వేరుగా అనిపిస్తాయా? అన్నీ అనుమానాలే, ప్రశ్నలే. ఇలా ఆలోచిస్తూ పోతే అంతా అయోమయం అనిపిస్తూ ఉంటుంది. అసంతృప్తిని మిగులుస్తుంది. సత్ప్రవర్తన, సచ్ఛీలత, సత్యశోధన, సత్సంకల్పం, ఇత్యాది మంచి విలువలతో మనిషి జీవనం చేస్తూ చెప్పింది తుచ తప్పకుండా ఆచరిస్తే మరణించిన తర్వాత ఆ మనిషికి స్వర్గం ప్రాప్తిస్తుందట.

## చింతన

పూర్వం ఒక మహనీయుడు తన శిష్యుణ్ణి పిలిచి, 'నీకు స్వర్గాన్ని ఇస్తాను కావాలా?' అని అడిగాడు. దానికా శిష్యుడు 'స్వామీ ఆ స్వర్గం అనేది ఏమిటో నాకు తెలియదు. ఎక్కడుంటుందో ఎలా ఉంటుందో నేను చూడలేదు. చూసిన వాళ్లెవరైనా ఉంటే వాళ్లను అడిగి తెలుసుకుందామంటే స్వర్గాన్ని చూసొచ్చిన వాళ్లు ఎవరూలేరు. ఏమాత్రం తెలియనిది, తెలుసుకోవడానికి సాధ్యపడనిది ఊహాజనితమైన ఆ స్వర్గం నాకెందుకు ? నాకు అక్కర్లేదు' అన్నాడు.

అవును! ఈ స్వర్గం, నరకం అనేవి ఎక్కడున్నాయో, అక్కడ ఎవరుంటారో మనకు తెలియదు. ఎలా ఉంటాయో, ఏమవుతుందో అసలు తెలియనే తెలియదు. అయినా ఈ స్వర్గం, నరకం గురించి మనం రోజూ వింటుంటాం. ఈ రెంటినిగురించి విచారిస్తుంటాం. స్వర్గం, నరకం ఈ రెండూ ఒకటేనా? వేర్వేరా? కలసి ఉండి వేర్వేరుగా అనిపిస్తాయా? అన్నీ అనుమానాలే, ప్రశ్నలే. ఇలా ఆలోచిస్తూ పోతే అంతా అయోమయం అనిపిస్తూ ఉంటుంది. అసంతృప్తిని మిగులుస్తుంది. సత్ప్రవర్తన, సచ్ఛీలత, సత్యశోధన, సత్సంకల్పం, ఇత్యాది మంచి విలువలతో మనిషి జీవనం చేస్తూ చెప్పింది తుచ తప్పకుండా ఆచరిస్తే మరణించిన తర్వాత ఆ మనిషికి స్వర్గం ప్రాప్తిస్తుందట. అక్కడ సర్వ సౌఖ్యాలు ప్రాప్తిస్తాయట! తాను న కాలంలో ఘోరాలు, పాపాలు చేసినట్టయితే మరణించిన తర్వాత నరకానికి పోతాడట. అక్కడ ఘోరమైన శిక్షలు అనుభవిస్తాడట.

మంచి విలువలతో కూడిన పనులు, పరోపకారయుతమైన కర్మలు, దాన ధర్మాలు, నిస్వార్థమైన సేవలు, పవిత్రమైన పుణ్య కార్యాలు, ప్రతిక్షణం చేస్తూ ఉంటే ప్రశాంతత లభిస్తుంది. మానసిక ప్రశాంతత వల్ల జీవితంలో సుఖం, సంతోషం లభిస్తాయి. తద్వారా ఆరోగ్యం అభివృద్ధి చెందుతుంది. ఆరోగ్యం మహాభాగ్యం కాబట్టి సుఖం, సంతోషం, తృప్తి, ఆనందం లభిస్తాయి. భౌతికానికి, ఆధ్యాత్మికానికి అన్వయించి ఉత్తమోత్తమ ఆధ్యాత్మిక తత్వాన్ని అవలోకనం చేయగలిగితే అదే స్వర్గం.

ఇక నరకం విషయానికి వస్తే మనకు తెలియకుండానే ఆరు అంతశ్శత్రువులు ఉన్నాయి. అవే అరిషడ్వర్గాలు, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు. ఇవి మన మీద అనుక్షణం స్వారీ చేస్తుంటాయి. మనల్ని అజయాయిషీ చేయటానికి ప్రయత్నిస్తుంటాయి, మనల్ని అథఃపాతాళానికి తోసివేయడానికి ప్రయత్నిస్తుంటాయి. అప్పుడు మనం మనలో ఉండే సమతుల్యతను కోల్పోతుంటాం. ఫలితంగా అశాంతి, అసౌకర్యం మన మీద దండెత్తుతాయి. అనారోగ్యం పాలవుతాం. వివేకం, విచక్షణ కోల్పోయి కష్ట నష్టాల ఊబిలో కూరుకుపోతాం. ఆ ఊబిలోనే ఉండిపోలేక, ఎంత ప్రయత్నించినా అందులో నుంచి పైకి రాలేక జీవితాంతం గిల గిల కొట్టుకుంటాం. ఇదే నరకమంటే! అశాశ్వతమైన, అల్పమైన విషయాల కోసం వెంపర్లాడటం నరకం. భౌతికమైన కారకాలను, ప్రేరకాలను అంటించుకోవటం నరకం. అశాంతి ప్రేరేపించే విషయాలతో అంటకాగటమే నరకం.

మొత్తంగా చెప్పాలంటే నిత్యమైన సత్యమైన శాశ్వత సౌఖ్యాల కోసం సాధన చేయటం స్వర్గం. పారమార్థిక సంపద కోసం ప్రయత్నించటం స్వర్గం. పారమార్థిక తత్వాన్ని పెంపొందించుకోవటానికి ప్రతి క్షణం పతితపించటమే స్వర్గం. ఇందుకోసం భార్యా బిడ్డల్ని సంసారాన్ని వదిలేసి సన్యాసులమై పోయి కొండల్లోనో, కోనల్లోనో అడవులలోనో తిరగాల్సిన అవసరం లేదు. అన్నిటిలోను ఉండాలి ఏ విషయంతోను అంటకాగకూడదు. ఇదే ఆధ్యాత్మిక తత్త్వంలో దాగున్న అసలు సిసిసలైన స్వర్గం.

ఉదాహరణకి నావ నీటిలో ఉంటుంది. అయినా నీటిలో ఏ విధమైన ఆపేక్ష లేకుండా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటుంది. నావ ఆ నీటితో కొంచెం రాగం, అనురాగం పెంచుకుని ఏ చిన్న రంధ్రం ద్వారానో ఆ నీటిలో కలవడానికి ప్రయత్నిస్తే నీటికి దాసోహమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ఆ నీరులా మనం ఉండగలిగితే అది స్వర్గం. ఉండలేకపోతే అదే నరకం.

ఈ విధంగా స్వర్గ నరకాలు రెండూ మనలోనే ఉన్నాయి. మన పక్క పక్కనే ఉంటాయి. వేర్వేరుగా ఉన్నట్టు అనిపిస్తూనే ఒక దానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి.

పాలు, నీళ్లని హంస వేరుచేయగలిగినట్లు జీవితంలో ప్రతి దశలోను, దిశలోను, పార్శ్వంలోను, వ్యూహంలోను , మంచి చెడులను క్షణ క్షణం విశ్లేషించుకుంటూ, విభజించుకుంటూ మంచిని అనుభవించటమే స్వర్గం. మంచిని అన్ని విధాలా అనుభవంలోకి తెచ్చుకోవడమే స్వర్గం. మంచిని మనసా వాచా కర్మణా అచరించలేకపోవడం, అనుభవించలేకపోవటం నరకం.

మనసు పరుగెత్తిన ప్రతి చోటుకి యన కన్ను పోకూడదు. కన్ను పడిన ప్రతి చోటుకి మనిషి పోకూడదు అంటారు పెద్దలు. కాబట్టి మనసు చెప్పినట్లు పరుగెత్తే దిశలో మనిషి పరుగు పెడితే నరకం. మనసు ప్రేరేపిస్తున్న దానిని వివేకంతో, విజ్ఞతతో బుద్ధిని ఉపయోగించి ఆలోచనలకతీతంగా మనిషి నడవగలిగితే జీవతాన్ని మలచుకోగలిగితే అది నిజమైన స్వర్గమే!

వెరశి స్వర్గమైనా నరకమైనా మతన చేతులలోను, చేతల్లోను ఉంటుంది. మన నడకలోను, నడవడికలోను ఉంటుంది. మనం పయనించే పథంలోనే అవి రెండూ ఉంటాయి. తదనుగుణంగా జీవితాలను తీర్చిదిద్దు కోవమే మన విధి. కర్తవ్యం!



రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

# జీవన ధర్మాలు సదా ఆచరణీయం

మహామనీషులైన వశిష్ఠ పరాశర వ్యాసాది మహర్షులు, గౌతమ బుద్ధుడు, శంకరాచార్యాది ప్రవక్తలు, తత్త్వవేత్తలు కారణ జన్ములైన పరశురామ, రఘురామ, బలరామ, శ్రీకృష్ణాది మహాపురుషులు మానవ శ్రేయస్సు కోసం ధర్మ రక్షణ కోసం దీక్షాపరులై మహత్కార్యాలు సాధించారు. మానవ జీవన ధర్మాలు నిర్వచించారు. భావితరాలకు మహత్తరమైన సత్సందేశాలు అందించారు. మానవ జన్మ ఇతర జీవుల జన్మలకన్న మహోన్నతమైనది. దుర్లభమైన ఈ జన్మలు లభించిన మానవులు దానికి అనుగుణమైన జీవన ధర్మాలను ఆచరించి, జన్మను సార్థకం చేసుకోవాలి. శ్రుతిస్మృతి పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు, కావ్యాల ద్వారా మహర్షులు, సుప్రసిద్ధ కవులు మానవాళికి సత్సందేశాలు అందించి మహోపదేశం చేశారు. మానవ జీవన ధర్మాలలో ప్రధానమైనది గృహస్థాశ్రమ ధర్మం. అనాది కాలం నుంచి సాగుతూ సనాతన ధర్మంగా పేరుపడిన ఇక్కడి ధర్మాలలో ముఖ్యమైనది గృహస్థాశ్రమ ధర్మం. ఈ ధర్మం అనేక రకాల జీవన ధర్మాలకు ఆధారంగా నిలిచింది. తల్లి తన సంతానాన్ని ప్రాణ ప్రదంగా చూసుకుంటూ పెంచటం మాతృధర్మం, పిల్లల బాధ్యత రక్షణ చూడటం పితృతర్మం. ఇలా ఎన్నో ధర్మాలు ప్రతి ఒక్కరికి ఉన్నాయి. అలా ఎవరి విధులను వారు తమ బాధ్యతగా సకాలంలో నిర్వహించడం వారి వారి జీవన ధర్మాలు.

ప్రతి మానవుడు సాటివారితో స్నేహ సంబంధాలు కలిగి ఉండడం, పరధనానికి, అక్రమ సంపాదనకు ఆశపడకుండా ఉండటం మాతాపితరుల పట్ల మాతృతేశం పట్ల భక్తి సేవా భావాలు కలిగి ఉండటం, పెద్దల పట్ల గౌరవం, వినయం కలిగి ఉండటం, సత్యనిష్ఠతో జీవించటం ఇవన్నీ మానవ జీవన



ధర్మాలు. భారతీయ గృహస్థాశ్రమ ధర్మానికి అనుబంధంగా ఉన్న ఈ ధర్మాలే ప్రపంచ తత్త్వవేత్తల ప్రశంసలు అందుకున్న భారతీయ సంస్కృతికి మూలం అన్నది అక్షరాలా సత్యం. ప్రపంచ మహాకావ్యాల్లో అగ్రశ్రేణి కావ్యంగా ప్రసిద్ధి పొందిన రామాయణ కథలో రాముడు సత్యవాక్పరిపాలన కోసం వన వాసానికి బయలుదేరాడు. పతివ్రతా శిరోమణి సీత భర్తతో పాటు బయలుదేరింది. రాముని వెన్నంటి నడిచి పత్నీ ధర్మాన్ని పాటించింది. ఆదర్శ దాంపత్యానికి సీతారాములు నిదర్శనంగా నిలిచారు. సూర్యుని నుంచి వెలుగు ఎలా విడదీయరానిదో నా నుంచి సీత అలా విడదీయరానిదని అన్నాడు రాముడు. బలమదాంధుడైన వనచర రాజు వాలి సోదర ధర్మాన్ని కాలరాచి సుగ్రీవుని భార్యను స్వాధీనం చేసుకుని అతనిని కిష్కింధానగరం నుంచి తన్ని తరిమేశాడు. సుగ్రీవుడు ఆత్మీయ మిత్రుడు ఆంజనేయునితో కలిసి రాముని ఆశ్రయించి కాపాడుమని అర్థించాడు. ఆర్తత్రాణ పరాయణుడైన రాముడు సుగ్రీవునికి అభయం ఇచ్చి మైత్రి నెరపి వాలిని కూల్చాడు. రాముడు ఇక్కడ మిత్ర ధర్మాన్ని చాటాడు.

అయితే ఇది అవతార పురుషుని లీలగా భావించరాదని చెప్పేందుకే తాను ఆచరించినవన్నీ మానవ జీవన ధర్మాలే అని చాటేందుకే ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజః (నేను మానవుడిని, రాముడిని దశరథుని కుమారుడను) అని నమ్రతగా చెప్పుకున్నాడు. ఏకపత్నీవ్రతుగా, సత్యనిష్ఠా గరిష్ఠునిగా మానవ జీవన ధర్మాలకు కట్టుబడి ఆదర్శ జీవితం గడిపాడు. మానవుల భావితరాలకు మార్గదర్శకుడయ్యాడు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలో భాగంగా జరిగిన సమరంలో రాముడు రావణుని వధించి, తాను అభయం ఇచ్చి ఆదరించిన రావణుని సోదరడు విభీషణునికి స్వర్ణమయమైన లంకా నగరాన్ని అప్పగించి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. దీనకంతటికీ కారణం రాముని ధర్మబద్ధమైన, నియమవ్రత జీవన విధానమే. ఆ మహనీయుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని మానవ జీవన ధర్మాల ఆచరణతో జాతి ప్రగతికి తోడ్పడే ఆలోచనలతో అందరూ ముందుకు సాగాలని కోరుకుందాం.

ఉలాపు బాలకేశవులు
704527928

## రుద్రగీత



# పరబ్రహ్మా విశ్వాధారుడు

**యోమాయయేదం పురురూపయా సృజత్**
**బిభర్త్త భూయః క్షపయత్య విక్రియః**
**యద్భేదబుద్ధిః సదివాత్మ్మత్మ దుఃస్థయా**
**తమాత్మతంత్రం భగవన్ ప్రతీమహి**

ఇంతవరకు బ్రహ్మ అనగా పరమాత్మ. వేదాంతములో పరమాత్మను బ్రహ్మ అనే వ్యవహరిస్తారు. ఆ పరబ్రహ్మ విశ్వాధారుడని చెప్పియున్నారు. ఇక ప్రపంచమునకు నిమిత్తకారణము, ఉపాదానకారణము పరబ్రహ్మయే అని చెప్పుచున్నాడు. పరమాత్మా! నీవు తాను ఆత్మగా కల విశ్వమును బహువిధములుగా పరిణమించు శీలముగల మాయచేత సృజించుచు భరించుచున్నావు. మరల సంహరించుచున్నావు. అయిననూ అనగా సృజించిననూ, భరించిననూ, సంహరించినను ఏ వికారము లేని వాడవు. ఆ మాయ ఆత్మదుఃస్థ జీవులయందు దుష్టముగా ఉండునది, సంసారరూపముగా అనర్థమును కలిగించునది ఉండు మాయ అని. ఈ మాయ వలననే నేను ఈశ్వరునకు శరీరము కాదు. ఈశ్వరుడు వేరు, నేను వేరు, ఈశ్వరుడు నాకు ఆత్మ కాదు అను భేదబుద్ధి కలుగును. విషయజ్ఞానమే సత్యము, శబ్ద స్పర్శాది విషయ అనుభవమే సత్యము.

మాయచే జీవులకు ఇట్లు భేదబుద్ధి కలిగించు స్వతంత్రుడవైన నిన్ను శరణు వేడుచున్నాము.

భాష్యము: ఇక్కడ మాయను ఆత్మదుస్థ అని చెప్పుట వలన జీవులకు సంసారమను దుఃఖమును, దుఃఖమును కలిగించునది పరమాత్మయందు జీవులకు అనర్థబుద్ధి కలిగించునది, జీవులకు భేదబుద్దిని కలిగించునది. ఆ భేదబుద్దియే దుఃఖమును కలిగించునది. ఆత్మ స్వతంత్రమైనది అని దేహమే ఆత్మ అను దేహాత్మ భ్రమకు కూడా ఈ భేదబుద్ధియే కారణము. పరమాత్మయే వికారము పొందనివాడు అని చెప్పుట వలన పరమాత్మయే ఉపాదానకారణమని తెలియుచున్నది. వికారము చెందనిది అని నిషేధము చెప్పుట వికారము కలుగుటకు అవకాశముంటే కలగనిది అని చెప్పవలయును. ఉపాదానము అన్నందువలన నిమిత్తమునకు వికారప్రసక్తి లేదు కూడా. ఉపాదానమునకు ప్రసక్తి ఉన్నదని, వికారము లేదని చెప్పియున్నారు. ఉపాదానము అనగా కలుగబోవు అవస్థా విశేషము కలదానికి అంతకు ముందున్న అవస్థా యోగము అని అర్థము. అనగా కుండగా మారబోవు మట్టిముద్ద రూపము ఉపాదానము అనబడును. అందువలన రాబోవు అవస్థతో సంబంధముండుటవలన వికారము కలుగు అవకాశమున్నందున వికారము కలగనిది అని నిషేధము చెప్పుటయుక్తమే. ఇచట పరమాత్మలో కలుగుచున్నది అను వికారము పరమాత్మ కంటే వేరుగాని విశేషణమైన చేతనా చేతనములలో నుండునది కావున విశేష్యమైన పరమాత్మలో ఎట్టి వికారము లేనందువలన అవి క్రియః అనినారు. అట్లు కానిమ్ము కాని ఘటమునకు నిమిత్త కారణమైన కులాలాదులకు(కుమ్మరికి) చెమట, అలసట ఆదిగా కల వికారములు కలుగును కదా! అట్లే పరబ్రహ్మలో కూడా నిమిత్తత్వప్రయుక్తమైన వికారము నిషేధించబడలేదు కదా! అందువలన నిమిత్తత్వ ప్రయుక్త వికారము పరమాత్మలో కలుగవచ్చును కదా అన్నచో అట్లు కాదు అనుచున్నారు 'తదైక్షత బహుస్యాం ప్రజాయేయ', 'తత్తేజొ సృజత' ఇత్యాది శ్రుతి వాక్యములతో పరమాత్మ తాను బహురూపములను పొందవలయును అని సంకల్పించి తేజస్సును సృజించెను అని చెప్పుట వలన సంకల్పమాత్రముచేతనే జగత్సృష్టిని కావించుచున్న పరమాత్మకు వికార ప్రసక్తియే లేదు. పరమాత్మ సంకల్పమే సృష్టిని జరుపుతున్నది అనినపుడు పరమాత్మకు శ్రమ ఎక్కడిది? స్వేదమెట్లు సంభవించును అని భావము. అందుకే సృజన్ అని నిమిత్తత్వమును చెప్పియున్నారు. ఇచట నిమిత్తత్వమనగా కర్తృత్వమే. ఇట్లు పరమాత్మలో విశిష్టత్వాకారముతో ఉపాదానత్తము నిష్కర్షించబడిన విశేష్యాకారముతో నిమిత్తత్వము అని తెలియవలయును. ఈ శ్లోకమున బిభర్తి అనుటవలన అనగా భరించుచున్నాడు అనుట వలన రక్షకత్వము, క్షపయతి నశింపచేయుచున్నాడు అనుట వలన సంహారకత్వము కూడా ఆ పరమాత్మకే కలదని సూచించబడుచున్నది. ఇచట ఆత్మతంత్రం అని స్వతంత్రుడు అని చెప్పుటవలన జీవులవలె కర్మవశ్యుడు కాడని తెలియుచున్నది. ఇట్లు ఈ శ్లోకముతో చెప్పబోవు శ్లోకముతో అనగా ఈ రెండు శ్లోకములతో 'బ్రహ్మవనం బ్రహ్మసవృక్ష ఆసీత్', 'యతోద్యావాపృథివీ నిష్ఠతక్షుః', 'మనీషిణో మనసాబ్రవీమిహా యదధ్య తిష్ఠద్భువనాని ధారయన్' అను శ్రుతి వాక్యముల అర్థముచెప్పబడిన ది.

బ్రహ్మయే వనము. బ్రహ్మమే వృక్షము. అనగా కారణమైన వృక్షము, ఆ వృక్షములతో యేర్పడు వనరూపకార్యము కూడా పరబ్రహ్మమే అని అర్థము. అతని వలననే భూమ్యాకాశములు ఆవిర్భవించినవి. జ్ఞానము కలవారు తమ జ్ఞానముతో ఈ విషయమును వివరించెదరు. భువనములను ధరించుచు భువనములను ధరించి ఉండెను అని పై శ్రుతి వాక్యములకు అర్థము. ఇట్లు బ్రహ్మవనం, బ్రహ్మసవృక్ష ఆసీత్ అనుట వలన కారణమే కార్యరూపును దాల్చినది అని కారణము కంటే కార్యము వేరు కాదని తెలియుచున్నది. అతనివలన భూమ్యాకాశములు ఆవిర్భవించినవి అనుట వలన సృష్టి కర్తృత్వము తెలియుచున్నది. జ్ఞానులు మనసుతో తెలియగలరు అనుటతో పరమాత్మ జ్ఞానమాత్ర వేద్యుడని తెలియుచున్నది. భువనములను ధరించుచు అధిష్టించి ఉండెను అనుట వలన ఆధారత్వము రక్షకత్వము బోధపడుచున్నది. ఇట్లు ఈ రెండు శ్లోకములలో కూడా ఇదియే బోధించబడినది. 'ఇచట కిం స్వీత్ వనం' ఇత్యాది శ్రుతివాక్యముతో వృక్షశబ్దముతో సూచించబడిన ఉపాదానత్వము వనశబ్దముతో సూచించబగిన ఆధారత్వము అధ్యతిష్ఠత్ అనుటవలన ఆధారత్వము నిమిత్తత్వము కిం అను ప్రశ్నపూర్వకముగా బ్రహ్మకే ఉపాదానత్వ ఉపాదానత్వ నిమిత్తత్వ ఆధారత్వములు ఇతనికే ఉన్నవని ప్రతిజ్ఞాపూర్వకముగా ప్రశ్నోత్తరములు ఈ వాక్యముల వలన తెలియుచున్నవి. ఎందుకనగా వృక్షశబ్దముతో సూచించబడిన ఉపాదానమైన పరబ్రహ్మనుండియే సకల జగత్తు నిష్ఠతక్షుః సృజించబుడినది అని చెప్పినారని తెలియవలయును.



డాక్టర్ కందాడై రామానుజాచార్య










# మనస్సుకు తగిలిన గాయాలు




విప్లవ్ కుమార్‌కు విపరీతమైన కోపం, అతడికి కోపం వచ్చినప్పుడు ఎదుటి వ్యక్తులు వినడానికి కూడా అసహ్యం కలిగించే బూతులు తిడతాడు. ఇంకా కోపం శృతిమించితే కొడతాడు కూడా. ఇది మంచి పద్దతి కాదని చాలామంది పెద్దలు విప్లవ్‌కుమార్‌ను హెచ్చరించారు. అయినా ఎవరి మాట లెక్కచేసే వాడు కాదు. తనకే అన్నీ తెలుసు అనే అహంభావంతో తనను మించిన మేధావి లేడనే భ్రమలో బ్రతుకుతూ కాలం వెళ్లగక్కుతున్నాడు. ఒకసారి నడవలేకపోతున్న ఒక ముసలి బిచ్చగాడు కాలుజారి రహదారిపై పడిపోయాడు. అతడి దుస్తులు చాలా మురికిగా ఉన్నాయి. చక్కటి దుస్తులు ధరించిన విప్లవ్‌కుమార్ ఆ సమయంలో ఆవైపుగా వస్తున్నాడు.

'' నాయనా! కాలుజారి క్రిందపడిపోయాను. కొద్దిగా పైకి లేపు బాబు! అంటూ బ్రతిమాలాడాడు వృద్ద బిచ్చగాడు.

''మతిగాని పోయిందా? నేను నిన్ను తాకడమేమిటి?'' అంటూ తిట్ల దండకం మొదలుపెట్టాడు. బిచ్చగాడు కాళ్లా వేళ్లా పడినా అతడిని కాలితో తన్ని అక్కడి నుండి వెళ్లబోయాడు విప్లవకుమార్. ''నీ కోపాన్ని ఇదే విధంగా కొనసాగించినట్లైతే నీకు పతనం తప్పదు'' అన్నాడు బిచ్చగాడు.

బిచ్చగాడి మాటలకు విప్లవ్‌కుమార్ కంగారు పడ్డాడు. ఎవరిని తిట్టినా, కొట్టినా అప్పటివరకు అతడి ముందే శాపనార్థాలు ఎవరూ చేయలేదు. ఒక్కసారి ఇటువంటి శాపనార్థాలు వినేపాటికి మనసులో ఏదో ఒకరకమైన తెలియని ఆందోళన అతడికి బయలుదేరింది. మరుసటి రోజు ఉదయాన్నే విప్లవకుమార్

ఇంటిముందుగా ఒక సర్వసంగ పరిత్యాగి వెళుతూ కనిపించాడు. విప్లవ్‌కుమార్ అతడిని కలిశాడు.

''స్వామి! రోజు రోజుకూ నాకు కోపం పెరిగిపోతుంది. దానివల్ల అందరూ నాకు దూరమౌతున్నారు. నన్ను శత్రువుగా చూస్తున్నారు. ప్రతి ఒక్కరూ నన్ను చీత్కారంగా, అసహ్యపడుతున్నట్లు చూస్తున్నారు. చాలా బాధగా ఉంది. కోపాన్ని అదుపులో ఉంచుకోవాలంటే ఏం చేయాలి? అని అడిగాడు.

''నాయనా! నీకు కోపం వచ్చినప్పుడు నీకు చాలా దూరంగా ఉన్న ప్రదేశానికి వెళ్లి అక్కడున్న చెట్టులో ఒక ఇనుప మేకును దిగకొట్టి తిరిగి ఇంటికి రా! అన్నాడు సర్వసంగ పరిత్యాగి.

విప్లవకుమార్ కోపం వచ్చినప్పుడల్లా తన ఇంటికి దూరంగా ఉన్న ఒక చెట్టు వద్దకు వెళ్లి దానిలో ఇనుప మేకును దిగగొట్టి తిరిగి ఇంటికి చేరుతున్నాడు., ఈ కార్యక్రమం నెలపాటు సాగింది. కోపం వచ్చినప్పుడల్లా పరుగులు తీస్తూ చెట్టు వద్దకు వెళ్లడంతో విప్లవ కుమార్ అలసిపోయేవాడు. దాంతో కోపానికి స్వస్తి పలికాడు. నెల రోజుల తర్వాత ఆ సర్వసంగ పరిత్యాగి విప్లవ కుమార్‌కు తారసపడ్డాడు.

''స్వామీ! మీరు చెప్పినట్లే చేశాను. నా కోపం తగ్గింది'' అన్నాడు విప్లవకుమార్.

నువ్వు ఇనుపమేకులు దిగకొట్టిన చెట్టు వద్దకు తీసుకుని వెళ్లు నాయనా! అన్నాడు సర్వసంగ పరిత్యాగి.

విప్లవకుమార్ ఆ సర్వసంగ పరిత్యాగికి చెట్టు వద్దకు తీసుకుని వెళ్లాడు.

ఇప్పుడు ఆ మేకులను బయటకు తీ నాయనా'' అన్నాడు సర్వసంగ పరిత్యాగి.

విప్లవ కుమార్ చెట్టుకు దిగకొట్టిన మేకులను చాలా కష్టపడి బయటకు తీశాడు. అతడు మేకులు తీసేసిన ప్రదేశంలో చిన్న చిన్న గుంటలు కనిపించాయి.

'' చూశావా నాయనా! నువ్వుచెట్టులో దిగగొట్టిన మేకుల వల్ల చెట్టుకు ఎన్ని తూట్లూ పడ్డాయో? నువ్వు ఇతరులకు మన స్తాపం కలిగించే అసభ్య పదజాలంతో తిట్టినప్పుడు ఇదే విధంగా వారి మనసుకు గాయం అవుతుంది. వాళ్లంతా ఎంత బాధపడి ఉంటారో ఒకసారి ఆలోచించు? అన్నాడు సర్వసంగ పరిత్యాగి.

సర్వసంగ పరిత్యాగి మాటలు విన్న విప్లవకుమార్ తాను తిట్టి, కొట్టినప్పుడు ఇతరుల మనసుకు తగిలిన గాయాలను తలచుకుని బాధపడ్డాడు. ఈ విధంగా చేసినందువల్లనే అందరూ తనను చీత్కరించుకుని, మనస్సులోనే అసహ్యించుకున్నట్లు తెలుసుకున్నాడు. ఆనాటి నుండి కోపాన్ని తగ్గించుకుని ఇతరుల మనస్సుకు గాయాలు తగిలే పనులు చేయకుండా అందరి ప్రశంసలందుకుని ఉత్తమ పౌరుడిగా పేరు తెచ్చుకున్నాడు.

-షేక్ అబ్దుల్ హకీంజాని
తెనాలి, 9949429827




రోజు కొన్ని క్షణాలు పిల్లలతో
గడపడం అనేది తండ్రి
తన పిల్లలకు ఇవ్వగల
అతి ఉత్తమమైన వారసత్వం

- ఒ.ఎ. బటిస్టా

**బాలగేయం**

## పరిశుభ్రత

స్నానంతో ఒంటికి
పరిశుభ్రత కలుగునట్లు
చీపురుతో ఇంటికి
పరిశుభ్రత మెలగునట్లు
పరిసరాలనూ కూడ
పరిశుభ్రత గుంచాలి! .. స్నానంతో,,

పనికిరాని చెత్తనంతా
పక్కయింటిలో వేయక
వీధిలో విసిరివేయక
విధిగ చెత్తకుండిలోనె
పదిలంగా వేయాలి!

పరిశుభ్రత పెంచాలి!
నిర్మలమగు నీటినే
నిత్యము సేవించాలి!
ఎక్కడ పడితే అక్కడ
అవసరాలు తీర్చుకోక
మలమూత్రాలకు ఎప్పుడూ
మరుగుదొడ్లె వాడాలి! ..
స్నానంతో..

డాక్టర్. వడ్డేపల్లి కృష్ణ
సెల్ నెం: 9246541699

# కాకి పగ చల్లారదు



పిల్లలూ! ఈ రోజు కాకి గూర్చి తెలుసుకుందాం. నల్లగా నిగనిగలాడే కాకి ఈ ప్రపంచంలో అత్యంత తెలివైన పక్షుల్లో ఒకటిగా నిలిచింది. కాకి పిల్ల కాకికి ముద్దు అనే సామెతలు మనం వినే ఉంటాం. కాకుల్లో ఐకమత్యం ఎక్కువగా ఉంటుంది. తన కంటే పెద్దవైన గద్దలను కూడా అవి తరిమి తరిమి కొడతాయి. వాటి ఐకమత్యం చూసి గద్దలు కూడా తోక జాడిస్తాయి. కాకుల్లో ఏదేని కాకి చనిపోతే చుట్టుపక్కల ఉన్న కాకులన్నీ వచ్చి విచారం వ్యక్తం చేస్తాయి. ఒక గుంపు మాదిరిగా వచ్చి కాకులు అరుస్తున్నాయంటే కాకికి ప్రమాదం లేదా చనిపోవడం జరిగితే అవి అలా వాలతాయి. ప్రపంచంలోని అన్ని దేశాల్లో కాకి ఆనవాళ్లు కనిపిస్తాయి.

**40 రకాలు**

కాకులు అనేక రకాలు. దాదాపు 40 రకాలు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వీటికి కమ్యూనికేషన్ స్కిల్స్ ఎక్కువే. ఎందుకంటే అవి అరిచే అరుపుల్లో తేడాలను బట్టి అర్థం మారిపోతుంది. అన్ని కాకులు కావ్ కావ్ అంటాయి. ఈ కావ్ కావ్ ఉచ్చరణను బట్టీ అర్థంచేసుకోవాలి. కాకులు మనుషులను గుర్తిస్తాయి. మన చుట్టుపక్కల ఎగిరే కాకులు మన ముఖాలను చూసి గుర్తుపడతాయి. ఈ కారణంగానే ఎవరైనా ఆహారం అందించడం అలవాటు చేస్తే అవి మర్చిపోవు. మీరు ఎక్కడికి వెళ్లినా కాకులు మన వెంటే వస్తాయి. మనం సాధారణంగా పాములు పగబడతాయని అనుకుంటాం. కానీ కాకులు పగ ప్రతీకారాలకు నిలువుటద్దాలు.మనుషుల చేతిలో కాకి చనిపోతే అవి పగబడతాయి. రోడ్డు మీద వెళుతున్నప్పుడు ముఖ కవలికలను గుర్తించి మిగతా కాకుల బలగంతో సమూహంగా వస్తాయని పక్షి ప్రేమికులు చెబుతున్నారు. కొన్ని సంవత్సరాలు గడిచినా కాకి మాత్రం పగ తీర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది.



**ప్రపంచ**

**వింతలు-విశేషాలు**

## తేడా కనుక్కోండి



ఈ రెండు చిత్రాల్లో ఉన్న తేడాను కనుక్కోండి?

# పక పక



### నిలువుగా

టీచర్: చెర్రీ! పరీక్షపేపర్‌లో మన స్కూల్ పేరు రాయమంటే ఇలా నిలువుగా రాశావేంటి?

చెర్రీ: మీరే కదా టీచర్. మన పాఠశాల పేరును ఎప్పుడూ నిలబెట్టలన్నారు!



### తీర్చుకోలేనని

సన్నీ: ఇన్నేళ్లయింది. నా అప్పు తీర్చవా?
హరి: అప్పుడే చెప్పాగా
సన్ని: ఏమని?
హరి: మీ రుణం జన్మలో తీర్చుకోలేనని!

## క్విక్ ఆన్సర్

1. భారత్ ఇప్పటివరకూ ఎన్నిసార్లు వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్స్‌కు వెళ్లింది?
2. ప్రపంచకప్‌లో భారత జట్టుకు మొదటి కెప్టెన్ ఎవరు?
3. 2011లో భారత్ ఫైనల్‌లో ఏ దేశంపై నెగ్గి కప్ గెలిచింది?

## పొడుపు కథలు

1. వేలెడెంత ఉండడు కానీ, మనం బయటకు వెళ్లాలన్నా... ఇంట్లోకి రావాలన్నా.. తోడు ఉండాల్సిందే.

2. చెక్కని స్తంభం, చెయ్యని కుండ, పొయ్యని నీరు, వేయని సున్నం. తాగితే చల్లగా ఉండు

## మన దేశానికి ఆనుకుని ఉన్న నాలుగుదేశాల భౌగోళిక చిత్రాలు




1. పాకిస్తాన్ 2. నేపాల్ 3. అఫ్ఘనిస్తాన్ 4. చైనా

**జవాబులు!**

పొడుపు కథలు : 1. తాళం చెవి 2. కొబ్బరి బొండాం
క్విక్ ఆన్సర్: 1. మూడు 2. ఎస్. వెంకట రాఘవన్ 3. శ్రీలంక




బాలకృష్ణ , వేదిక

## రూలర్

# కుదరని కమర్షియల్ ఫార్ములా..

బాలకృష్ణ ద్విపాత్రాభినయంలో దర్శకుడు కేఎస్ రవికుమార్ చేసిన సినిమా రూలర్. ఈ చిత్రాన్ని సి కళ్యాణ్ నిర్మించారు. వేదిక, సోనాల్ చౌహాన్ నాయికలుగా నటించారు. పండక్కి నెల ముందే తెరపైకి వస్తున్నామంటూ చెప్పుకున్న రూలర్ సినిమా...ఆ స్థాయి వినోదాన్ని అందించిందా లేదా..సమీక్షలో చూద్దాం..

హీరోను తిరుగులేని శక్తిగా చూపించడం తెలుగు సినిమా నైజం. మారుతున్న కాలంతో పాటు వాణిజ్య విలువలు మారుతూ వస్తున్నాయి. అలా మార్చుకున్న చిత్రాలకే ఆదరణ దక్కుతోంది. వీటివల్లే సినిమా ఆడుతుందని అనుకుంటే పొరపాటే. గతంలో హీరో ఇలాంటి కథతో చేసిన సినిమా హిట్ అయ్యిందట అని ఇప్పుడూ అదే చేస్తే ఆ సిని మా కాలం చెల్లిందే అవుతుంది. రూలర్ ఈ ప్రమాదంలో పడిందా...?

### కథేంటంటే..

అతిపెద్ద సాఫ్ట్ వేర్ కంపెనీకి యజమాని సరోజినీ ప్రసాద్ (జయసుధ) ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరుతుంది. ఆమెను బంధువులే చంపాలని యత్నిస్తారు. ఈ సమయంలో ఓ అనామక యువకుడు తన ప్రాణాలు ఒడ్డి ఆమెను కాపాడుతాడు. తనను కాపాడిన అతన్ని కొడుకుగా స్వీకరించి, వ్యాపార వారసుడిగా ప్రకటిస్తుంది. దీంతో అర్జున్ ప్రసాద్ (బాలకృష్ణ) సాఫ్ట్ వేర్ కంపెనీ అధిపతి అవుతాడు. మరో రాష్ట్రంలో వ్యాపార విస్తరణ కోసం సరోజినీ ప్రసాద్ వెళ్లగా..అక్కడి స్థానిక రాజకీయ నాయకుడు భవానీనాథ్ ఠాగూర్ (పరాగ్ త్యాగి) ఆమెను అడ్డుకుని అవమానిస్తాడు. తల్లిని కించపరిచిన వాళ్లపై ప్రతీకారంతో ఆ రాష్ట్రం వెళ్తాడు అర్జున్ ప్రసాద్. అక్కడి ప్రజలు అతన్ని ధర్మ(బాలకృష్ణ) గా గుర్తిస్తారు. ఈ ధర్మ ఎవరు, అర్జున్ ప్రసాద్‌కు అతనికి సంబంధమేంటి, అక్కడి ప్రజల ఇబ్బందుల నేపథ్యమేంటి అనేది మిగతా కథాంశం..

రివ్యూ

### ఆకర్షణలు...

హీరో చుట్టూ తిరిగే కథ ఇది. అందులో ద్విపాత్రాభినయం. తొలి భాగం, మలిభాగం ఆయనే కనిపిస్తారు. ఆత్మహత్యకు పాల్పడే ఓ అమ్మాయిని కాపాడే సన్నివేశంలో బాలకృష్ణ హెలికాప్టర్ పై వచ్చి కాపాడటంతో సినిమా ప్రారంభమవుతుంది. కొనసాగింపుగా పాట వస్తుంది. ఇలా మంచి ఊపుతో రూలర్ మొదలవుతుంది. రెండు పాత్రల్లో బాలకృష్ణ నటన పాత్రోచితంగా ఉంది. సంగీత దర్శకుడు చిరంతన్ భట్ స్వరపర్చిన పాటల్లో యాల యాల పాట గుర్తుండిపోతుంది. ఫైట్స్ కమర్షియల్ సినిమా మీటర్‌కు సరిపోయాయి.

### వికర్షణలు...

రూలర్ చాలా పాత కథ. చాలా అంటే చాలా పాతది. ఈ కథనం ఎన్నో సినిమాల్లో చూసిందే. ఎన్నెన్నో సినిమాల్లో. కనీసం నలభై ఏళ్ల క్రితం కూడా ఈ కథ పాతదే అనుకుంటారు. హీరో గతాన్ని మర్చిపోవడం మరెన్ని సినిమాల్లో చూసుంటారు. ఆర్కియాలజీ డిపార్ట్ మెంట్ వాళ్లు వెతకాల్సిన సినిమా ఇది. హీరో పాత్రను ఎలాంటి హేతుబ ద్ధత లేకుండా చూపించారు. నాయికలను మరీ బొమ్మలను చేసేశారు. మాస్ మెప్పు కోసం వాళ్లను కావాల్సినంత స్వేచ్ఛగా చూపించారు. తొలిభాగంలో రఘుబాబు, ధన్ రాజ్, రఘు కారుమంచితో చేయించిన కామెడీ మొత్తం వృథా. ద్వితీయార్థంలో సప్తగిరి పాత్ర కూడా నవ్వించలేక తేలిపోయింది. రూలర్ సినిమా చూస్తున్నప్పుడు గతంలో చూసిన అనేక ఫార్ములా చిత్రాలు గుర్తుకురావడం సహజం.

**చివరగా...** కుదరని కమర్షియల్ ఫార్ములా..

**రేటింగ్ 2.5/5**



## చిరంజీవి అతిథిగా..

సూపర్‌స్టార్ మహేష్ హీరోగా దిల్‌రాజు శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సమర్పణలో జి.ఎం.బి. ఎంటర్‌టైన్‌మెంట్, ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అనిల్ రావిపూడి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'సరిలేరు నీకెవ్వరు'. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో ప్రత్యేక పాత్రలో విజయశాంతి నటిస్తున్నారు. జనవరి 11న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. కాగా, ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను జనవరి 5న హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ ఫంక్షన్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొనబోతున్నారు. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా సూపర్‌స్టార్ మాట్లాడుతూ ''మా ఆహ్వానాన్ని మన్నించి మా సినిమా ప్రీ రిలీజ్ సెలబ్రేషన్స్‌కి రావడానికి అంగీకరించినందుకు చిరంజీవిగారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మా సినిమా ఫంక్షన్‌కు మీరు రావడం మాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. మీ రాకతో మా హ్యాపీనెస్ రెట్టింపు అవుతుంది. మా యూనిట్ అంతా ఈ ఫంక్షన్‌ను ఓ ల్యాండ్‌మార్క్ ఈవెంట్‌గా సెలబ్రేట్ చేసుకుంటుంది. సర్, మీ రాక కోసం ఎదురుచూస్తున్నాను'' అన్నారు.

సూపర్‌స్టార్ మహేష్, రష్మిక మందన్న, ప్రత్యేక పాత్రలో లేడీ అమితాబ్ విజయశాంతి, రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్, సంగీత, బండ్ల గణేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్, రత్నవేలు, కిశోర్ గరికిపాటి, అజయ్ సుంకర, తమ్మిరాజు, రామ్‌లక్ష్మణ్, యుగంధర్ టి. ఎస్.క ష్ణ సాంకేతిక వర్గం.

# ఇక విహారానికి వెళ్లొస్తా...!

ఒక్కోసారి ఒక్కొక్కరికి కాలం కలిసొస్తుంటుంది. ఈ ఏడాది బాలీవుడ్ లో కృతి సనన్‌కు బాగా కలిసొచ్చింది. ఆమె అగ్ర నాయికను చేసిన సంవత్సరం. లూకా చుప్పీతో వంద కోట్ల రూపాయల సినిమా దక్కగా...హౌస్ ఫుల్ 4, కలంక్ లాంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో నటించే అవకాశం దొరికింది. ఇలా చూస్తుండగానే స్టార్ హీరోయిన్ అయ్యింది కృతి. ఇప్పుడు కొన్ని ప్రయోగాత్మక చిత్రాలు చేసే వీలు ఆమెకు చిక్కింది. సంపాదించిన తర్వాత రిస్కు నిర్ణయాలు తీసుకున్నట్లు...పేరొచ్చాక ఇప్పుడు సాహసోపేతమైన కథలు ఎంచుకుంటోంది కృతి. ఇలా ఆమె చేస్తున్న ప్రయత్నమే మిమి. ఈ చిత్రంలో కృతి సరోగేట్ మదర్‌గా కనిపించబోతోంది. కృతి లాంటి యువతారకు తల్లి పాత్రను పోషించడం సవాలే. రిస్కు తీసుకుంటోంది కృతి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం నలభై శాతం పూర్తయింది. దినేష్ విజాన్ నిర్మాణంలో లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జాతీయ పురస్కారం పొందిన మరాఠీ ఫిల్మ్ మలా ఆయి వాచ్చీకి మిమి హిందీ రీమేక్. ఈ సందర్భంగా కృతి మాట్లాడుతూ... మిమి తాజా షెడ్యూల్ రాజస్థాన్‌లోని మండావాలో పూర్తి చేశాం. సినిమా చిత్రీకరణలో నలభై శాతం పూర్తయింది. మళ్లీ ఫిబ్రవరిలో తదుపరి షెడ్యూల్ మొదలుపెడతాం. అప్పటిదాకా నేను విహారానికి వెళ్తున్నా. ఈ ఏడాది నేను నటించిన నాలుగు సినిమాలు విడుదల య్యాయి. చాలా శ్రమించాను. ఇక ఇప్పుడు విశ్రాంతి తీసుకునే సమయం వచ్చింది. స్నేహితులతో కొన్నాళ్లు గడిపేందుకు సిద్ధమవుతున్నా. అని చెప్పింది.


కృతి సనన్

## హీరో హీరోయిన్
# 27న వస్తున్నారు!


నవీన్ చంద్ర, గాయత్రి

నవీన్ చంద్ర, గాయత్రీ సురేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'హీరో హీరోయిన్'. అడ్డా సినిమా ఫేమ్ జి.కార్తీక్‌రెడ్డి దర్శకుడు. భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్ విడుదల చేశారు. సూపర్ రెస్పాన్స్ వస్తోందని చిత్ర యూనిట్ తెలిపింది. తాజాగా పర్వట్ పాటను రిలీజ్ చేశారు. అమ్మాయిలను టీజ్ చేస్తూ సాగే ఈ పాట క్యాచీగా ఉంది. అనూప్ సంగీతం, పూర్ణచారి సాహిత్యం అందించారు. పైరేటెడ్ ప్రేమకథా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం సెన్సార్ కూడా పూర్తిచేసుకుంది. ఈ నెల 27న విడుదలకు సిద్ధమైంది.

డింపుల్ చొపాడియా, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, జయప్రకాష్, శివన్నారాయణ ప్రధాన తారాగణం.

ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఛాయాగ్రహణం: వెంకట్ గంగాధరీ, ఫైట్స్: రియల్ సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : వంశీకృష్ణ, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: జి.కార్తీక్ రెడ్డి.

# సందేశం... వినోదం..!

'చీమ - ప్రేమ మధ్యలో భామ' ఓ ఫాంటసీ మిళితమైన ప్రేమకథా చిత్రం. యువత మాత్రమే కాదు కుటుంబ ప్రేక్షకులు చూసి ఆనందంచే చిత్రమని నిర్మాత లక్ష్మీనారాయణ అంటున్నారు. చిత్ర దర్శకుడు శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు తనకున్న న్యూయార్క్ ఫిల్మ్ అకాడమి అనుభవాన్ని రంగరించి ఈ సినిమా రూపొం దించారని చెప్పారు.


ఇందు

''సందేశం, వినోదం కలిపి ఈ సినిమా తీసినట్టు'' దర్శకుడు శ్రీకాంత్ తెలిపారు. ''అంతఃకరణశుద్ధితో అడుగు వేస్తే ఎవరేమి కావాలనుకున్నా నెరవేరుతుంది అనే సందేశం ఇందులో ఉందని, పైగా ఈ సినిమా ప్రభాస్ అభిమానులకు నచ్చుతుందని అంటున్నారు. వివరాలు తెలియాలంటే కొద్ది రోజులు ఆగాలని '' ఆయన చెప్పారు.

మాగ్నమ్ ఓపస్ ఫిలిమ్స్ పతాకంపై శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు దర్శకత్వంలో ఎస్ఎన్. లక్ష్మీనారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అమిత్, ఇందు హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. సుమన్, హరిత, పురంధర్, వెంకట్ నిమ్మగడ్డ, రమ్యచౌదరి, బొమ్మ శ్రీధర్ ఇతర పాత్రధారులు.

సంగీతం: రవివర్మ, ఛాయాగ్రహణం: ఆరిఫ్ లలాని, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు.



## ప్రతిరోజూ పండగే..

# కొరత కథలో కొంత కామెడీ...

వినోదాత్మక అంశాలను నేపథ్యంగా ఎంచుకుని సినిమాలు రూపొందించడంలో దర్శకుడు మారుతికి పేరుంది. ఆయన భలే భలే మగాడివోయ్, మహానుభావుడు చిత్రాలు ఇలాగే విజయాలు సాధించాయి. ప్రతిరోజూ పంగడే అంటూ మరోసారి కుటుంబ కథతోనే సినిమా చేసి విజయం సాధించాలనే ప్రయత్నించారు మారుతి. సాయి ధరమ్‌తేజ్, రాశీఖన్నా, సత్యరాజ్, రావు రమేష్ ప్రధాన పాత్రల్లో నటించిన ప్రతిరోజూ పండగే ఎలాంటి ఫలితాన్నిచ్చింది..? సమీక్షలో చూద్దాం..

### కథేంటంటే...

రఘురామయ్య (సత్యరాజ్) పిల్లలంతా విదేశాల్లో స్థిరపడతారు. తండ్రిని చూసేందుకు వాళ్లకు సమయం ఉండదు. కేన్సర్ బారిన పడిన రఘురామయ్య తన పిల్లలకు ఈ విషయాన్ని తెలియజేస్తూ వాళ్లతో చివరి రోజులు గడపాలని ఉందని కోరుతాడు. తీరిక లేని పనుల్లో ఉన్న వాళ్లంతా తండ్రి అనారోగ్య పరిస్థితికి కూడా స్పందించరు. మనవడు సాయి (సాయి ధరమ్‌తేజ్) ఉన్నపళంగా తాత దగ్గరకు పయనమవుతాడు. తన కుటుంబ సభ్యులనూ ఊరికి రప్పించేందుకు యత్నిస్తాడు. ఆ కొద్ది జీవిత కాలం తాతను సంతోషంగా ఉంచేందుకు మనవడు చేసిన పనులేంటి, వాటి పర్యవసానాలు ఏంటి అనేది మిగతా కథ..

### ఆకర్షణలు..

కుటుంబంగా కలిసుండాలి అనేది ప్రతి ఒక్కరిలో ఉన్నా, మన వాస్తవ జీవితం వేరుగా ఉంటుంది. కానీ తల్లిదండ్రులను వదిలి ఉండాలని కాదు. చివరి రోజుల్లో అయినా అయిన వాళ్లకు దగ్గరగా ఉండాలి, వాళ్లను సంతోషంగా ఉంచాలనే అంశం మంచిది. ఈ కథలో అప్రయత్నంగా కొంత హాస్యం ఉంది. దాన్ని దర్శకుడు ఉపయోగించాడు. ప్రధాన పాత్ర ధారులు ఇందుకు బలమయ్యారు. సాయి ధరమ్ తేజ్, సత్యరాజ్, రావు రమేష్ నటన ఈ బలహీన కథను కాస్తో కూస్తో నిలబెట్టింది. కొన్ని పాత్రల ద్వారా వినోదం పండింది.

రివ్యూ

### వికర్షణలు..

బలహీన కథ ఇది. దీన్ని సినిమాగా మార్చాలంటే చాలా సృజనాత్మక ప్రయత్నం కావాలి. మారుతికి అంత సమయం లేదేమో పూర్తిస్థాయిలో ఈ కథను డెవలప్ చేయలేకపోయాడు. కథలో ఉన్న కొద్ది అవకాశాన్ని కామెడీకి ఉపయోగించుకున్నాడు. భావోద్వేగ సన్నివేశాలు మాత్రం పూర్తిగా తేలిపోయాయి. ప్రధాన పాత్రలు వదిలిస్తే రావు రమేష్ లాంటి మిగతా చాలా క్యారెక్టర్‌ల ప్రవర్తన అసహజంగా అనిపిస్తుంటుంది. కొడుకులు, తండ్రిని ఇలా కూడా చూస్తారా అనిపిస్తుంది. బయట ఇలా జరిగితే దినపత్రికల్లో వార్తలు రాసుకుంటారు. ఇంకా పోలేదేంటి నాన్న అనే అర్థమొచ్చే సంభాషణలు పిల్లల పాత్రలతో చెప్పించారు దర్శకుడు. ఇలా రెండు భాగాల్లోనూ అనాసక్తిగా సాగే కథ, ముగింపుకొచ్చేసరికి మరింత తేలిపోయింది. క్లైమాక్స్ ఇంతే అనేట్లుంది ముగింపు.

**చివరగా...**

ఏడిపించే కథలో నవ్వించే ప్రయత్నం...

**రేటింగ్ 2.75/5**

# నేరస్థుడు తప్పించుకోలేడు..!

'అక్కడొకటుంటాడు' ఫేమ్ శివ కంఠమనేని కథానాయకునిగా రూపొందుతున్న చిత్రానికి రాఘవరెడ్డి అనే టైటిల్ ఖరారు చేశారు. 'క్రిమినల్ కెనాట్ ఎస్కేప్' అనేది ఉప శీర్షిక. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను జి.రాంబాబు యాదవ్, ఆర్.వెంకటేశ్వరరావు, కెఎస్. శంకరరావు నిర్మిస్తున్నారు. నందితా శ్వేత, రాశి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా కోసం హైదరాబాద్‌లోని ఓ పబ్‌లో శివ కంఠమనేని, స్నేహా గుప్తా తదితరులుపై ''చదివిందే నే టెన్త్‌రో... అయ్యింది డాక్టర్'' అనే పల్లవి గల పాటని తెరకెక్కిస్తున్నారు. బాను మాస్టర్ నృత్యరీతులు సమకూర్చుతున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నటుడు అజయ్ ఘోష్ మాట్లాడుతూ ''టైటిల్ నాతో అనౌన్స్ చేయిస్తారని అనుకోలేదు. చాలా సంతోషంగా ఉంది. ఇందులో ప్రధాన విలన్‌గా నటిస్తున్నాను'' అని అన్నారు.

హీరో శివ మాట్లాడుతూ ''కొత్త కాన్సెప్ట్‌తో తీస్తున్న చిత్రమిదని '' పేర్కొన్నారు.

దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ ''నేరం చేసిన వాళ్ళు ఎక్కడ ఉన్నా విశ్లేషించి పట్టుకోగలిగే పాత్రలో శివ కనిపిస్తారు. కథ అంతా ఆయన పాత్ర చుట్టూ తిరుగుతుంది.నందితా శ్వేతా మంచి పాత్ర చేసింది'' అని అన్నారు.

చిత్ర నిర్మాతలు, నటి స్నేహాగుప్తా కూడా మాట్లాడారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎస్ఎన్. హరీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గంటా శ్రీనివాసరావు, సంగీతం: యశస్విని గున్ను, సుధాకర్ మారియో.



# ఐయామ్ ఎ బ్యాడ్ కాప్

రజినీకాంత్ స్టైల్‌కు ఓ ప్రత్యేకత ఉంటుంది. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'దర్బార్' ట్రైలర్‌లో ఈ ప్రత్యేకత ఉంది. రజినీ పలికిన ''సార్ వాళ్ళకి చెప్పండి పోలీసుల దగ్గరికి లెఫ్ట్‌లో రావొచ్చు, రైట్‌లో రావచ్చు... స్ట్రయిట్‌గా రావద్దని... ఐయామ్ ఎ బ్యాడ్ కాప్.. '' అంటూ చెప్పిన డైలాగ్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. మురుగదాస్ దర్శకత్వంలో రూపొం దుతున్న దర్బార్ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. లైకా ప్రొడక్షన్ పతాకంపై ఎ.సుభాస్కరన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రజిని ఆదిత్య అరుణాచలంగా పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపిస్తారు. అభిమానులకు కావాల్సిన అన్ని అంశాలు జోడిస్తూ మురుగదాస్ తెరకెక్కించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన ఎన్.వి.ప్రసాద్ ఈ చిత్రాన్ని కొత్త సంవత్సరంలో సంక్రాంతికి విడుదల చేస్తున్నారు. ఇందులో సునీల్ శెట్టి విలన్‌గా నటించడం విశేషం. సంతోష్‌శివన్ విజువల్స్, అనిరుద్ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా హీరోయిన్‌గా నయనతార నటిస్తోంది. మరోక ముఖ్యపాత్రలో నివేత థామస్ నటిస్తోంది. తంబీ రామయ్య, యోగిబాబు, ప్రతీక్ బబ్బర్, నవాబ్‌షా ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం సంతోష్ శివన్, సంగీతం అనిరుద్ రవి, చందర్న్.


రజినీకాంత్

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076